చదవండి... చదివించండి... 1952
విశాలాంధ్ర
జాతీయ తెలుగు దినపత్రిక
చందా వివరాలు
సంవత్సరం చందా రూ. 1000/-లు
అర్థ సంవత్సరం చందా రూ. 500/-లు
3 నెలల చందా రూ. 250/-లు
నెల బిల్లు రూ. 95/-లు
విడి పత్రిక రూ. 3/-లు
ఆదివారం రూ. 4/-లు
వివరములకు సంప్రదించండి 7995009615

www.visalaandhra.com Dwaraka
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సారథం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
38 Securing Your Future
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
sricharanmedia.com

సంపుటి : 66 సంచిక : 213 | బుధవారం 24-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



ఇక్కడ క్యాషియర్‌తో పనేలేదు.!

- కంప్యూటర్ విజన్, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, సెన్సార్ల సాయంతో నిర్వహణ
- అమెరికాలో అమెజాన్ అద్భుత ప్రయోగం

సియాటెల్ :
సాధారణంగా షాప్‌లలో క్యాషియర్లు డబ్బు తీసుకుని వస్తువులు ఇస్తారు. కొన్నిచోట్ల తగినంత డబ్బు తీసుకుని వస్తువులు ఇచ్చే మెషీన్లూ ఉన్నాయి. కానీ ఈ రెండూ లేకుండా నేరుగా షాప్‌కు వెళ్లి కావాల్సినవి తీసుకుని తర్వాత డబ్బు చెల్లించేలా ఉంటే ఎలా ఉంటుంది. అలా ఎలా కుదురుతుంది అనుకుంటున్నారా.. కుదిరేలా చేసింది ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్. ఇలాంటి స్టోర్‌ను అమెరికాలోని సియాటెల్‌లో ప్రారంభించింది కూడా. రిజిస్టర్లు, క్యాషియర్లు, కార్డు స్వైప్స్.. ఇలాంటివేమీ అక్కడ ఉండవు. ప్రస్తుతం ఈ స్టోర్ పనితీరును అమెజాన్ పరీక్షిస్తోంది. సియాటెల్‌లోని కంపెనీ హెడ్‌క్వార్టర్స్ కింద ఫ్లోర్‌లో స్టోర్‌ను ప్రారంభించింది. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించి కంప్యూటర్ విజన్, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, సెన్సార్ల సాయంతో వినియోగదారులు తీసుకునే వస్తువులను గుర్తించేలా ఏర్పాట్లు చేశారు. ఈ స్టోర్‌లో పాలు, ఆలూ చిప్స్, సలాడ్స్, శాండ్‌విచెస్ తదితర అప్పటి కప్పుడు తినే రకరకాల స్నాక్స్ ఉంటాయి. దీన్లోకి వెళ్లాలంటే స్మార్ట్‌ఫోన్‌లో 'అమెజాన్ గో' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్‌ను స్టోర్ ముందు స్కాన్ చేస్తే తలుపు తెరుచుకుంటుంది. అందులో షెల్ఫ్‌లో ఉన్న వస్తువులు తీసుకుంటే సెన్సార్లు గుర్తించి ఆ వస్తువును యాప్‌లోని వర్చువల్ కార్ట్‌లో చేరుస్తాయి. ఒకవేళ ఆ వస్తువు తిరిగి షెల్ఫ్‌లో పెట్టేస్తే మన కార్ట్‌లో నుంచి తొలగిపోతాయి. మన కార్ట్‌లోని

- మిగతా 2 లో

ఆ మూడే చేటు

- వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, స్వార్థచింతన
- డబ్ల్యూఈఎఫ్ సదస్సులో ప్రధాని మోడీ

దావోస్ :
ప్రపంచం ఈరోజు మూడు అతి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అవి వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, స్వార్థచింతనగా ఆయన వివరించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) సదస్సులో మంగళవారం మోడీ ప్రసంగిస్తూ ఈ విషయాలను ప్రస్తావించారు ఈమూడు సవాళ్లను ఎదుర్కొనేందుకు భిన్న సమూహాలుగా చీలిన అంతర్జాతీయ సమాజం ఐక్య కార్యాచరణను అమలు జరపాల్సిన అవసరం ఉందని మోడీ అన్నారు. ఇందుకు అవసరమైన ఏకాభిప్రాయ సాధనను సాధించాల్సి ఉందన్నారు. సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన అత్యంతాధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మానవ దైనందిన వ్యవహారాల్లో సాంకేతికత పెనవేసుకుపోయిందన్నారు. అదే సమయంలో డేటా అనేది ఒక పెద్ద వరంగానూ, దాని పరిరక్షణ సవాలుగానూ నిలిచిందన్నారు. వాతావరణ మార్పుల సవాలును సకాలంలో చక్కదిద్దకపోతే ఆర్కిటిక్ హిమనీనదాలు నీరుగారిపోయే ప్రమాదం ఉందన్నారు. అధిక వర్షాలు, వర్షాభావ, భరింపశక్యం కాని ఎండ, వడగాలులు, అపరిమిత శీతల వెరసి మనిషి మనుగడకు సవాలు విసిరే శీతోష్ణ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. మానవాళికి పెనుముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రతి దేశమూ కలిసి రావాలన్నారు. ఈవిషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు ఎంత వరకు సహకరిస్తాయనేది అనుమానాస్పదంగానే ఉందన్నారు. ఇటీవలి కాలంలో స్వీయరక్షణాత్మక ధోరణులు, స్వార్థ చింతన ఎక్కువైన తీరు ప్రమాద హేతువుగా సవాలు విసురుతోందన్నారు. ప్రపంచం ఎదుర్కొనే సవాళ్లను కట్టడి చేసేందుకు భారత్ ఎల్ల వేళలా తన వంతు సహాయ సహకారాలను అందించిందన్నారు. ప్రపంచంలో శాంతి పరిరక్షణ కోసం ఉద్దేశించి ఐక్యరాజ్యసమితి సారధ్యంలోని శాంతి పరిరక్షణ దళానికి బలగాలను సమకూర్చామన్నారు. ఇరుగు పొరుగు దేశాల్లో నెలకొనే సంక్షోభాల పరిష్కారం విషయంగానూ భారత్ సహకార స్ఫూర్తితో వ్యవహరిస్తోందన్నారు. ప్రపంచీకరణ రాగ్రాను కుంచించుకుపోతోందన్నారు. ప్రపంచ ఆర్థిక, భద్రత సంస్థల్లో సంస్కరణలు అమలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సంపద, ఆరోగ్యం, శాంతి, సుస్థిరతలు కోరుకునే వారందరినీ భారత్‌కు ఆహ్వానిస్తున్నానని మోడీ చెప్పారు.


ప్రపంచ ఆర్థిక సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

అభివృద్ధిలో భారత్‌ది 62వ స్థానం 11లో

పెట్రో మంట..!



- రికార్డు స్థాయిలో ధరల పెరుగుదల
- బీజేపీ పాలనలోనే అత్యధిక మోత
- ఎక్సైజ్ డ్యూటీ కోతకు మంత్రిత్వశాఖ వినతి
- విజయవాడలో పెట్రోల్ 78.14, డీజిల్ 70.21 రూపాయలు
- ముంబైలో రూ.80 దాటిన పెట్రోల్ ధర

న్యూఢిల్లీ :
కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోలు, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. దేశవ్యాప్తంగా సగటున లీటరు పెట్రోలు ధర రూ.80లకు చేరింది. డీజిల్ లీటరు ధర రూ.65లకు చేరింది. విజయవాడలో పెట్రోల్ లీటర్ 78.14 రూపాయలు, డీజిల్ 70.21గా ఉంది. దీంతో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో ఎదుర్కొనే విపత్తు తప్పటం లేదు. నిత్యావసర ధరలు పెరిగి ద్రవ్యోల్బణం విజృంభించే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీల రోజువారీ మదింపు జాబితా ప్రకారం మంగళవారం ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.72.38కు చేరింది. ఇది 2014 మార్చి నాటి ధరతో పోల్చితే చాలా ఎక్కువే. డీజిల్ ధర లీటరుకు రికార్డు స్థాయిలో రూ.63.20ను తాకింది. ముంబైలో ఈ రేట్లు మరింత అధికంగా ఉన్నాయి. ముంబైలో పెట్రోల్ ధర 80 మార్కును దాటింది. డీజిల్ రూ.67.30 వద్ద అమ్ముడుపోతుంది. ముంబైలో లోకల్ సేల్స్ టాక్స్, వ్యాట్ రేట్లు అధికంగా ఉండటంతో, పెట్రోల్, డీజిల్ ధరలు అక్కడ మరింత ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది. డిసెంబర్ మధ్య నుంచి డీజిల్ ధరలు లీటరుకు రూ.4.86 పెరిగినట్టు చమురు కంపెనీల డేటాలో వెల్లడైంది. అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు ఎక్కువగా పెరుగుతుండటంతో, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయని ఆయిల్ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ క్రమంలో వచ్చే వారంలో పార్లమెంట్‌కు సమర్పించనున్న 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ఎక్సైజ్ డ్యూటీని కోత పెట్టాలని ఆయిల్ మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరుతోంది. ప్రీ-బడ్జెట్‌కు ముందు సమర్పించిన మెమోరాండంలో ఈ ప్రతిపాదనను ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ముందు ఉంచినట్టు

- మిగతా 2 లో

'ఇమ్మిగ్రేషన్' వచ్చేసింది

విశాలాంధ్రబ్యూరో - అమరావతి
విజయవాడ సమీపంలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హోదా లభించింది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టును కేంద్ర హోం మంత్రిత్వశాఖ మంజూరు చేసింది. కస్టమ్స్ సెంటర్

- త్వరలోనే కస్టమ్స్ విభాగం
- రెండు నెలల్లో విదేశీ విమానాలు
- గన్నవరం ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయహోదా
- సివిల్ అథారిటీ విజయవాడ డీసీపీ గజరావు భూపాల్

కూడా ఏర్పాటైతే రెండు నెలల్లో విదేశీ విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇటీవలే ఇమ్మిగ్రేషన్ విభాగం ఉన్నతాధికారులు గన్నవరం ఎయిర్‌పోర్టును సందర్శించి ఇక్కడి మౌలిక సౌకర్యాలు, సెక్యూరిటీ తదితర వాటిని పరిశీలించారు. వాస్తవానికి ఈ నెల రెండో తేదీన కేంద్ర హోంశాఖ ఇమ్మిగ్రేషన్ విభాగం నుంచి ఇందుకు సంబంధించినన సమాచారం



రాష్ట్రానికి వచ్చింది. దీనిపై ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. గన్నవరం ఎయిర్‌పోర్టులో విదేశీ విమాన ప్రయాణికుల రాకపోకల కోసం ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టును ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్ -1 గజరావు భూపాల్‌ను సివిల్ అథారిటీగా నియమిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ ఉత్తర్వులు

- మిగతా 2 లో

టెట్ టెన్షన్

- ఆన్‌లైన్ మాక్ టెస్టులపై గందరగోళం
- వెబ్‌సైట్‌లో కన్పించని ప్రాక్టీస్ పేపర్లు..!
- అభ్యర్థుల అవస్థలు
- నేటి నుంచి హాల్ టిక్కెట్లు
- భాషా పండితులకు భారీ సిలబస్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది.ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 15వరకూ ఆన్‌లైన్లో టెట్ పేపర్-1,2,3 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది.ఏపీ ప్రభుత్వం ఇచ్చిన టెట్ రివైజ్డు నోటిఫికేషన్లో భాగంగా ఈ నెల 23వ తేదీ నుంచి ఆన్‌లైన్లో అభ్యర్థుల కోసం మాక్ టెస్టులను అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు.మంగళవారం స్కూలు ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో మాక్ టెస్టుల వివరాల్ని ఎక్కడా అందుబాటులో ఉంచలేదని పలువురు అభ్యర్థులు నిరుత్సాహానికి గురయ్యారు. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో టెట్‌ను నిర్వహిస్తున్నారు.అభ్యర్థులు అవగాహన కోసం మాక్ టెస్టులపై వారంరోజులపాటు ప్రాక్టీస్ చేయాల్సి ఉంది.కంప్యూటర్‌పై పరిజ్ఞానం లేని వారికి పరీక్షా హాలులో

- మిగతా 2 లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్. పక్కన నారాయణ, ముప్పాళ్ల, చలసాని తదితరులు

ఎందుకీ జాప్యం..

- 108 మంది ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోరా ?
- 8వేల కోట్ల ఆస్తులుండగా తాత్సారమెందుకు
- ప్రభుత్వాలు మేలు చేస్తానంటే కోర్టులు అడ్డురావు
- 'అగ్రి'బాధితుల రౌండ్‌టేబుల్ సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ :
ఏదైనా ప్రజా సమస్య మీద ప్రభుత్వాలు ముందుకొచ్చి మేలు చేస్తాయంటే ఏ కోర్టులూ అడ్డురావని, 32లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు గత మూడు సంవత్సరాలుగా రోజూ చచ్చి బతుకుతుంటే కోర్టులు పేరు చెప్పి ప్రభుత్వాలు కాలయాపన చేయడం ఏమాత్రం క్షంతవ్యం కాదని జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. స్థానిక హనుమాన్‌పేటలోని చలసాని వేంకటరత్నం హాలులో మంగళవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పుకన్నా ఆస్తులు ఎక్కువ

- మిగతా 2 లో

ఇదీ లోకం!



కదం తొక్కిన స్కీం వర్కర్లు

- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, భారీ ప్రదర్శనలు
- కనీస వేతనం రూ. 18వేలు చెల్లించాలి
- కార్మికులుగా గుర్తించాల్సిందే: జి ఓబులేసు

11లో


విజయవాడ ధర్నాలో మాట్లాడుతున్న ఓబులేసు

పద్మావత్‌ను ఆపేది లేదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- రాజస్థాన్, మధ్యప్రదేశ్ పిటిషన్ కొట్టివేత
- తీర్పుకు కట్టుబడాల్సిందే : అన్ని రాష్ట్రాలకు ఆదేశం



9లో

దుర్గగుడి ఈవోగా పద్మ



నలుగురు ఐఏఎస్‌లు బదిలీ

విజయవాడ కనకదుర్గ గుడి ఈవోగా డాక్టర్ ఎం.పద్మను నియమించారు. ప్రస్తుతం పద్మ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరిస్తున్నారు.

2లో

ఇండోనేషియాలో భూకంపం



జకార్తా : ఇండోనేషియాలో మంగళవారం భూకంపం సంభవించి జకార్తా నగరాన్ని వణికించింది. అయితే ఈ భూకంపంలో ఎవరైనా మరణించిందీ లేనిదీ ఇంకా తెలియలేదు. భూకంపం రిక్టర్ స్కేలుపై 6గా నమోదయ్యింది. జావా దీవిలో భూకంపం సంభవించినట్టుగా అమెరికా భూగర్భ సర్వే అధికారులు తెలియజేశారు. అనేకమంది ప్రజలు జకార్తా విధుల్లో పరుగులుతీశారు. కొంతమంది భవనాలపైకి వెళ్లి భూకంపం తీవ్రతను గమనించారు. 3 నుండి 4 నిముషాలసేపు ప్రకంపనలు ఉన్నాయని జకార్తా పౌరులు తెలిపారు.ఈ ప్రకంపనాలకు అనేక భవనావు కదలిపోయాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చారు.ఇండోనేషియాలో భూకంపాలు చాలా తరచుగా సంభవిస్తున్నాయి.

పెన్స్ ప్రసంగం తీవ్రవాదులకు వరం

పాలస్తీనా విముక్తి పోరాట సంస్థ విమర్శ

జెరూసలెం : అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ఇజ్రాయిల్ పార్లమెంటులో చేసిన ప్రసంగం తీవ్రవాదులకు వరంలాంటిదని పాలస్తీనా విముక్తి పోరాటసంస్థ విమర్శించింది. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను గుర్తించిన నిర్ణయానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. సమస్యను సృష్టించిన వారిలో అమెరికా కూడా ఉందని పాలస్తీనా పేర్కొంది. తమ రాయబార కార్యాలయాన్ని టెలిఅవీవ్ నుంచి జెరూసలెంకు రెండేళ్లలోపే మార్చివేస్తామని పెన్స్ చెప్పారు. జెరూసలెంని ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్టు గత డిసెంబర్ 6న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన తరువాత ఇజ్రాయిల్, పాలస్తీనా మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ట్రంప్ ప్రకటనను ఐరాసాతో సహా అనేక పదుల దేశాలు ఖండించాయి.

విశాలాంధ్ర ప్రపంచం

టెర్రరిస్టులకు కాదు.. మాకు సహకరించాలి

అమెరికాను కోరిన టర్కీ విదేశాంగమంత్రి



అంకారా : సిరియాలో అమెరికా టెర్రరిస్టులకు కాకుండా తమకు సహకరించాలని ఇందుకు ఆదేశం సుముఖత వ్యక్తం చేయగలదన్న టర్కీ విదేశాంగమంత్రి మెవ్లట్‌కవుసొగ్లు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సిరియాలో తమకు సహకరించడంపైనే రెండు దేశాల మధ్య సంబంధాలు ఆధారపడి ఉంటాయని ఆయన అన్నారు. హెబర్‌టర్క్ వార్తాపత్రిక విలేకరితో ఆయన మాట్లాడుతూ సిరియానుంచి కుర్దులు ప్రజారక్షణ యూనిట్ల వెనుకదాగి టర్కీపైన కాల్పులు జరిపి ఉంటారని అమెరికా విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్సన్ సందేహాలను వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో టర్కీ మంత్రి మాట్లాడుతూ మాదేశాన్ని కాపాడుకునేందుకు నేను చర్యలు తీసుకుంటున్నాను. లేకపోతే మాదేశం ప్రమాదంలో పడుతుంది. ఎవరికీ భయపడబోము. చనిపోవలసివస్తే చనిపోతాముకాని భయపడబోమని ఆయన అన్నారు. సిరియాలో సైనిక చర్య తీసుకునేముందు సంబంధిత పక్షాలన్నిటికీ ఈ అంశాన్ని తెలియజేశామని ఆయన చెప్పారు. మా లక్ష్యం సిరియా, రష్యా, అమెరికా కాదుర, టెర్రరిజంపై పోరాటమే. అది అఫ్రిన్ లేదా మన్‌బిజ్ లేదా ఉత్తర ఇరాక్ అయినప్పటికీ టెర్రరిస్టులపైన మా దాడులు ఆగవ్. ఈ ప్రాంతాల్లో టెర్రరిస్టులు ఉంటే మాకు ముప్పు కలుగుతుంది. సిరియాలోని కుర్దులకు అమెరికా తన ఆయుధాలను సరఫరా చేయడం నిలిపివేస్తేనే రెండు దేశాల మధ్య సంబంధాలు కొనసాగుతాయని టర్కీ డిప్యూటీ ప్రధానమంత్రి బెకిర్‌బోజ్‌డగ్ అమెరికాకు స్పష్టం చేశారు. గతంలో కుర్దులకు సరఫరా చేసిన ఆయుధాలను కూడా వెనక్కు తెప్పించుకోవాలని ఆయన కోరారు. సిరియాలోని దాదాపు 170కి పైగా కుర్దులు తిష్టవేసుకుని ఉన్న లక్ష్యాలను ఛేదించేందుకు టర్కీ సైనిక దళాలు దాడులు జరిపాయి.

మళ్లీ పనిచేస్తున్న అమెరికా ప్రభుత్వం

తాత్కాలిక ద్రవ్య వినియోగ బిల్లుకు ఆమోదం

వాషింగ్టన్ : తాత్కాలిక ద్రవ్య వినియోగబిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదించడంతో ప్రభుత్వం మళ్లీ పనిచేయడం ప్రారంభించింది. మూడు రోజుల ప్రతిష్టంభన అనంతరం ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి కొనసాగుతున్నాయి. సెనేట్‌లో డెమోక్రాట్లు ఎట్టకేలకు తమ పట్టువదిలి బిల్లును ఆమోదించారు. ఈ బిల్లు గడువు ఫిబ్రవరి 8తో ముగుస్తుంది. సోమవారం రాత్రి కాంగ్రెస్ ఉభయసభలు ద్రవ్యబిల్లును ఆమోదించాయి. అయితే అక్రమంగా దేశంలోకి వచ్చిన వలసదారుల పిల్లలను తిరిగి వారి సొంత దేశాలకు పంపే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటామని పాలక రిపబ్లికన్లనుంచి హామీ పొందిన తరువాతనే డెమోక్రాట్లు ద్రవ్య వినియోగ బిల్లును ఆమోదించారు. బిల్లుపైన అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసిన తరువాత ఇది తమ విజయంగా చెప్పుకున్నారు. సెనేట్‌లో 81-18 ఓట్ల తేడాతో, ప్రతినిధుల సభలో 266-150 ఓట్ల తేడాతో ద్రవ్య వినియోగ బిల్లు ఆమోదం పొందింది. ఫిబ్రవరి 8వ తేదీవరకు ప్రభుత్వ ఖర్చులకు ఈ బిల్లు ద్వారా



నిధులు సమకూరుతాయి. అయితే దీర్ఘకాలిక ప్రభుత్వ వ్యయానికి సంబంధించిన నిధులను సమకూర్చే అంశంపైన కూడా రెండు పక్షాలు ఒక అంగీకారానికి రావలసి వుంటుంది. అలాగే అక్రమ వలసలపైన కూడా అవగాహన కుదరవలసి ఉంది. 3 రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభన మంగళవారంతో ముగిసి యధావిధిగా ప్రభుత్వ కార్యకలాపాలు నడుస్తున్నాయి. తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వేలాదిమందికి ఇది తిరిగి ఊపిరిపోసింది. అనేకవేల మందికి శనివారం నుండి వేతనాలు లేవు. వారందరికీ ఈ నిర్ణయం ఊరట కలిగిస్తుంది. సైన్యానికి, సరిహద్దు గస్తీదళానికి ఇన్సూరెన్స్ అవసరమైన పిల్లలకు ముందుగా నిధులు సమకూరుస్తామని ట్రంప్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ వలసలకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ట్రంప్ అన్నారు. డెమోక్రాట్లతో విభేదాలను చర్చించి పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వైట్‌హౌస్ పేర్కొన్నది. ఇదిలావుండగా దిగుమతి చేసుకునే వాషింగ్ మిషన్లు, సౌరవిద్యుత్తు ప్యానల్స్‌పైన దిగుమతి సుంకాలు విధించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికా ఫస్ట్ వాణిజ్యవిధానం కింద స్థానిక ఉత్పత్తిదారులను రక్షించేందుకు ఈ చర్య తీసుకున్నట్టు వైట్‌హౌస్ ప్రతినిధి తెలిపారు. ఈ నిర్ణయం వల్ల చైనా, దక్షిణకొరియా దిగుమతులపైన తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది.

జింజ్‌యాంగ్ సరిహద్దుల్లో గోడ

బీజింగ్ : చైనా పశ్చిమ ప్రాంతంలోని జింజ్‌యాంగ్ రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు ఆ ప్రాంత సరిహద్దుల్లో గోడను నిర్మించనున్నట్టుగా ప్రభుత్వ మీడియా తెలియజేసింది. ఈ సమాచారాన్ని ప్రాంతీయ గవర్నర్ చెప్పినట్టుగా మీడియా వెల్లడించింది. గత అనేక సంవత్సరాలుగా సరిహద్దుల్లో ఘర్షణలు చెలరేగుతూ వందలాదిమంది చైనా ప్రజలు మరణిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. జింజ్‌యాంగ్ సరిహద్దుల్లోగల యుగుర్లు జింజ్‌యాంగ్ ప్రజల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. వీరిలో అత్యధికులు ముస్లింలు. వీరు టర్కిక్ భాషను మాట్లాడతారు. ఇస్లాం తీవ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని వేర్పాటువాద గ్రూపులు కూడా వారికి సహకరిస్తున్నాయని చైనా ఆరోపిస్తోంది. అయితే యుగుర్లు మాత్రం చైనా తమ సంస్కృతిని, మతాన్ని నియంత్రిస్తున్నదని చెప్తున్నారు. అయితే తాము ఎలాంటి అణచివేత చర్యలకు పాల్పడటంలేదని చైనా పేర్కొన్నది.

జపాన్‌లో బద్దలైన అగ్నిపర్వతం

టోక్యో : జపాన్ సెంట్రల్ ప్రాంతంలోని కొండపైన గల రిసార్ట్‌వద్ద అగ్నిపర్వతం బద్దలై బండరాళ్లు ఎగిరిపడి ఆ ప్రాంతంలోవున్న స్కయర్లపై (పైనుంచి కిందకు పారాచూట్ల ద్వారా దిగేవాళ్లు) పడి 15 మంది గాయపడినట్టు మీడియా వార్తలు తెలియజేస్తున్నాయి. గాయపడిన వారిలో భూతలం స్వీయరక్షణ దళాలకు చెందిన ఆరుగురు కూడా ఉన్నట్టు రక్షణమంత్రిత్వశాఖ తెలియజేసింది. అగ్నిపర్వతం నుంచి ఎగిసిపడి వచ్చిన రాళ్లవల్ల ఎక్కువ నష్టం జరిగిందని మీడియా తెలిపింది. అగ్నిమాపక, ప్రకృతి విపత్తు సహాయ ఏజెన్సీ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బండరాళ్లు పడిన ప్రాంతం నుంచి మరో ముగ్గురిని రక్షించారు. బద్దలైన అగ్నిపర్వతంనుంచి తీవ్ర



వేడితో కూడిన రాళ్లు పుటస్టు పట్టణంపైన పడుతున్నప్పటికీ ఆ ప్రాంతంలో భారీగా మంచుకురవడంవల్ల స్కయర్లు పెద్దగా నష్టపోకుండా బయటపడ్డారు. మంగళవారం ఉదయం అగ్నిపర్వతం బద్దలైనట్టుగాచ జపాన్ వాతావరణ పరిశీలనాసంస్థ తెలియజేసింది.

భారత్-పాక్‌లు చర్చించాలి : గుటెర్రస్



ఐరాస : సరిహద్దుల్లో ఘర్షణలు నివారించేందుకు భారత్, పాకిస్తాన్‌లు చర్చలు జరపాలని రెండు పక్షాలు కాల్పులను విరమించాలని, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ సూచించారని ఆయన ప్రతినిధి స్టీఫెన్ డుజెర్రిక్ తెలిపారు. రెండు దేశాల సరిహద్దుల్లో కాఉల్పులు జరుపుతున్న విషయాన్ని 10 రోజులుగా గమనిస్తున్నామని అందువల్లనే అపరిష్కృత సమస్యలను పరిష్కరించుకునేందుకు చర్చలు జరపాలని గుటెర్రస్ సూచించారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారంలో గుటెర్రస్ ఎందుకు భాగస్వామికావటంలేదని ప్రశ్నించగా ఆయన పలుకుబడి ఎప్పుడూ అందుబాటులోనే ఉంటుందని డుజర్రిక్ చెప్పారు.ఐక్యరాజ్యసమితి భాగస్వామి కావాలని ప్రతి ఒక్కరూ కోరుకోవలసిన అవసరం ఉంది.. మధ్యవర్తిత్వానికి అంగీకారం అవసరం అని అన్నారు. పాకిస్తాన్‌తో గల సమస్యలను పరిష్కరించుకునేందుకు మూడవపక్షం జోక్యం అవసరంలేదనిభారత్, పాకిస్తాన్‌లు భావిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా భారత్, పాకిస్తాన్‌ల సరిహద్దుల్లో జరిగిన కాల్పుల్లో 12 మందికిపైగా చనిపోయారు.

'ఇమ్మిగ్రేషన్' వచ్చేసింది

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేశారు. గన్నవరం ఎయిర్‌పోర్టుకు విదేశీయులు రావాలన్నా, ఇక్కడ నుంచి వెళ్లాలన్నా విధిగా సివిల్ అథారిటీ అనుమతి ఉండాల్సిందే. 1948 ఫారినర్స్ చట్టంలో 3(1)(ఏ), 5(1)(ఎ) ప్రకారం విదేశీ విమాన ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ అనుమతి పొందాల్సి ఉంటుంది. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విదేశాలకు విమాన సర్వీసులు నడపాలంటే విధిగా ఇమ్మిగ్రేషన్‌తోపాటు కస్టమ్స్ విభాగం ఉండాలి. వాటిలో ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టుకు గ్రీన్ సిగ్నల్ లభించగా, త్వరలోనే కస్టమ్స్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. గతంలోనే కస్టమ్స్ విభాగం అధికారులు ఎయిర్‌పోర్టులో కస్టమ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ విభాగాలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను అధికారులు సిద్ధం చేశారు. రాజధాని అమరావతికి విదేశీయులు రాకపోకలు జరిపేందుకు వీలుగా అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుపుతామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి పీ అశోక్ గజపతిరాజు ఇటీవలే ముంబై విమాన సర్వీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే గన్నవరానికి ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టు మంజూరవ్వటం, సివిల్ అథారిటీగా డీసీపీ-1 గజరావు భూపాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఇమ్మిగ్రేషన్ విభాగానికి అవసరమైన చెక్ పాయింట్, లగేజీ తనిఖీ విభాగానికి అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయి. ఇమ్మిగ్రేషన్ అధికారులు మరోసారి గన్నవరం వచ్చి కంప్యూటర్లు, ఎలక్ట్రికల్ పరికరాలను సమకూర్చుకోవాల్సి ఉంది. మరోవైపు ఇమ్మిగ్రేషన్ విభాగానికి అవసరమైన 55 మంది నైపుణ్యం కలిగిన వారిని కేటాయించేందుకు ఇమ్మిగ్రేషన్ డైరెక్టర్ జనరల్ (డీజీ) ఆమోదం తెలిపారు. దీనిపై మరోసారి సీఎం చంద్రబాబు, డీజీపీ ఎం మాలకొండయ్య చర్చించే అవకాశం ఉంది. కస్టమ్స్ విభాగం కూడా ఏర్పాటైతే రెండు నెలల్లో విదేశాలకు విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

8 లక్షలకు చేరిన విమాన ప్రయాణికులు

రాష్ట్ర విభజన తర్వాత గన్నవరం ఎయిర్‌పోర్టుకు విమాన ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. గతంలో ఏడాదికి లక్షలోపు మందే విమాన ప్రయాణికులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య ఎనిమిది లక్షలకు పెరిగింది. రాజధాని నిర్మాణ పనులు, విదేశీ సంస్థలు పెట్టుబడులు పెడితే ఈ సంఖ్య త్వరలోనే పది లక్షలకు చేరుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. విజయవాడ రాజధాని అయిన తర్వాత దేశంలోని ప్రధాన నగరాలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానాలు నడుపుతున్నారు. మూడున్నర సంవత్సరాల క్రితం దేశీయ ఎయిర్‌పోర్టుగా ఉన్న గన్నవరం, తాజాగా అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చెందింది. రాజధాని నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) రూ.162 కోట్లతో గన్నవరం కొత్త టెర్మినల్‌ను నిర్మించింది. కొత్త టెర్మినల్ నుంచే విజయవాడ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారూ దేశంలోని ఢిల్లీ, ముంబై, చెన్నై, కోయంబత్తూరు, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు జరుపుతున్నారు.

ఎయిర్ ఇండియా, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సిద్ధం

గన్నవరం ఎయిర్‌పోర్టుకు విమానాలు నడిపేందుకు ఎయిర్ ఇండియాతోపాటు సింగపూర్ ఎయిర్‌లైన్స్ సిద్ధంగా ఉన్నాయి. గన్నవరం నుంచి సింగపూర్, దుబాయ్ సర్వీసులను తొలుత ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ విభాగాలు ప్రారంభమైతే అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు ఆస్కారం ఉంటుంది. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ సౌకర్యాల పరిశీలనకు విదేశీ విమానయాన సంస్థలు 45 రోజుల సమయం తీసుకుంటాయని గన్నవరం ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మధుసూదనరావు 'విశాలాంధ్ర'కు చెప్పారు. నెల పదిహేను రోజుల పరిశీలనలో అన్ని సంతృప్తికరంగా ఉంటే 46వ రోజు నుంచి విదేశాలకు విమాన సర్వీసుల రాకపోకలు ప్రారంభమవుతాయన్నారు. అయితే కస్టమ్స్ సెంటర్ ఏర్పాటుకు ఇంకా అధికారికంగా అనుమతి లభించాల్సి ఉందని ఆయన చెప్పారు. ఇమ్మిగ్రేషన్ విభాగం అధికారులు కంప్యూటర్లు, నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్న తర్వాత నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ)తో అనుసంధానం చేసుకోవాల్సి ఉందన్నారు.

టెట్ టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక సమస్యలు తలెత్తుతాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఆన్‌లైన్ మాక్ టెస్టుల వివరాల్ని వెల్లడించాలని అభ్యర్థులు కోరుతున్నారు.అటు టెట్ హాల్ టిక్కెట్లను ఈ నెల 24వ తేదీ బుధవారం నుంచి అందుబాటులో ఉంచుతామని నోటిఫికేషన్‌లో ప్రకటించారు.దీంతో హాల్ టిక్కెట్ల కోసం అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు.

టెట్ పేపర్-3 తెలుగు సిలబస్ ఇదీ..

టెట్ పేపర్-3ను మొత్తం 150 మార్కులకు కేటాయిస్తారు.ఇందులో సైకాలజీ-30, ఫస్టు లాంగ్వేజీ-తెలుగు-30, ఇంగ్లీషు-30, తెలుగు కంటెంట్, మెథడాలజీ-60 మార్కులకు కేటాయించారు.ఇందులో 48 మార్కులకు తెలుగు కంటెంట్, మరో 12 మార్కులకు బోధనా పద్ధతులపై ప్రశ్నలు వస్తాయి. మొత్తంగా పేపర్-3లో తెలుగు అభ్యర్థులకు 90 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.ఇదే పద్ధతిలో ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, ఉర్దూ లాంగ్వేజీ విభాగాలకు సిలబస్‌ను రూపొందించారు.

ఏ)తెలుగు కంటెంట్(42 మార్కులు): 1.కవులు-రచయితలు-కావ్యాలు-రచనలు, 2.ప్రక్రియలు-లక్షణాలు-వివరణలు, 3.ప్రాచీన సాహిత్యం- ఆధునిక సాహిత్యం- ధోరణులు- ఉద్యమాలు, 4.తెలుగు సాహిత్యాలపై ఇతర భాషా సాహిత్యాల ప్రభావం, 5.భాషా రూపాలు, 6.సాహిత్య విమర్శ, 7.భాషాంశాలు, 8.భాషాశాస్త్రం-తెలుగు భాషా చరిత్ర, 9.భాష-సమాజం- సంస్కృతి పరస్పర ప్రభావాలు, 10.అనువాదం- ఆవశ్యకత- రీతులు,11.పఠనావగాహన (పరిచిత-పద్యం/గద్యం) అంశాలపై సిలబస్‌ను రూపొందించారు.

బి).బోధనా పద్ధతుల విభాగం(12 మార్కులు): 1.భాష-వివిధ భావనలు, 2.భాషా నైపుణ్యాలు, 3.ప్రణాళిక రచన-పాఠ్యగ్రంథాలు, 4.విద్యాసాంకేతిక శాస్త్రం-సహపాఠ్యకార్యక్రమాలు, 5.సాహిత్య ప్రక్రియలు-బోధనా పద్ధతులు, 6.మూల్యాంకనం పరీక్షలపై టెట్ సిలబస్‌ను రూపొందించారు. లాంగ్వేజీలపైనే అభ్యర్థులు దృష్టిపెడితే అత్యధిక మార్కులు సాధిస్తారు. అతి తక్కువ వ్యవధిలో టెట్ పేపర్-3 సిలబస్‌ను చదవడం తమకు తలకు మించిన భారంగా ఉందని అభ్యర్థులు వాపోతున్నారు.టెట్ పేపర్-3 పరీక్షా సమయాన్ని తెలియజేయాల్సి ఉంది.

ఎందుకీ జాప్యం..

(మొదటిపేజీ తరువాయి)

వున్నప్పుడు వాటిని అమ్మి బాధితులకు న్యాయంచేకూర్చడానికి ఇంత కాలయాపన తగదన్నారు. రాష్ట్రంలో 19.52 లక్షలమందికి 4వేల కోట్లుఇవ్వాల్సి వుంటే 8వేల కోట్ల విలువైన ఆస్తులుండి కూడా ఆలస్యం చేయడంలో ప్రభుత్వం ఆంతర్యం ఏమిటన్నారు. ఇప్పటివరకు దాదాపు 180మంది ఆత్మహత్యలు చేసుకున్నా అధికార పక్షాలకు చీమకుట్టినట్లయినా లేకపోవడం శోచనీయమన్నారు. అగ్రిగోల్డ్ భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని అమ్ముకోవడమో, లేక వేరే కంపెనీలకు విక్రయించైనా సరే బాధితులను మాత్రం తక్షణమే ఆదుకోవాలన్నారు. ప్రజలకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమన్న విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. కుర్చీ మీద వున్న వ్యామోహం ప్రజల సమస్యలపై లేకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో అగ్రి బాధితుల కోసం 4వేల కోటు కేటాయించి డిపాజిట్ దారులకు అసలు మొత్తాలను చెల్లించాలని, ఆస్తులు అమ్మిన అనంతరం వడ్డీ ఇవ్వాలని సూచించారు. గత మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టుదలతో ఉద్యమాన్ని నడుపుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈ దశాబ్దంలో ఇదొక గొప్ప పోరాటమని ఆయన అభివర్ణించారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో సాధించినందుకు గాను అసోసియేషన్‌ను, ఇస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. బాధితులెవరూ అధైర్యపడవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.


సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ అప్పులకన్నా సంస్థకు ఆస్తులు ఎక్కువగా వున్నందున ఈసమస్య చాలా తేలికగా పరిష్కరించవచ్చునన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం చూపిన అలక్ష్యం వల్ల 180 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతమందిని బలి తీసుకోవడానికి ఎవరు బాధ్యులని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో స్వార్థం పెరిగిందని, నిజాయితీ కొరవడిన ప్రజాప్రతినిధుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రజల సమస్యలకన్నా స్వప్రయోజనాల కోసం ప్రధాన రాజకీయపార్టీలు పోటీపడుతున్నాయన్నారు. సెంటిమెంట్లు, ప్రజల బలహీనతలపై ఆధారపడే రాజకీయాలు పోవాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు ఇంటింటికీ ప్రతి తలుపునూ తట్టి మేల్కొలిపి మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీనికి సీపీఐ పక్షాన తమ పూర్తి సహాయ సహకారాలందిస్తామన్నారు. మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు ప్రకటించిన నాటికి ఇప్పటికీ ఆస్తులు విలువ మరింత పెరిగిందని, ఈనేపథ్యంలో సమస్యను పరిష్కరించడం చాలా సులువైనప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే బాధితులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆస్తులున్నప్పటికీ ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో తాత్సారం చేయడాన్ని బట్టి చూస్తుంటే, ప్రభుత్వ చిత్తశుద్ధి తేటతెల్లమవుతోందన్నారు. రూ.4వేల కోట్లు కేటాయిస్తే సుమారు 20లక్షల మంది బాధితులకు ఊరట లభిస్తుందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని ప్రభుత్వం గత బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిందని గుర్తు చేశారు. మళ్ళీ బడ్జెట్ సమావేశాలు వస్తున్నా హామీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా స్పందించి బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముప్పాళ్ళ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.విశ్వనాథరెడ్డి, ప్రధానకార్యదర్శి వి.తిరుపతిరావు, శేఖర్, నాయుడు, శేషగిరిరావు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే మాజీ రాష్ట్ర అధ్యక్షులు సోమసుందర్ తదితరులు ప్రసంగించగా, 13 జిల్లాల నుండి బాధిత ప్రతినిధులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలను నెరవేర్చండి

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : ఏపీ సమస్యలపై చర్చించేందుకు పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిశారు. పోలవరం ప్రాజెక్టు, విభజన హామీలు, అసెంబ్లీ సీట్ల పెంపు అంశంపై చర్చించారు. అనంతరం రఘువీరారెడ్డి ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను రాహుల్‌గాంధీకి వివరించినట్లు చెప్పారు. విభజన హామీల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసంపై పోరాడేందుకు రాహుల్ కూడా సిద్ధంగా ఉన్నారని, తమ పోరాటానికి సంపూర్ణ మద్దతును ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇద్దరు కూడా ఏపిలో అసెంబ్లీ సీట్లు పెంచేందుకు చాలా ఉత్సాహం చూపిస్తున్నారని తెలిపారు. అయితే విభజన హామీలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం సానుకూలం నిర్ణయం తీసుకుంటేనే తాము అసెంబ్లీ సీట్లు పెంచేందుకు కేంద్రానికి పార్లమెంటులో సహకరిస్తామని పేర్కొన్నారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయాలని చూస్తే మాత్రం కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులోని ఉభయ సభల్లో కూడా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచే అంశాన్ని వ్యతిరేకిస్తామన్నారు. అయితే వాస్తవానికి తాము అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచేందుకు వ్యతిరేకం కాదని రాష్ట్ర ప్రజలసమస్యల సాధన కోసమే తాము ఈ అడ్డంకులు పెడతామని ఏపీ పీసీసీ రఘువీరారెడ్డి చెప్పారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో రూల్ 184 నిబంధనల కింద నోటీసు ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరినట్లు చెప్పారు.

దుర్గగుడి ఈవోగా పద్మ



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ కనకదుర్గ గుడి ఈవోగా డాక్టర్ ఎం.పద్మను నియమించారు. ప్రస్తుతం పద్మ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల దుర్గ గుడిలో అర్ధరాత్రి పూజలు జరిగిన వివాదంలో ఈవోను బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న ఆ స్థానంలో పద్మను ఈవోగా నియమించారు. ఆమె బ్రాహ్మణ కార్పోరేషన్ ఎండీగా కూడా కొనసాగుతారు. ఆర్ అండ్ బి రవాణా స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను నియమించారు. దీంతో పాటు కార్మిక ఉపాధి ఫ్యాక్టరీస్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీఏడీలో ఉన్న గోపాల్‌కృష్ణ ద్వివేదిని పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆశాఖకార్యదర్శిగా సెలవులో ఉన్న జేఎస్‌వీ ప్రసాద్‌ను సెలవు ముగిసిన తర్వాత జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారు. కాగా గోపాలకృష్ణ ద్వివేది జీఏడీ సర్వీసెస్ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తారు.

క్యాషియర్‌తో పనేలేదు.!

(మొదటిపేజీ తరువాయి)

వస్తువుల బిల్లును తర్వాత చెల్లించుకోవచ్చు. డబ్బు చెల్లించేందుకు ముందుగానే మన డెబిట్ లేదా క్రెడిట్ కార్డును యాప్‌తో లింక్ చేయాలి. ఒక స్మార్ట్‌ఫోన్‌తో కుటుంబసభ్యులు కూడా స్టోర్‌లోకి వెళ్లే సదుపాయం కూడా ఉంది. అమెజాన్ ఈ స్టోర్‌ను ప్రయోగాత్మకంగా సోమవారం ప్రజల కోసం తెరిచింది. పలువురు వినియోగదారులు దీన్ని ఉపయోగించుకున్నారు. కొంతమంది దీని పనితీరు చూసి ఆశ్చర్యపోయారు.

పెట్రో మంట..!

(మొదటిపేజీ తరువాయి)

ఆయిల్ సెక్రటరీ కేడీ త్రిపాఠి తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధించే లెవీల్లో లీటరు పెట్రోల్‌పై రూ.19.48 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. డీజిల్‌పై రూ.15.33 ఎక్సైజ్ డ్యూటీ ఉంది. ఢిల్లీలో పెట్రోల్‌పై వ్యాట్ రూ.15.33లు, డీజిలుపై రూ.9.32లు వసూలు చేస్తున్నారు. ఈ ఎక్సైజ్ డ్యూటీలను తగ్గించి, సాధారణ ప్రజలకు కొంత మేర అయినా ఉపశమనం కల్పించాలని అధికారులు తెలిపారు. గ్లోబల్‌గా ఆయిల్ ధరలు తగ్గుముఖంలో ఉన్నప్పుడు బీజేపీ ప్రభుత్వం 2014 నవంబర్ నుంచి 2016 జనవరి వరకు తొమ్మిది సార్లు ఎక్సైజ్ డ్యూటీలను పెంచింది. దీంతో 2014-15లో చమురుపై రూ.99,000 కోట్ల ఎక్సైజ్ డ్యూటీ వసూలు చేసిన కేంద్రం 2016-17లో రూ.2,42,000 కోట్లు పిండుకు ంది. ఐతే, కేవలం ఒక్కసారి మాత్రమే ఈ డ్యూటీకు కోత పెట్టింది. 2017 అక్టోబర్‌లో వార్షికాదాయంలో రూ. 26,000 కోట్ల కోత విధించింది. అదే విధంగా 2018 మార్చి 31 వరకూ రూ.13000 కోట్లు కోత విధించింది. గత ఏడాది అక్టోబర్‌లో లీటరుకు రూ.2లు తగ్గించింది.

దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర 70.88లకు, డీజిల్ ధర రూ.59.14లకు తగ్గింది. ఎక్సైజ్ డ్యూటీని తగ్గించటంతో పెట్రోలు ధర రూ.68.38లకు, డీజిల్ ధర 56.89లకు తగ్గింది. ఐతే ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లోనూ రికార్డు స్థాయిలో చమురుధరలు పెరగటంతో... కేంద్రం విధిగా ఎక్సై జ్ డ్యూటీ కోత విధించక తప్పదు. ఇక అంతర్జా తీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మరింత మండుతున్నాయి. ఆయిల్ ఫ్యూచర్స్ 0.96 శాతం పుంజుకుని బారెల్ ధర రూ.4084ను తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మండుతున్న నేపథ్యంలో దేశీయంగా ఈ ప్రభావం పడనుందన్న విశ్లేషకుల అంచనాలను బీట్ చేస్తూ చమురు ధరలు పరుగు తీస్తున్నాయి.

ప్రపంచ మార్కెట్ల స్థిరమైన వృద్ధి, డాలర్ బలహీన చమురు ధరలకు ఊతమిస్తోందని మార్కెట్ వర్గాల అంచనా. దీనికి తోడు ఐఎంఎఫ్ ఆరోగ్యకరమైన ఆర్థికా భివృద్ధి అంచనాలు, రష్యా, ఒపెక్ దేశాల ఎగుమతిదారుల గ్రూప్‌లో కొనసాగుతున్న సరఫరా నియంత్రణ చమురు ధరలు పెంచిందని పరిశీలకు విశ్లేషణ.

త్రిపుర లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థుల జాబితా విడుదల

అగర్తలా : త్రిపుర ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్‌ఫ్రంట్ మంగళవారం విడుదల చేసింది. మంత్రులు, ముఖ్యులైన ఎమ్మెల్యేలను తిరిగి నామినేట్ చేశారు. జాబితాలో 12 మంది కొత్తవారికి స్థానం కల్పించారు

ఎట్టకేలకు నిరుద్యోగభృతికి రంగం సిద్ధం

అర్హతలను ప్రకటించిన ప్రభుత్వం

విశాలాంధ్ర అమరావతి: ఎన్నికల వాగ్దానంలో అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు 'నిరుద్యోగ భృతి' చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇంతకాలం దాని ఊసే ఎత్తని ప్రభుత్వం ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో భృతిని చెల్లించడానికి ముందు కొచ్చింది. భృతి ఎవరికి వర్తిస్తుందనే విషయంపై ఒక ముసాయిదాను సర్కార్ విడుదల చేసింది. దీని ప్రకారం దరఖాస్తుదారుడి పేరు ఉపాధి కల్పన కేంద్రం, ఆన్‌లైన్‌లో నమోదై ఉండి, కనీసం ఇంటర్ చదివి ఉండాలి. టెక్నికల్ అయితే కనీసం ఐటీఐ చదివి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.పేద కుటుంబాలవారికే ఈ భృతిని వర్తింపజేస్తారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది.సంబంధిత కుటుంబం రేషన్ తీసుకుంటూ ఉండాలి. స్వయం ఉపాధి పథకాల్లో కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో కానీ లబ్ధిదారులుగా ఉన్నవారు అనర్హులు. ప్రవేట్ రంగంలో పని చేస్తున్నవారు, ప్రభుత్వ సర్వీసుల నుంచి తొలగింపబడిన వారు అనర్హులు. దరఖాస్తు చేసుకున్నవారు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పొందాలి. ఎక్కువ వయసు ఉన్నవారికే ప్రాధాన్యత. ఒకే వయసు ఉన్నవారు ఎక్కువ మంది ఉన్నట్లైతే, అవసరమైన విద్యార్హత ఉన్నవారిని సీనియర్‌గా పరిగణిస్తారు. వయసు, విద్యార్హతలు సమానంగా ఉంటే మార్కులను కొలమానంగా తీసుకుంటారు.

ఏపీలో జన్మించినవారే అర్హులు

ఏపీలో జన్మించినవారికే ఈ పథకం వర్తిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ డిగ్రీలు ఉన్నవారు కూడా అర్హులే.అయితే ఈ అర్హతలపై ఏపీ నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ప్రతి ఇంటికి ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి అని అప్పట్లో ప్రకటించి ఇప్పుడు అర్హతలు పెట్టడం సర్కార్‌కు సబబు కాదని నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో దివాళాకోరు రాజకీయాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ



విశాలాంధ్ర - నందిగామ:కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటిస్తే 2019 ఎన్నికల్లో బీజేపీకి మద్దతిస్తానని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించటం దివాళా కోరుతనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. సీపీఐ కృష్ణాజిల్లా 24వ మహాసభలు రైతుపేటలోని కామ్రేడ్ సూర్యదేవర నాగేశ్వరరావు ప్రాంగణంలో జరుగుతున్న సందర్భంగా మంగళవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనంతరం కె.రామకృష్ణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేయటంలో ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆంధ్రరాష్ట్రానికి ఐదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇదే సందర్భంగా ఐదేళ్లుకాదు పదేళ్లు ఇస్తామని చెప్పిన బీజేపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఇంతవరకు హామీని అమలుచేయకుండా దగాచేసిందన్నారు. అలాంటి మోసం చేసిన వారితో వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీచేస్తామన్న జగన్ కేసులకు భయపడి కొంగ జపం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు బీజేపీతో దోస్తీ వదిలితే వారికి స్టేఫ్నీగా ఉపయోగపడటానికి జగన్ సిద్ధపడుతున్నారన్నారు. ఇద్దరు చేతకాని దివాళాకోరు రాజకీయ నాయకుల వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ బేషరతుగా బీజేపీకి మద్దతునిచ్చాయని, కనీసం ఆ సమయంలోనైనా రెండు పార్టీలు ఒక్కసారైనా ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోడీకి గులాంగిరి చేయటానికి పోటీపడటం మాని విభజన హామీలు, ప్రత్యేక హోదా కొరకు రెండు పార్టీల నాయకులు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రత్యేక హోదా నినాదం హోరెత్తుతుందని, కేంద్రంపై మరింతగా ఒత్తిడి పెంచేందుకు రాజకీయ పార్టీలన్నీ ఉద్యమ బాట పడుతున్నాయని, ఆ రెండు పార్టీలు కూడా కలసి రావాలని పేర్కొన్నారుచంద్రబాబుకు ధైర్యం వుంటే విభజన బిల్లులోని సంక్షేమ పథకాలపై కేంద్రాన్ని నిలదియ్యాలన్నారు.

కోడి పందేలపై 29న హైకోర్టుకు నివేదిక

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కోడి పందేలపై ఈ నెల 29న హైకోర్టుకు పూర్తిస్థాయి వివరాలను అందజేయనున్నట్లు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ ఎం మాల కొండయ్య చెప్పారు. కోడి పందేల విషయంలో మరింత సమాచారం రావాల్సి ఉన్నందున కోర్టుకు నివేదికను ఇవ్వటంలో జాప్యం జరిగిందన్నారు. విజయవాడలోని ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు సమావేశం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగింది. కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోలీసు స్టేషన్లు, క్వార్టర్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశంలో చర్చించారు. అనంతరం డీజీపీ మాల కొండయ్య విలేకరులతో మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 29న పూర్తి నివేదికను అందజేస్తామన్నారు. విజయవాడలో సంచలనం కలిగించిన బీ ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణపై హైకోర్టు ఆదేశాలు అందినట్లు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు సిట్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుం దన్నారు. రాష్ట్ర విభజన అనంతరం పోలీసు శాఖకు సంబంధించిన అనేక సమస్యలపై ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ సమావేశంలో చర్చించామని తెలిపారు. పోలీసు సిబ్బందికి సొంతిం టి కల నెరవేర్చేందుకే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియ జేశారు. రూ.17 కోట్లతో పోలీసు సిబ్బంది క్వార్టర్స్ ను మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసు క్వార్టర్స్‌కు సీఎం చంద్రబాబు ప్రారంభోత్సవం : నాగుల్ మీరా

రాష్ట్రంలోని నూజివీడు, అనంతపురంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ నిర్మించిన 70 పోలీసు క్వార్టర్స్‌ను త్వరలో సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్లు కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా చెప్పారు. బోర్డు సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం లోనూ పోలీసు క్వార్టర్స్ నిర్మించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు.

కృష్ణపట్నంకు మరో మెగా ప్రాజెక్ట్

- భారీ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు సౌదీ అర్మ్‌కో ఆసక్తి
- దావోస్‌లో ఆ కంపెనీ అధ్యక్షునితో చంద్రబాబు భేటీ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కృష్ణపట్నంలో భారీ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు సౌదీ అర్మ్‌కో ఆసక్తి కనబరుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సాగుతున్న దావోస్ పర్యటనలో రెండో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు సౌదీ అర్మ్‌కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తమ రాష్ట్రాన్ని తాకుతూ రెండు పారిశ్రామిక కారిడార్లున్నాయని, కృష్ణ పట్నాన్ని లాజిస్టిక్ హబ్ గా తీర్చిదిద్దుతామని, రిఫైనరీ ఏర్పాటు వాణిజ్యపరంగా ఎంతో లాభసాటి అవుతుందని, స్వదేశంలో మార్కెటింగ్‌కు అనువుగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు 974 కి.మీ సముద్రతీరం ఉందని, కృష్ణా-గోదావరి బేసిన్ లో అపార చమురు నిక్షేపాలు ఉన్నాయని, పెట్రోలియం శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు దేశంలో తమ రాష్ట్రం ఎంతో అనుకూలమని తెలిపారు. పెట్రోలియం, రసాయన పరిశ్రమల ఏర్పాటుకు, విస్తరణకు సానుకూల వాతవరణం ఉందన్నారు. హెచ్‌పీసీఎల్, గెయిల్ కార్యకలాపాలకు ఆంధ్రప్రదేశ్ ఆయువుపట్టుగా ఉందని వివరించారు. రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీను స్థాపించనున్నామని, ఇందువల్ల నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభిస్తాయన్నారు. ఇది రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో పెట్రోలియం పరిశ్రమల ఏర్పాటుకు మరింత అనువైన వాతావరణం ఏర్పడేందుకు దారితీస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు.

కాగా సౌదీ అర్మ్‌కో కంపెనీ మహారాష్ట్రలో 40 బిలియన్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీలతో సంయుక్త భాగస్వామ్యంలో మెగా రిఫైనరీ ఏర్పాటు చేయాలని సౌదీ అర్మ్ సంస్థ ప్రయత్నం చేసింది. కానీ సంయుక్త భాగస్వామ్యం కార్యాచరణకు రాలేదు. ఈ దశలో సౌదీ అర్మ్ సంస్థ రిఫైనరీ ఏర్పాటుకు అన్ని అవకాశాలు, సామర్థ్యం ఉన్న కీలక ప్రదేశంగా మన రాష్ట్రంలోని కృష్ణ పట్నాన్ని గుర్తించింది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ కంపెనీ భారత్ రాజధాని ఢిల్లీలో అర్మ్‌కో ఏషియా-ఇండియా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించింది. భారత పశ్చిమ తీరంలో భారీ చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు నిశ్చయించింది. భారత్ మార్కెట్‌లో మరింత వాటా దక్కించుకోవటానికి ఈ సంస్థ కార్యకాలపాలు నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 640 చ.కి.మీ మేర చమురు, రసాయనాలు, పెట్రికెమికల్స్ ఇన్వెస్టిమెంట్ రీజియన్‌లో ఉందని, అలాగే 6 సెజ్‌లు ఉన్న విషయాలను అధ్యయనం చేసిన సంస్థ రాష్ట్రంలోని కృష్ణపట్నాన్ని తన పెట్టుబడులకు ప్రాధాన్యతా కేంద్రంగా ఎంచుకుంది. ఫిబ్రవరిలో విశాఖలో నిర్వహించనున్న సీఐఐ పెట్టుబడి దారుల సదస్సుకు హాజరు కావాలని ఆయన సౌదీ అర్మ్‌కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీని ఆహ్వానించారు. తమ రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామని, వ్యాపార సానుకూల వాతావరణం ద్వారా పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ స్థిరంగా ముందుకు దూసుకువెళుతోందని వివరించారు. సౌదీ అర్మ్‌కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీ స్పందిస్తూ 'భారత్‌కు ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు మీరు చూపిస్తున్న వ్యక్తిగత శ్రద్ధను అభినందిస్తున్నాను' అని చెప్పారు. ముఖ్యమంత్రి బృందంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్ ఐటీ, పంచాయతీరాజ్ శాఖా మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ జాస్తి కృష్ణ కిశోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, వ్యవసాయ సలహాదారు టి. విజయకుమార్ ఉన్నారు. సీఐఐ, పీడబ్ల్యూసీ సంయుక్తంగా నిర్వహించిన 'ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్ ఇండియా' వ్యాపార విభాగ (బిజినెస్ సెషన్)లో మంత్రి నారా లోకేశ్ ప్రసంగించారు.

దోచుకున్నది దాచుకొనేందుకే ...

బాబు విదేశీ పర్యటనలపై వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్రంలో దోచుకున్న సొమ్మును దాచుకోవడానికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి విదేశాల్లో పర్యటిస్తున్నారని వైసీపీ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. 17 సార్లకుపైగా ఆయన విదేశీ పర్యటనలు చేశారన్నారు. ప్రతిఏటా మూడ్నాలుగుసార్లు విదేశాలకు వెళ్లడం బాబుకు అనవాయితీగా మారిందన్నారు. విదేశీ యాత్రలను గాలి పర్యటనలుగా తాము భావిస్తున్నామని చెప్పారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రినని చెప్పుకోవడానికే చంద్రబాబు విదేశీ యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ పర్యటనకు వెళ్లి ప్రధాని మోడీని కలిసిన చంద్రబాబు రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేకపోయారన్నారు. విభజన చట్టంలోని అంశాలను కూడా పూర్తిగా ప్రస్తావించలేకపోయారని, రాష్ట్ర ప్రజలకు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల్లో ఒక్కశాతం కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. నోటుకు ఓటు కేసు కోసం రాష్ట్ర ప్రత్యేక హోదాను చంద్రబాబు కేంద్రం వద్ద తాకట్టుపెట్టారని ఆరోపించారు. ఢిల్లీ నుంచి సాధించలేకపోయిన నిధులను విదేశాలకు వెళ్లి ఏం సాధిస్తారన్నారు. రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని ఊదరగొడుతున్నారని, వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉందన్నారు. మొదటి సీఐఐ సదస్సులో 4,78,788 కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నామని, 10,27,101 ఉద్యోగాలు సాధిస్తున్నామని ప్రకటించిన చంద్రబాబు రెండవ సదస్సులో 10.54 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, 22.34 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటనలు చేశారన్నారు. మరి ఇందులో కనీసం వెయ్యి మందికైనా ఉద్యోగాలు కల్పించారా అంటూ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు.

చలో పెదగొట్టిపాడు విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అరెస్టు అప్రజాస్వామికం - వామపక్షాల నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చలో పెదగొట్టిపాడు విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర పన్నిందని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కృష్ణయ్యతోపాటు వామపక్ష, దళిత సంఘాల నేతల్ని ముందస్తుగా అరెస్టులు, నిర్బంధ చర్యలకు పోలీసులు పాల్పడటం అప్రజాస్వామికమని వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు ఖండించారు.ఈ మేరకు మంగళవారం వామపక్షాల రాష్ట్ర నేతలు కె.రామకృష్ణ, (సీపీఐ రాష్ట్ర కార్యదర్శి), వై.వెంకటేశ్వరరావు-సీపీఎం, వై.సాంబశివరావు-సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, గుర్రం విజయ్‌కుమార్-సీపీఐ(ఎంఎల్), ఎం.వెంకట రెడ్డి- ఎంసీపీఐ(యు), బి.బంగార్‌రావ్ -సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు-సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ,బి.ఎస్.అమర్‌నాథ్-ఎస్‌యూసీఐ(సి), పీవీ సుందరరామరాజు-ఫార్వర్డ్ బ్లాక్, జానకీరాములు- రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

దళితులపై దాడి, సాంఘిక బహిష్కరణకు నిరసనగా వామపక్ష, దళిత సంఘాలు ఈ నెల 24న చలో పెదగొట్టిపాడుకు పిలుపు నిచ్చాయని పేర్కొన్నారు. దళితులకు కౌలుకిచ్చిన పొలాలను తిరిగి ఇవ్వాలని. పాత బాకీలు వెంటనే చెల్లింపునకు ఒత్తిడికి గురిచేయడం. పాల కేంద్రంలో పనిచేస్తున్న దళిత యువకుడ్ని పనిలో నుంచి తొలగించడాన్ని వామపక్ష నేతలు తప్పుపట్టారు. సమస్యను పోలీసు యంత్రాంగం పరిష్కరించకుండా.. పెత్తందారు లకు కొమ్ముకాస్తోందని తెలిపారు. రాజకీయ నేతలు, దళిత సంఘాల ప్రతినిధుల్ని ముందస్తుగా అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.ప్రజాతంత్ర వాదులంతా ప్రభుత్వ నిర్బంధ చర్యల్ని ఖండించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ నిర్బంధ చర్యల్ని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు.

సీపీఎం నేత మధు అరెస్టును ఖండించిన రఘువీరారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధును పెదగొట్టిపాడు వెళ్లనీయకుండా ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో ఖండిం చారు.

25న కడప బంద్‌కు కె.రామకృష్ణ మద్దతు

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై ఈ నెల 25న చేపట్టిన కడప జిల్లా బంద్‌కు సీపీఐ పూర్తి మద్దతునిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరువు కోరల్లో చిక్కుకుని ప్రజలు వలస బాటపట్టడంతోపాటు, దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పతున్న ఘటనలు రాయలసీమ ప్రాంతంలో నిత్య కృత్యమయ్యాయి. రాయలసీమ ప్రాంతానికి దశాబ్దాల తరబడి పాలకులు ఇచ్చిన హామీలన్నీ నేటి వరకు నీటిమూటలుగానే మిగిలాయి. సీమ ప్రాంతంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను 2007వ సంవత్సరంలో జమ్మలమడుగులో బ్రాహ్మణి ఉక్కు పరిశ్రమ స్థాపనకై శంఖుస్థాపన చేశారు. గాలి జనార్ధనరెడ్డి అవినీతిపర్వం కారణంగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అర్ధాంతరంగా నిలిచిపోయింది. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటువల్ల రాయలసీమ ప్రాంతంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, వలసలు నివారించవచ్చునని పేర్కొన్నారు. రాష్ట్ర విభజనానంతరం నాటి పార్లమెంట్ సాక్షిగా చేసిన విభజన చట్టాన్ని కేంద్రం తుంగలో తొక్కింది. విభజన హామీల్లో భాగంగా కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పి మూడున్నరేళ్ళు గడచినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నది. ఏపీకి రావాల్సిన విభజన హామీల అమలుకై కేంద్రా న్ని నిలదీయాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



ఫార్మా-డీ విద్యార్థుల్ని ఆదుకుంటాం

- ఉద్యోగవకాశాలపై చర్చిస్తాం
- వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్
- విజయవాడలో ఫార్మాడీ విద్యార్థులతో భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఫార్మా-డీ విద్యార్థుల్ని ప్రభుత్వ పరంగా ఆదుకుని న్యాయం చేసేందుకు కృషి చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ నివాసంలో ఫార్మాడీ విద్యార్థి సంఘం నేతలతో ఆయన భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఫార్మా డీ విద్యార్థుల సంఘం నేతలు, విద్యార్థులతోపాటు ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, జితేందర్ గౌడ్‌లతో పలు అంశాలపై మంత్రి చర్చించారు. మంత్రి కామినేని మాట్లాడుతూ..ఆరు బ్యాచ్‌ల వరకూ ఫార్మా-డి కోర్సును పూర్తిచేసి విద్యార్థులు బయటకెళ్లారని వివరించారు.రాష్ట్రంలో 59 కాలేజీల ద్వారా 20వేల మంది పూర్తి చేశారన్నారు.దేశవ్యాప్తంగా 220 ఫార్మా-డీ కాలేజీలున్నాయని, ఇవి 10 ఏళ్ల నుంచి నడుస్తున్నాయని వివరించారు.వృత్తికి తగిన గుర్తింపు లేదని తన ఎదుట విద్యార్థులు వాపోయారన్నారు.కోర్సుకు సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా మొదలు పెట్టారని, వైద్య శాఖకు సంబంధంలేని కోర్సుగా ఫార్మా-డీ కోర్సు ఉండటంతో..సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఫార్మా డీ కోర్సుకి అనుమతులిస్తున్నామని చెప్పారు.రెగ్యులర్ ఎంబీబీఎస్ కోర్సులో సీటు రాని విద్యార్థులు ఫార్మా-డీ కోర్సులలో చేరుతున్నారని పేర్కొన్నారు.ఉద్యోగవకాశాలు కల్పనకు, వారికి న్యాయం చేయాలనే అంశంపై పరిశీలించేందుకుగాను ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ కమిటీలో అకాడమిక్ డీఎంఈ (కన్వీనర్), హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీ డ్రగ్స్, కమిషనర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సభ్యులతో కమిటీని నియమించామని చెప్పారు. 45 రోజులలో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించామని మంత్రి స్పష్టం చేశారు.విద్యార్థులకు న్యాయం కోసం మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో చర్చిస్తామన్నారు. ఫార్మా-డీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల్ని వైద్యమిత్ర, జన ఔషది కిందకు తీసుకొచ్చేందుకు పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు.

ప్రజా సంకల్పయాత్రకు పెళ్లకూరు మండలం బ్రహ్మారథం



విశాలాంధ్ర, పెళ్లకూరు: ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఉదయం జిల్లా పరిధిలోని పెళ్ళకూరు మండలంలో పునబాక గ్రామంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాత్ర కొనసాగింది. జిల్లా నుంచి నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ వరప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు వైఎస్ జగన్‌కు పునబాకలో స్వాగతం పలికి, శాలువాలతో కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పునబాక గిరిజన కాలనీలోని యువత జగన్‌కు అనుకూలంగా జేజేలు పలుకుతూ నినాదాలు చేశారు. దారి పొడవునా మహిళలు వైఎస్ జగన్‌కు హారతులు పట్టి ఆశీర్వాదాలు పలికారు. యాత్రలో భాగంగా జగన్ దళిత కాలనీ, ఎస్టీ కాలనీ, అర్ధమాల క్రాస్‌రోడ్డు, చెంబేడు సీఎస్‌పేట గ్రామాల్లో కూడలి వద్ద ప్రజల ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2014 ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అందలం ఎక్కారని విమర్శించారు. 2019లో జరిగే ఎన్నికలలో వైసీపీని గెలిపిస్తే 45 ఏళ్లకే పెన్షన్లు మంజూరు చేస్తానని ఆయన హామీల వర్షం కురిపించారు. మంగళవారం ఉదయం ప్రారంభమైన పాదయాత్ర చెన్నప్పనాయుడు హరిజనవాడ ప్రత్యేకంగా బస ఏర్పాటుతో ముగిసింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెళ్లకూరు ఎంపీపీ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పార్టీ సైన్యాలను కలుపుకుని ముందజలో నడిపించారు. తిరుపతి ఎంపీ వరప్రసాద్‌రావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు నాయకులు, కార్యర్తలకు లోటు రానివ్వకుండా ఆహారం, త్రాగునీటి పానియాల ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మండల నాయకులు మారబత్తిన లక్ష్మీనారాయణ, మారబత్తిన సుధాకర్, జీలపాటూరు సర్పంచ్ కేసు ప్రసాద్, పిన్నాబత్తిన రవి, నాయుడుపేట నాయకురాలు ఎల్లసిరి నీరజమ్మ, రాజసులోచనమ్మ, పాల్గొన్నారు.

వాడి వేడిగా పీఏసీ సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : పిఏసి సమావేశంలో వాడి వేడిగా చర్చ జరిగింది. మంగళవారం ప్రారంభమైన ఈ సమావేశంలో ప్రాజెక్టలపై చర్చ సాగింది. ప్రతిపక్ష సభ్యుల మధ్యతీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉండగా పట్టిసీమ ప్రాజెక్టకు ప్రాధాన్యతనిచ్చి అధికమొత్తంలో నిధులు ఖర్చు చేయాల్సిన అవశ్యకత ఏమిటంటూ అధికారులపై పిఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వైసీపీ సభ్యుడు సురేష్ ప్రశ్నించారు. టీడీపీ ఎమ్మెల్సీ రవిచంద్ర మాట్లాడుతూ ఈ ఏడాది పట్టిసీమ వల్ల వంద టీఎంసీల నీటినిచ్చి పంటలను కాపాడామన్నారు. గతంలో ఏ ప్రాజెక్ట్ అయినా సంవత్సర కాలంలో పూర్తయి నీరు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రాజెక్టను ఏడాదిలో పూర్తి చేసి నీరు అందించామని, ఇరిగేషన్ కార్యదర్శి శశిభూషణ్ స్పష్టం చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినప్పటికీ కేంద్రం దయతలిస్తేనే పూర్తవుతుందని, లేదంటే పట్టిసీమే రైతులకు ప్రాణాధారమని రవిచంద్ర పేర్కొన్నారు. లేబర్ సెస్‌లు, ఎక్సైజ్ డ్యూటీలో అధికంగా చెల్లించారని ఆదిమూలపు ఆరోపించారు. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ పట్టిసీమ ప్రాజెక్టకు సంబంధించి అన్ని వివరాలను పిఏసి ముందుంచాలని డిమాండ్ చేశారు. వచ్చే సమావేశం నాటికి రికార్డులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పట్టిసీమ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో డయాఫ్రమ్ వాల్ ఎందుకు కట్టాల్సి వచ్చిందో తెలపాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. అంతేకాకుండా టెండర్లలోను లోపాలు ఉన్నాయని రవిచంద్ర అన్నారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ గార్డెన్స్

మిడ్‌డే మీల్ స్కీమ్ ఆన్‌లైన్‌లో అప్‌డేట్



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి అనుబంధంగా పాఠశాల ఆవరణలో ఉండే స్థలంలో కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని మధ్యాహ్న భోజనపథకంలో వినియోగించే ఆలోచన చేస్తున్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించే ఆలోచనతోనే ఈ ప్రతిపాదనలు రూపొందించారు. గతంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై పలు ఆరోపణలు వెల్లువెత్తేవి. అయితే పాఠశాల విద్యాకమిషనర్‌గా సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆన్‌లైన్ చేయటంతో నిర్వహణ క్రమబద్ధంగా సాగుతోంది. దీనికోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. దీంతో రాష్ట్రంలోని ఏ పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు హాజరైంది, ఎంత మంది మధ్యాహ్నం భోజనం ఆరగించింది, ఎన్ని బియ్యం ఉడికాయి, ఎన్ని గుడ్లు వాడారు అన్న సమాచారం ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. రాష్ట్రం మొత్తం మీద 45,344 ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 36లక్షల 31వేల 151 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థినీ, విద్యార్థుల ఆధార్‌ను అనుసంధానం చేయటం, స్కూళ్ళలో బయోమెట్రిక్ అమలు చేస్తుండటంతో మధ్యాహ్న భోజన పథకంలో అక్రమాలు తెలిసిపోయాయి. మధ్యాహ్న భోజనపథకంలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బియ్యం ఈపోస్ ఆధారంగానే తీసుకోవాలి. ఏ వారం గుడ్ల ఆ వారం వినియోగించేలా వారానికి ఒక రంగు స్టాపింగ్‌ను అమలు చేస్తున్నారు. దీంతో గతంలోలా దొంగ బిల్లులు పెట్టుకొనే ఆస్కారం లేకుండా పోయింది. దీనికి తోడు మధ్యాహ్న భోజనపథకం నిర్వహణలో ఏజన్సీదారులకు నేరుగా వారి ఖాతాలకే బిల్లులు జమచేస్తున్నారు. గతంలో డిఈవోలు, ఎంఈవోల ద్వారా నిధుల పంపిణీ జరిగేది. దానివల్ల తలెత్తుతున్న సమస్యలపై ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఏటా మధ్యాహ్న భోజన పథకానికి 600 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ నిధులలో 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయి. మధ్యాహ్న భోజనపథకం 86శాతం సక్రమంగా అమలవుతున్నట్లు అధికారులు చెప్పారు. మిగిలిన 14శాతంలో పెద్ద వయస్సు ఉన్న ఆడపిల్లలు మధ్యాహ్న భోజనం తినటంలేదని సోషల్ ఆడిట్ సర్వేలో తేలింది. వారికి కూడా ఈ పథకంలో భాగస్వాములను చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో అక్రమాలను అరికట్టి సక్రమంగా నడిచేలా చేసిన ఈ పరిస్థితులలో ఇక నుండి శుచి, రుచికరమైన ఆహారం అందించాలన్న ఆలోచనతోనే కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు కానున్నాయి. 30ఇ30 కనీస కొలతలతో గార్డెన్‌ను ఏర్పాటు చేసి దానికి ఒకరని ఏర్పాటు చేస్తారు. పీఈటీలు ఉన్నచోట వారు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. కిచెన్ గార్డెన్‌లో పండే తాజా కూరగాయలు, ఆకు కూరలతో వంట వండి మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అందించాలన్న ఆలోచనతోనే గార్డెన్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

Dwaraka

సంపాదకీయం

ప్రతిష్ట కోసం నెతన్యాహు పాకులాట

స్వదేశంలో అవినీతి ఆరోపణల సెగను ఎదుర్కొంటున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన ఆయన తన దేశంలో ప్రతిష్టను తిరిగి పొంది ఊపిరి పీల్చుకునేట్లు చేసి కొంత ఉపశమనం కలుగజేయడంలో దోహద పడింది. భారత్-ఇజ్రాయిల్‌ల ద్వైపాక్షిక సంబంధాల సాధారీకరణకు కూడా తోడ్పడింది. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకొని రెండు దేశాల ఏర్పాటుకు నెతన్యాహు ససేమిరా అంటున్నాడు. ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన రెండు దేశాల ఏర్పాటుకు పరిష్కారాన్ని ఇజ్రాయిల్ వ్యతిరేకిస్తోంది. పాలస్తీనా సమస్యను పరిష్కరించకుండా పశ్చిమాసియాలో శాంతి భద్రతలు ఊహించలేము. చారిత్రక అవగాహనతో పాలస్తీనా సమస్యను పరిష్క రించవలసిన అవసరం వుంది. నెతన్యాహును బర్తరఫ్ చేయాలని డిమాండు చేస్తున్న ఇజ్రాయిల్ ప్రజలు టెల్‌అవీవ్‌లో వీధుల్లోకి వచ్చిన సమయంలోనే ఆయన భారత్ పర్యటనను ఎంచుకోవడం విశేషం. భారత్‌తో పటిష్టమైన సంబంధం తన కీర్తిని తెచ్చిపెట్టేందుకు దోహద పడుతుందని, దేశాన్ని నడపగల ఏకైక రాజకీయవేత్త తానొక్కడినేనని దేశ ప్రజలను ఒప్పించ గలుగుతానని ప్రారంభం నుండి నెతన్యాహు నమ్మకంతో వున్నారు. ఒక ఇజ్రాయిల్ ప్రధానమంత్రి ఎన్నడూ విదేశీ పర్యటనకు తనవెంట తీసుకువెళ్లనంతటి వాణిజ్య ప్రతినిధి బృందాన్ని తనవెంట తీసుకొని నెతన్యాహు భారత పర్యటనకు రావడంలో కారణం లేకపోలేదంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలో ఒక ప్రధానమైన దేశంతో వ్యూహాత్మకమైన సంబంధం కుదుర్చు కోవడం తన దేశంలోని సంక్షోభాన్ని తగ్గిస్తుందని, తాను అవినీతిపరుడన్న కళంకాన్ని చెరివ వేయడంలో దోహదపడుతుందని ఆయనకు తెలుసు. భారత్ పర్యటనకు ముందు ఆయన ఏమి చెప్పారో నిశితంగా పరిశీలించినట్లయితే ఆయన ఉద్దేశ్యమేమిటో స్పష్టమవుతుంది. "ఇజ్రాయిల్-భారత్ మధ్య సంబంధాలను మేము పటిష్టవంతం చేస్తున్నాము. భద్రత, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పర్యాటకం అదే విధంగా ఇతర రంగాల్లో ప్రయోజనాలను అది కలుగజేస్తుంది. ఇజ్రాయిల్‌కు ఇది మహదానందదాయకం. భారత ప్రధాని మోడీ ఇజ్రాయిల్‌కు, నాకు సన్నిహిత మిత్రుడు. నా పర్యటనలో నాతోపాటు ఆయన కూడా వెంట వుంటారని ఆశిస్తున్నాను. ఈ పర్యటనలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టపరుచుకోవాలని నేను భావిస్తున్నాను. ప్రపంచ ఆర్థిక, భద్రత, సాంకేతిక పరిజ్ఞాన, పర్యాటక దేశంతో సహకారాన్ని పెంపొందించుకోడానికి ఈ పర్యటన ఒక చక్కటి అవకాశం" అని ఆయన చెప్పారు. నెతన్యాహు ఈ నెల 17 నుండి నాలుగు రోజుల భారత్ పర్యటనలో ఆయన వెంట 102 ఇజ్రాయిల్ కంపెనీల నుండి 130 మంది వాణిజ్యవేత్తల భారీ ప్రతినిధి బృందం కూడా వచ్చింది. పర్యాటకం, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ తదితర రంగాల్లో నాలుగేండ్ల కాలంలో భారత్‌తో సహకారాన్ని పెంపొందించుకోడానికి 68.6 మిలియన్ డాలర్లను ఇజ్రాయిల్ వెచ్చిస్తుంది. నెతన్యాహు భారత్ పర్యటనలో వున్నప్పుడు సైతం నిరసనకారులు టెల్‌అవీవ్‌లో వీధుల్లోకి వచ్చారు. అవినీతి ఆరోపణలపై దర్యాప్తు నుండి ఆయన్ని కాపాడటానికి ఒక నూతన చట్టాన్ని తీసుకురావాలన్న పన్నాగాన్ని నిరసనకారులు వ్యతిరేకిస్తున్నారు. నెతన్యాహు నేరపూరిత దర్యాప్తులపై ప్రజలను చీకట్లో వుంచడమే తీసుకురాదలచిన నూతన చట్టం ఉద్దేశమని ఆయన విమర్శకులు ఆరోపించడం గమనార్హం. నెతన్యాహు రెండు అవినీతి కేసుల్లో వున్నట్లు అనుమానించబడుతోంది. మొదటిది కేసు 1000, రెండవది కేసు 2000గా పిలువబడుతోంది. యాదృచ్ఛికంగా, ఇజ్రాయిల్ బిలియనీర్ అర్నన్ మిల్చాన్ నుండి వేలాది విలువ చేసే అక్రమ కానుకలు పుచ్చు కున్నాడన్న అనుమానంతో ఇప్పటికీ పోలీసులు నెతన్యాహును విచారించారు. రెండు అవినీతి కేసుల్లోనూ, మోజెస్ కేసుల్లోను "హెచ్చరిక కింద" నెతన్యాహును పోలీసులు ప్రశ్నించారు. అవినీతి కుంభకోణాలు నెతన్యాహుకి కొత్తేమీ కాదు. ప్రయాణ ఖర్చులకు ద్వంద్వ బిల్లింగు నుండి చట్టవిరుద్ధంగా విరాళాలు స్వీకరిం చడం వరకు గడచిన ఐదేళ్లలో ఆయన అనేక ఆరోపణల సుడిగుండంలో చిక్కుకున్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నెతన్యాహుకు ఘనస్వాగతం పలికి ఆలింగనం చేసుకొన్నాడు. అయితే, ఇజ్రాయిల్ ప్రజల్లో ప్రతిష్టను, మద్దతును నెతన్యాహు కోల్పోయిన వాస్తవాన్ని మోడీ విమర్శించకూడదు. ఆయన సంకీర్ణ ప్రభుత్వం విచ్ఛిన్నం ప్రారంభదశలో వుంది. ఆయన్ని సమర్థించడానికి సంకీర్ణ భాగస్వాము లు అంగీకరించడం లేదు. "ప్రధానమంత్రిని సమర్థించవలసిందిగా మంత్రులను మేము అడిగాం. అయితే ప్రతి ఒక్కరూ వారి సొంత రాజకీయ అంచనాలు వేసుకొంటున్నారు" అని సంకీర్ణం చైర్మన్ డేవిడ్ బిటన్ పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు వున్న నెతన్యాహుకు మోడీ ఘనస్వాగతం పలకడం చూస్తే అవినీతిని సహించేది లేదని మోడీ చెప్పే మాటల్లోని చిత్తశుద్ధిని శంకించక తప్పదు. మాజీ ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆయన దిగజారి గుజరాత్ ఎన్నికల సందర్భంగా చేసిన ప్రచారాన్ని ఈ సందర్భంగా గుర్తుచేయాలి. మన్మోహన్ సింగ్ లాంటి వ్యక్తి దిగజారడని మోడీకి తెలిసి కూడా ఉద్దేశపూర్వ కంగా ఆయన్ని అప్రతిష్టపాలు చేయడాన్ని మోడీ కొనసాగిస్తున్నాడు. భారతదేశంలో తానొక్కడే స్వచ్ఛమైన రాజకీయవేత్తగా, మిగతా వారందరూ అవినీతిపరులుగా చిత్రీకరించడానికి చేస్తున్న ప్రయత్నం 'గురివింద గింజ' సామెతను గుర్తుచేస్తోంది. అవినీతి కేసుల్లో నెతన్యాహు ప్రమేయం బహిరంగ రహస్యం. రెండు అవినీతి కేసుల్లో నెతన్యాహుపై లాంఛన విచారణ జరపడానికి గత నెలలో ఇజ్రాయిల్ మీడియా సైతం ఆలోచన చేసింది. అవినీతి ఆరోపణల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే నెతన్యాహు భారత్‌లో పర్యటించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది జూలైలో జరిగిన మోడీ-నెతన్యాహు సమావేశం ఇజ్రాయిల్-పాలస్తీనా శాంతిక్రమాన్ని త్రోసిపుచ్చిన విషయాన్ని గుర్తుచేయడం సముచితంగా వుంటుంది. అయితే, సోమవారం న్యూఢిల్లీలో విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఆసక్తికరంగా, ఇజ్రాయిలీయులు- పాలస్తీనీయుల మధ్య త్వరలో శాంతి చర్చలు పునరుద్ధ రించబడతాయని వక్కాణించారు. ఇది వ్యూహాత్మక మార్పు. అయితే, ప్రకటనకే పరిమితం కాకుండా ఆచరణాత్మకంగా వుండాలి. నెతన్యాహు అవినీతి ఆరోపణలపై విచారణకు సిద్ధపడి నిజాయితీని నిరూపించుకోవాలి. ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన రెండు దేశాల ఏర్పాటుకు నెతన్యాహు అంగీకారం తెలపడం విజ్ఞత అనిపించుకొంటుంది.

చురక

ఆర్థిక సంస్కరణల
ఆపరేషన్ సుఖాంతం
ఉన్నోళ్లకు రక్తమిచ్చే
లేని బతుకు దుఃఖాంతం

అంతరాల అభివృద్ధి
అసమానత అవమానం
సంపదెంతో పెంచుకున్న
సంపన్నుల బహుమానం

– వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

విష కౌగిలి


బుడ్డిగ జమిందార్

అసలు విషయాన్ని మరుగునపరిచి సెన్సేషన్స్ సృష్టించటంలో ఆరిదేరిన దిట్ట మన ప్రధాని మోడీ. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఈ నెల 15న మనదేశ పర్యటనకు వచ్చినపుడు ప్రోటోకాల్‌ను ప్రక్కకుపెట్టి నెతన్యాహును మోడీ గట్టిగా హత్తుకొని కౌగిలిలో బంధించి స్వాగతం పల్కారని మన కార్పొరేట్ మీడియా కొనియాడింది. ఈ కౌగిలి ద్వారా ఇద్దరం ఒక్కటేనని నిరూపించేందుకు ప్రయత్నించారు. ఏ విషయంలో ఒకటి? గుజరాత్ మారణకాండ, పాలస్తీనీయన్లపై జాత్యహంకార ఊచకోతలు ఒకటేనని ప్రపంచానికి తెలియదనుకొని అంతరంగాన్న ఏకమవ్వటం కోసమని చాలామంది విజ్ఞులమధ్య చర్చ జరుగుతోంది. మనదేశంలో చేసుకోబోయే ఆర్థిక, మిలటరీ ఒప్పందాల మధ్య చారిత్రాత్మక తాజ్‌మహల్ కట్టడాన్ని, సబర్మతీ ఆశ్రమం, నర్మదానదీ తీరాన్నగల గాంధీ సమాధిని దర్శించారు నెతన్యాహు దంపతులు. సబర్మతీ ఆశ్రమంలో గాంధీవాదానికి చిహ్నంగా నిర్మించిన నూలురాట్నం దగ్గర కూర్చుని నూలువడుకుతున్నట్లు గాంధీ ఆశయాల్కి వారసులుగా ఫోజులిచ్చారు. పత్రికలో ఫొటోలు ముద్రితమైనాయి. విదేశీవస్త్ర బహిష్కరణకు, స్వదేశీ గ్రామస్వరాజ్యానికి చిహ్నంగా చరకా (నూలురాట్నం)ను మనం అర్థంచేసుకోవాలి. కానీ ఆచరణలో మనం చేస్తున్నదేమిటి? అనుమతినిస్తున్నదేమిటి? పేపర్లలో ఫొటో పోజులకోసం లక్షలరూపాయల వ్యయంతో కుట్టిన విదేశీ సూట్లు వేసుకొని చరకాముందు నటించడం సమంజసమా?

పాలస్తీనా, ఇజ్రాయిల్, ఆయుధాలపై గాంధీజీ అభిప్రాయం

మేక్‌ఇన్ ఇండియా పేరుతో విదేశీ కార్పొరేట్లకు, వారి ప్రతినిధులకు 'రెడ్‌కార్పెట్' పరచటం స్వాగతించ పరిణామమా? అయితే ఇజ్రాయిల్-పాలస్తీనా సంబంధాల్లో గాంధీ ఏమన్నారు? చరిత్రను నెమరువేసుకొంటే ఆసక్తికర విషయాలు వెల్లడవుతాయి. అల్-జజీర్ పత్రిక చరిత్ర పుటల్నుంచి ఈ వాక్యాలను ఉటంకించింది. 1938లో గాంధీ పాలస్తీనాను అరబ్బులకు చెందిన ప్రాంతంగా పేర్కొన్నారు. యూదులను అరబ్‌లపై ఉంచటాన్ని తప్పుగానూ, అమానవీయంగానూ పేర్కొన్నారు. 1946లో గాంధీజీ..."యూదులు అమెరికా, బ్రిటీష్ ధన సహాయంతో స్వాగతించబడని దేశమైన పాలస్తీనాలోకి ఎందుకు చొచ్చుకుని రావాలి?" అని అన్నారు. ఇంతటితో ఆగకుండా ఉగ్రవాద స్థాపనకు కారకులవుతూ పాలస్తీనా భూభాగంలోకి యూదులు ఎందుకు రావాలి" అని అడిగారని అల్ జజీర్ పత్రిక పేర్కొంది. 1931వ సంవత్సరంలో మిలటరీ రంగంపై 'భవిష్యత్తు భారతదేశ అభిప్రాయమేమని? గాంధీజీని ఒక విలేకరి ప్రశ్నించగా' 'భారతదేశ భవిష్యత్తులో బహుతక్కువ ఆయుధాలు కల్గిఉంటుంది" అని సమాధానమిచ్చారని సీనియర్ జర్నలిస్టు విజయ్‌ప్రసాద్ తెలిపారు. కానీ ప్రస్తుతం ప్రపంచంలో, మనదేశంలో జరుగుతున్నదేమిటి? ఆయుధపోటీ శరవేగంగా దూసుకెళ్తున్నది. ఇజ్రాయిల్ ఆయుధాల్ని మనం విపరీతంగా కొంటున్నాం.

ఏప్రిల్ 2017లో రెండు వందలకోట్ల డాలర్ల ఆయుధాల్ని ఇజ్రాయిల్ నుండి కొనటానికి ఒప్పందం చేసుకొన్నాం. ఇందులో భాగంగా 50 కోట్లడాలర్ల ఎగ్రిమెంటు యుద్ధట్యాంకు వ్యతిరేక 800 క్షిపణులకు సంబంధించినవి. కానీ మనదేశంలో మనం గర్వపడే ప్రభుత్వరంగ సంస్థ డీఆర్‌డీవోకి ఈ క్షిపణుల్ని తయారుచేసే శక్తి సామర్థ్యాలున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్ని నీరుగార్చే ఉద్దేశానికే ఆ ఒప్పందం. దేశంలో నిరసనలు ఉద్యమాలు జరిగాయి. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనుకకు తీసుకోక తప్పలేదు. కానీ మనదేశ పర్యటనకు వచ్చిన ఇజ్రాయిల్ ప్రధాని మాత్రం ఈ క్షిపణుల ఒప్పందం ఇంకా రద్దుకాలేదని, చర్చకు సిద్ధంగా ఉందని అనటం శోచనీయం. పైపైన జనాల్ని ఒప్పించటానికి, నచ్చజెప్పటానికి మాత్రం ఇజ్రాయిల్ వ్యవసాయరంగాన్ని అతిగా చూపిస్తారు. వాస్తవానికి యుద్ధ ఆయుధాల కొనుగోలు భారతలక్ష్యం. అమ్మకాలు ఇజ్రాయిల్ ఆశయం. ఇజ్రాయిల్‌లో రబ్బరు బుల్లెట్స్ పాలస్తీనియన్లపై సురక్షితంగా వాడుతున్నామని బయటి ప్రపంచానికి తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారు. వాస్తవానికి ఈ లెథల్ ఆయుధాల వలన పాలస్తీనాలో అనేకమంది చనిపోయారు. కళ్లను పోగొట్టుకొన్నారు. ఇటువంటి రబ్బరు బుల్లెట్లను మన కాశ్మీరులో ప్రయోగించటానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారమందుతున్నది. ఇదే నిజమైతే మనం నిర్భయంగా తిరస్కరించాలి, నిరసించాలి.


పేర్లు మార్చటం, మౌనం వహించటం పరిష్కారం కాదు

సెంట్రల్ ఢిల్లీలో తీన్‌మూర్తి హౌస్‌గా ఇప్పటి వరకూ నెహ్రూ భవనాన్ని పిలిచేవారు. నెహ్రూ హౌస్‌గా వున్న ఈ ప్రాంతాన్ని మర్చిపోయే విధంగా తీన్‌మూర్తి హైఫా చౌక్‌గా మార్చటం వివాదాంశనీయమైంది. ఒట్టోమన్ సామ్రాజ్యం నుండి హైఫా పట్టణాన్ని బ్రిటిషు సేనలతో కలిసిన భారతసైన్యం 1918 సెప్టెంబరు 23న విమోచనం చేసిన మాట వాస్తవమైనప్పటికీ ఈ నగరం ఇజ్రాయిల్‌కు చెందినదనటం పాలస్తీనా భూభాగంలోనిదే గనుక (ఆనాటికి) వివాదాంశమే. ఈ చౌక్ పేరు మార్చటం వెనుక ఆరెస్సెస్ హస్తం వుంది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో యూదులతో రహస్య ఒప్పందం (బెల్‌ఫోర్స్) ప్రకారం అరబ్బుల పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్‌కు భూభాగం కేటాయించి 1948లో ఐక్యరాజ్యసమితిలో అధికారికంగా గుర్తింపజేశారు. పాలస్తీనాకు గాజాస్ట్రిప్, వెస్ట్‌బ్యాంకు కేటాయించి అదికూడా లేకుండా ఇజ్రాయిల్ అనేకసార్లు యుద్ధాలు చేసి 5 లక్షల మంది వరకు పాలస్తీనీయన్లను చంపి, 60 లక్షలకు పైగా వలసలకు పోయేలా దేశాన్నుంచి తరిమింది. 1967లో జరిగిన ఆరు రోజుల యుద్ధంలో జెరూసలేంను కూడా ఆక్రమించింది. దీనికి ఎప్పుడూ ఐక్యరాజ్యసమితి నుండి గుర్తింపుగాని ఆమోదం గాని లేదు. నెతన్యాహు పర్యటన జెరూసలెం దురాక్రమణ తీర్మానాన్ని మనదేశం ఐక్యరాజ్యసమితిలో వ్యతిరేకించి అమెరికా తీర్మానాన్ని ఓడించిన తర్వాత జరిగింది. నెతన్యాహు 6 రోజుల భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ అనేకసార్లు కలుసుకొని చర్చలు జరిపి మీడియా ముందు మాట్లాడిన సందర్భాలున్నాయి. కానీ పాలస్తీనాపై మన విధానాన్ని మోడీ కావాలనే ఎక్కడా వెలిబుచ్చలేదు. పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించలేదు. అన్ని మతాలకు ప్రతీకగా నిల్చిన జెరూసలెం దురాక్రమణ ఉద్దేశాన్ని ఎండగట్టలేదు.

దౌత్య సంబంధాల ఉద్దేశం వర్తకం వాణిజ్యం కాదు. మొదటివరుసలో మానవహక్కులు, దేశాల మధ్య మానవీయ సంబంధాలు. జాత్యహంకార, మతహంకార విధానాలకు వ్యతిరేకత చూపటం. నీతి నియమాలు, అహంకారరహిత సమాజస్థాపన ధ్యేయంగా ఉండాలి. దౌత్య సంబంధాలంటే కేవలం పారిశ్రామిక కార్పొరేట్ల పర్యటనా ఫలాలను నిర్దేశించేవి మాత్రమే కాదు. అన్నిటికన్నా ముఖ్యంగా శాంతి సుస్థిరతలు, ఇరుగుపొరుగు దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవటం, అన్ని దేశాల సార్వభౌమాధికారాల్ని గౌరవించటం తప్పనిసరి. ఈ లక్షణాల్ని ఇజ్రాయిల్ దేశం ఎంతవరకూ అమలుజేస్తుందో మనం పరిశీలించాలి.


వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు. సెల్ : 9849491969

ఆంగ్ల-నిజాం సేనలను ఢీకొన్న అమర వీరుడు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్

సంస్మరణ



ఆధునిక ఆయుధాలు కలిగి, అపారమైన సైనిక బలగాలున్న బ్రిటీష్ పాలకులను ఎదుర్కోవటం మృత్యువును వాటేసుకోవడమేనని స్వదేశీ యోధులకు స్పష్టంగా తెలిసినా, తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి పరాయి పాలకులను తరిమికొట్టేందుకు నడుంకట్టిన యోధులలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ఒకరు. పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ హైదరాబాద్ నివాసి పఠాన్ రుస్తుం ఖాన్ కుమారుడు. బ్రిటీష్ సైన్యంలో సైన్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన పరాక్రమాలకు పెట్టింది పేరైన రొహిల్లా సైనిక పటాలానికి చెందిన నాయకుడు. ఉత్తర హిందూస్థానంలో ఆరంభమైన తిరుగుబాటు పవనాలు తిన్నగా దక్షణ హిందూస్థానాన్ని కూడా తాకాయి. ఆంగ్లేయులకు హితుడుగా మారిన నైజాం నవాబు వారి అభీష్టం మేరకు నడుచు కుంటున్నా, బ్రిటీష్ పాలకుల నుండి మాతృగడ్డను విముక్తి చేయమని యువతీ యువకులను, భారతీయ సైనికులను, స్వదేశీ పాలకులను ధార్మికపెద్దలు ప్రోత్సహిస్తున్న వాతావరణం. ఆ వాతావరణంలో బానిసత్వం నుండి విముక్తికై పోరాడమని హైదరాబాద్‌కు చెందిన మౌల్వీ సయ్యద్ అల్లావుద్దీన్ తుర్రేబాజ్ ఖాన్‌కు ఉద్బోధించారు. ఆ ప్రేరణతో ఆంగ్లేయుల మీద పోరాటానికి నడుం కట్టిన తుర్రేబాజ్ ఖాన్ మౌల్వీ అల్లావుద్దీన్ సహకారంతో చరిత్రాత్మక మక్కా మసీదు నుండి బయలుదేరి, బ్రిటీష్ అధిపత్యానికి చిహ్నమైన హైదరాబాద్ రెసిడెన్సీ మీద సుమారు 500 మంది సాహసికులతో 1857 జూలై 17న సాహసోపేతమైన దాడి చేశారు. ఆ దాడిలో వీరోచితంగా పోరాడిన పలువురు సహచరులను కోల్పోయిన ఖాన్, బ్రిటీష్-నిజాం బలగాలకు 1857 జూలై 22న పట్టుబడ్డారు. ఆయనకు ప్రభుత్వం ద్వీపాంతరవాస శిక్ష విధించి, యావదాస్తిని స్వాధీనం చేసుకున్నది. బ్రిటీష్ పాలకులు విధించిన ఆ శిక్ష అమలు జరిగేలోగా తనకు కాపలాగా పెట్టిన సెంట్రీలలో కూడా మాతృభూమి పట్ల గౌరవాభిమానాలను ప్రోదిచేసిన పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ 1859 జనవరి 18న జైలు నుండి తప్పించుకున్నారు. ఈ చర్యతో ఆగ్రహించిన ప్రభుత్వం తుర్రేబాజ్ ఖాన్‌ను సజీవంగా గానీ నిర్జీవంగా గానీ పట్టితెచ్చిన వారికి 5వేల రూపాయల నజరానాను ప్రకటించింది. ఆ ప్రకటనతో అప్రమత్తులైన తుర్రేబాజ్ ఖాన్ రహస్యంగా ప్రజలలో తిరుగుతూ, బ్రిటీష్ సేనలపై తిరిగి దాడులకు ప్రయత్నాలు చేయసాగారు. ఖైదు నుండి తప్పించుకున్న ఖాన్‌ను ఎలాగైనా పట్టుకుని అంతం చేయాలన్న పట్టుదలతో బ్రిటీషు సైన్యాలు, నిజాం సేనలు నిఘాను తీవ్రతరం చేశాయి. చివరకు నిజాం నవాబు ప్రకటించిన నజరానాకు ఆశపడిన కుర్‌బాన్ అలీ అను నమ్మకద్రోహి తుర్రేబాజ్ ఖాన్ ఆచూకీని బహిర్గతం చేశాడు. ఆ సమాచారంతో 1859 జనవరి 24న, మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామం మీద నిజాం, బ్రిటీష్ సైన్యాలు విరుచుకుపడ్డాయి.



ఆధునిక ఆయుధాలతో చీమలదండు వలే వచ్చిపడుతున్న నిజాం, ఆంగ్ల సైనికులను తూప్రాన్‌లో తలదాచు కుంటున్న తుర్రేబాజ్ ఖాన్ ఒంటరిగా ఎదుర్కొన్నారు. ఆ పోరాటంలో శత్రువు తుపాకి గుండ్లకు తుర్రేబాజ్ ఖాన్ ఎరయ్యారు. ఆ తరువాత ఆ యోధుని మృతదేహాన్ని బ్రిటీషు సైన్యాలు హైదరా బాదుకు తరలించాయి. ఆయన భౌతికకా యానికి అంత్యక్రియలు ఏవీ జరపకుండా బలమైన ఇనుప సంకెళ్లతో కట్టేసి ప్రస్తుతం సుల్తాన్ బజారు పోలీసు స్టేషన్ ఉన్న చోట బహిరంగంగా వేలాడదీశారు. ప్రజలలో తిరుగుబాటు ఆలోచనలు ఏమాత్రం పొడ చూపకుండా భయోత్పాతం కల్గించేందుకు అత్యంత కర్కశ చర్యలకు పాల్పడిన పాలకులు చరిత్ర హీనులుగా ఈనాటికి ప్రజల శాపనార్థాలను పొందుతుండగా, మహాయోధుడు తుర్రేబాజ్ ఖాన్ మాత్రం స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రపుటలలో గౌరవప్రదమైన స్థానం పొంది చిరస్మరణీయులయ్యారు.

(ప్రథమ స్వాతంత్ర్యసమరయోధులు పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ అమరుడైన రోజు జనవరి 24 సందర్భంగా చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ విరచిత 'చిరస్మరణీయులు' చరిత్ర గ్రంథం నుండి)

ఏపీ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర రచనలో నా పాత్ర

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర మొదటి భాగాన్ని (1934-36) కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) 1983లో రచించారు. ఇది పార్టీ సభ్యుల, ప్రజల విశేషాదరణ పొందింది. తరువాత చరిత్ర కూడా రాయవలసిందిగా రాష్ట్ర కమిటీకి పలువురు సభ్యులు రాశారు. 1984 ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సమావేశం చర్చించి కామ్రేడ్స్ వై.వి. కృష్ణారావు (కన్వీనర్), ఏటుకూరి బలరామమూర్తి, పరకాల పట్టాభి రామారావులతో చరిత్ర రచనా సంఘాన్ని నియమించింది. చరిత్ర రచన కార్యకలాపాలకు తోడ్పడవలసిందిగా కామ్రేడ్ తుమ్మల వెంకట్రామయ్యని కోరగా ఆయన అంగీకరించారు. 1968 జనవరిలో ఏలూరులో జరిగిన రాష్ట్ర పార్టీ 11వ మహాసభలో నేను రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికయ్యాను. 1990 వరకు కొనసాగాను. పార్టీ చరిత్ర రెండవ భాగంలో 1936 నుండి 1942 వరకు రాయడం జరిగింది. 1934-36 కాలానికి సంబంధించిన మరికొన్ని వివరాలను కూడా సేకరించి ఇందులో చేర్చాలని కమిటీ సమావేశంలో నిర్ణయించాం.

చరిత్ర రచనకు సంబంధించిన సమాచార సేకరణకు నేను, విశాలాంధ్ర హైదబాద్ సబ్ ఆఫీసులో పనిచేస్తున్న రమణ కలిసి ఢిల్లీలోని కేంద్ర పార్టీ కార్యాలయం అజయ్‌భవన్‌కు 1984 నవంబరులో వెళ్లాం. అజయ్‌భవన్ లైబ్రరీలో వున్న పాత నేషనల్ ఫ్రంట్ పార్టీ రహస్య పత్రిక "కమ్యూనిస్టు", న్యూయేజ్ తదితర పత్రికల నుండి ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించిన సమాచారాన్నంతా ఫోటోస్టాట్ చేయించి తీసుకుని వచ్చాం. ఆంధ్రపత్రిక, కాగడా, జమీన్ రైతు తదితర పత్రికలనుంచి కూడా సమాచారాన్ని సేకరించాం. నవశక్తి, ప్రజాశక్తి పత్రికలతోపాటు ఆనాటి ఆంధ్రప్రతిక నుండి లభించిన సమాచారం అలాగే నేను రాసిన విద్యార్థి ఉద్యమం, యువజనోద్యమ చరిత్ర రచనకు ఎంతగానో తోడ్పడింది.


పరకాల పట్టాభి రామారావు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర రెండవ భాగం 902 పేజీలు గల ఉద్గ్రంథం. ఇందులో 9వ అధ్యాయం విద్యార్థి ఉద్యమం 490-636=146 పేజీలు. 10వ అధ్యాయనం యువజనోద్యమం 638-679 వరకు 41 పేజీలు నేను రాశాను. 12వ అధ్యాయం మహిళా ఉద్యమం (708-730 పేజీలు) అసంపూర్తిగా వుండిపోయినప్పుడు (కామ్రేడ్ తుమ్మల అకస్మాత్తుగా 1987 నవంబరు 7వ తేదీన చనిపోవడం వలన) మహిళా ఉద్యమ చరిత్ర కూడా యించుమించు అంతా నేనే పూర్తిచేశాను.

విద్యార్థి, యువజనోద్యమాలతోను, మహిళా ఉద్యమం తోను నాకు గల ప్రత్యక్షానుభవం వలన ఈ మూడు చరిత్రలు నేను ఎక్కువ ప్రయాసపడకుండానే రాయగలిగాను. ఆనాడు ఎదుర్కొన్న సమస్యలు, జరిపిన పోరాటాలు, స్వాతంత్ర్యోద్య మంలో, తదుపరి కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ రంగాలు వహించిన పాత్ర గురించి సవివరంగానే రాయగలిగాను. పార్టీ పత్రికల సమాచారమే గాక కొన్ని సందర్భాలలో ఆనాటి ఆంధ్రపత్రిక రిపోర్టులు చాలా బాగా ఉపయోగపడ్డాయి. కమ్యూనిస్టు ఉద్యమంపట్ల, విద్యార్థి యువజన తదితర ఉద్యమాలపట్ల జాతీయ దినపత్రికలలో వివక్షత పాక్షికత, వ్యతిరేకత లేవు. స్వాతంత్ర్య సమరంలో, బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగంగానే ఈ ఉద్యమాలను చూడటం, ఆయా సంఘాలు జరిపిన పోరాటాలు, మహాసభలు గురించి మంచి రిపోర్టులే ఉండేవి. 1942-48 ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర మూడవ భాగంలో కూడా విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాల చరిత్రతోబాటు, ఆంధ్ర జాతీయ పునర్జీవనోద్యమ చరిత్ర కూడా రాశాను.

ఇది కాక స్వాతంత్ర్య సమరాంగణంలో "తూర్పు గోదావరి జిల్లా" పేర తూర్పు గోదావరి జిల్లా కమ్యూనిస్టు నాయకులు. ట్రేడ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ పి.ఎస్. శర్మ (పాలెపు సత్యనారాయణ శర్మ) రాయ సంకల్పించి ఆ జిల్లా విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించినవారిలో ఒకరుగా ఆ జిల్లా విద్యార్థి ఉద్యమ చరిత్ర రాయాలని నన్ను కోరారు. అలాగే జిల్లా సాంస్కృతికోద్యమం గురించి రాయమన్నారు. నేను రాష్ట్ర పార్టీ చరిత్ర రెండవ భాగం (1936-42)లో రాష్ట్ర విద్యార్థి ఉద్యమ చరిత్ర రాసివున్నందున, తూర్పు గోదావరి జిల్లా విద్యార్థి ఉద్యమ చరిత్ర కూడా అందులో ఉందిగనుక శర్మ గారు కోరిన విధంగా చాలా వివరంగా రాసి పంపాను.

(ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ జర్నలిస్టు, కమ్యూనిస్టు నాయకులు అమరజీవి పరకాల పట్టాభిరామారావు ఐదవ వర్ధంతి మంగళవారం జరిగిన సందర్భంగా ఆయన రాసిన 'విశాలాంధ్ర సంపాదక వర్గంలో 50 యేళ్ల అనుభవాలు, జ్ఞాపకాల' నుంచి)

ఇ-మెయిల్

పరిణామ సిద్ధాంతం-అధికారిక రాద్ధాంతం

కేంద్ర మానవ వనరుల శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పు అని సెలవిచ్చారు. దానికి ఆయన తెచ్చిన రుజువేమిటంటే ఆ సిద్ధాంతం చెప్తున్నట్టుగా కోతి నుండి మనిషి పుట్టాడన్నది ఎవరూ చూడలేదు,రాయలేదు కదా అన్నది. వాదన బాగానే ఉంది గానీ ఒక శాస్త్రీయ సిద్ధాంతం తప్పు అని నిరూపించడానికి వితండ వాదన ఒక్కటే సరిపోదు. ప్రత్యామ్నాయ వైఖరికి మద్దతుగా బలమైన, నిరూపించదగ్గ సాక్ష్యాలు కావాలి. అవి లేకుండా మాట్లాడడం కేవలం సొంత అభిప్రాయం క్రిందే మిగిలిపోతుంది. ఆయన ఇంతటితో ఆగినా బాగుండేది. పాఠ్యంశాల్లోంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించాలని తీర్మానించారు. అది బరి తెగింపు. బాధ్యతారాహిత్యం. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా ప్రభుత్వం కృషి జరపాలని రాజ్యాం గంలోని ఆదేశిక సూత్రాలు చెప్తున్నాయి. మంత్రులు అందుకు భిన్నంగా ప్రవర్తించరాదు. ఆయన సందేహించిన పరిణామ సిద్ధాంతం ప్రపంచ వ్యాప్తంగా అంగీకరింపబడినది. వెన్నెముక నిర్మాణ రీతులు,చేతులకు ఐదు వేళ్లుండడం లాంటి సారూప్యాలతో బాటు డీ యెన్ ఏ స్టడీస్ అన్నీ దార్విన్ ప్రతిపాదిత మానవ పరిణామ సిద్ధాంతాన్ని మరింత బలపరుస్తున్నాయి.అందుకు వ్యతిరేక వాదనలేవీ శాస్త్ర పరీక్షల గీటురాయికి నిలిచేవి కావు. శాస్త్ర విజ్ఞానమెప్పుడూ నేనేది చెప్తే అదే సత్యం అనదు.ససాక్ష్యంగా రుజువులుంటే మార్పు నంగీకరిస్తుంది. ఆ సాక్ష్యాలు తిరుగులేకుండా నిరూపించ దగినవిగా ఉండాలి. బాధ్యతాయుత పదవుల్లో ఉండే వ్యక్తులు ఆషామాషీగా మాట్లాడకుండా వుంటే అదే వారు శాస్త్ర విజ్ఞానానికి చేసే పెద్ద మేలు.

(మంత్రి గారు కోతి నుండి మనిషి ఉద్భవించాడంటే నమ్మలేక పోవచ్చు.కానీ బుద్ధుల్లో మనిషి నుండి కోతిగా మారొచ్చునేది నమ్మి తీరాలి. మరి అదే .. పరిణామ సిద్ధాంతం. కాకపోతే ఉల్టాపల్టా)

– డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

Dwaraka

విశాలాంధ్ర
బతుకు
The Life

బుధవారం
24 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

బిడ్డకు పాలు చాలకపోతే...



బిడ్డకు తల్లిపాలు పట్టించడం చాలా అవసరం. తల్లిపాలు తాగడం వల్ల పుట్టిన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కనుక బిడ్డకు కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే కొంత మంది స్త్రీలకు బిడ్డకిచ్చే పాలు తక్కువగా వస్తాయి. ఇలాంటి వారు కొన్ని చిట్కాలు పాటించి బిడ్డకు సరిపడా పాలను పట్టించవచ్చు.

బిడ్డకు పాలు సమృద్ధిగా అందాలంటే తల్లి బలమైన పోషక ఆహారం తీసుకోవాలి. మంచి ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్లు, ఐరన్ ఎక్కువగా వుండే ఆహారం తినాలి. ప్రోటీన్లు ఎక్కువగా లభ్యమయ్యే పాలు, గుడ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలి. అదేవిధంగా విటమిన్ ఎ ఎక్కువగా ఉండే క్యారెట్, గుమ్మడి వంటి కాయకూరలు తినాలి. పోషకాలు ఎక్కువగా వుండే ఉడికించిన బఠాణీలు, బీన్స్, మొలకెత్తిన గింజలు తీసుకోవాలి. ఫొలెట్ అధికంగా లభ్యమయ్యే ఆకు కూరలు ఎక్కువగా తినాలి. పండ్లు, పప్పు ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలి. తద్వారా తల్లి నుంచి బిడ్డకు కావలసినన్ని పాలు చిక్కుతాయి.

బిడ్డకు పాలిచ్చే తల్లులు మసాలాలు ఎక్కువగా వుండే ఆహారం తీసుకోకూడదు. వీరి కోసం వండే ఆహార పదార్థాల్లో మసాలు తగ్గించాలి. అలాగే సువాసననిచ్చే కొత్తిమీర, దాల్చిన చెక్క ఉపయోగించరాదు. ఇటువంటివి వాడితే ఆ సువాసన ఘాటు బిడ్డకు ఇచ్చే తల్లిపాల రుచిని మారుస్తుంది. తద్వారా బిడ్డ.. పాలు సరిపడినన్ని తాగలేదు.

ముఖ్యంగా బిడ్డకు పాలిచ్చే మహిళలు మద్యం సేవించడం, పొగాకు తీసుకోవడం వంటి అలవాట్లకు దూరంగా వుండాలి. ఇవి పాల ఉత్పత్తిని తగ్గించడమే కాకుండా వాటి ప్రభావం బిడ్డపై పడే ప్రమాదం లేకపోలేదని వైద్యులు పేర్కొంటున్నారు.

ఇంట్లో మొక్కలు పెంచితే?



ఇంట్లో చిన్న చిన్న మొక్కల్ని పెంచడం ద్వారా ఆరోగ్యానికి మేలు చేసిన వారవుతారని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మొక్కలు పెంచడం వల్ల ఇంట్లోకి చేరే హానికర వాయువులైన బెంజీన్, కార్బన్ మోనాక్సైడ్ వంటి వాటిని దూరం చేసుకోవచ్చు. వివిధ రకాలైన సెంట్‌లు, హెయిర్ స్ప్రేలు, ఫర్నిచర్ పాలిష్‌లు, సిగరేట్ వాయువుల్ని చిన్న చిన్న మొక్కలు పీల్చుకుంటాయి. తద్వారా ఏర్పడే తలనొప్పి, నరాల బలహీనత, కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి బయట పడవచ్చు. అలోవెరా, రబ్బర్ ప్లాంట్ తదితరాలు ఇంట్లో వుంచుకోవడం వల్ల ఎన్నో వాయువుల బారి నుండి రక్షణ లభిస్తుంది.

రూమ్ ఫ్రెష్‌నర్లు, ఏరోసోల్, కొవ్వొత్తులు వాడకుండా ఉంటే మంచిది. నెయిల్ పాలిష్ రిమూవర్లు వినియోగించాల్సి వస్తే ఇంటి బయట వాడాలి. కార్పెట్లు, దుప్పట్ల వంటి వాటిని ఎప్పటి కప్పుడు శుభ్రం చేస్తుండాలి. ఇంట్లో ధూమపానం చేయకూడదు. ఒక్క సిగరేట్ తాగినా కూడా అది ఇంట్లోని వారందరి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.

అంతేకాదు...వంద మొక్కలున్నప్పటికీ సిగరేట్ వదిలే విషపూరిత వాయువులను పూర్తిగా నాశనం చేయలేవని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. గదిలోకి గాలీ, వెలుతురు బాగా వచ్చేలా కిటికీలు, తలుపులా ఏర్పాటు చేసుకుంటే స్వచ్ఛమైన గాలిని పీల్చవచ్చు. అందుచేత ప్రస్తుత స్థలాభావం వల్ల ఇంటి చుట్టూ పెద్ద పెద్ద వృక్షాలు పెంచకపోయినా సరే చిన్న చిన్న మొక్కల్ని పెంచుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

మహిళలకు పొంచివున్న ప్రమాదం...



కంప్యూటర్ల పుణ్యమా అని ప్రస్తుతం గంటల తరబడి వాటి ముందు కూర్చొని పనిచేసే వారి సంఖ్య పెరిగిపోతోంది. శారీరక శ్రమ లేకపోవడం, తరచూ కంప్యూటర్ల ముందు కూర్చోవడం ద్వారా లెక్కలేనన్ని రోగాలు సులభంగా వచ్చేస్తున్నాయి. ముఖ్యంగా గంటల కొద్దీ కూర్చొని పనిచేసే మహిళలకు అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

అయితే ఎక్కువ సేపు కూర్చొని పనిచేసే మహిళల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తాజా అధ్యయనంలో తేలింది. ఎలాంటి శారీరక శ్రమ లేకుండా, ఎక్కువ సేపు కూర్చొనే మహిళల్లో క్యాన్సర్ వచ్చే ముప్పు 10 శాతం ఎక్కువగా ఉందని తాజా అధ్యయనం తేల్చింది.

మగవారిలో మాత్రం ఎక్కువ సేపు కూర్చోవడానికి, క్యాన్సర్‌కు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది. 1999 నుండి 2009 వరకు దాదాపు 69 వేల మంది పురుషులు, 77 వేల మంది స్త్రీలపై కొనసాగిన ఈ పరిశోధనల్లో కూర్చొని పనిచేసే మహిళల్లోనే క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నట్లు తెలియ వచ్చింది.

ఎక్కువసేపు కూర్చుని పనిచేసే మహిళల్లో బ్రెస్ట్, ఓవేరియన్, బ్లడ్ క్యాన్సర్ సోకే అవకాశం ఉన్నట్లు తేలింది. కాబట్టి మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే శారీరక శ్రమకు కాస్త ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు.

అదుపులేని ఖర్చుతో
ఇల్లు గుల్ల...

వెయ్యి రూపాయల సంపాదన ఉన్నప్పుడే హాయిగా ఉన్నామని కొంతమంది అప్పుడప్పుడు అంటుంటారు... ఇప్పుడేమో వేలకు వేలు వచ్చినా... ఎప్పుడు చూసినా అప్పు చేయాల్సి వస్తుందని వాపోతుంటారు. అసలు అంత ఖర్చు ఎందుకు అవుతున్నట్లు... అనే అంశంపై దృష్టి సారించి దానిని అదుపులో పెట్టగలిగితే, ఇప్పుడు కూడా ఆనందంగానే ఉండవచ్చంటున్నారు ఆర్థిక నిపుణులు. ఆగని ఈ ఖర్చుల ప్రవాహానికి కొన్ని చిట్కాలను సూచిస్తున్నారు.



భారీ ఖర్చుతో ముడిపడి ఉండే మీ దీర్ఘకాలిక ప్రణాళికలను ముందే తయారు చేసుకోండి. అదేవిధంగా చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో దానిలో పెట్టుబడి పెడదాం...లాంటి ప్రయత్నాలు చేయకండి. ఒకవేళ అటువంటి ప్రయత్నం తప్పనిసరి అని అనుకున్నప్పుడు ఆర్థిక నిపుణుల సలహాను తీసుకోవడం ఉత్తమం.

చేతిలో నగదు ఎక్కువగా ఉన్నప్పుడు... దాన్ని అలాగే ఉంచారంటే... అది కొనాలి... ఇది కొనాలి... అంటూ అప్పుడే కొత్తకొత్త ఖర్చులు గుర్తుకువస్తాయి. దాంతో అవన్నీ తప్పకుండా ఖర్చయిపోతాయి. ఖర్చయిన తర్వాత అంతడబ్బు ఏమైందని వాపోవడం వల్ల ప్రయోజనం శూన్యం. కనుక ఖర్చులను లెక్కవేసి మిగిలిన మొత్తాన్ని ప్రతి నెలా రికరింగ్ డిపాజిట్లలో జమ చేసేలా ప్రణాళిక వేసుకోండి.

మీ ఇంటికి నెలవారీ ఖర్చు ఎంత అవుతుందో ప్రతి రోజూ లెక్కలు రాసుకోండి. నెల చివరిలో దేనికి ఎంతయిందో లెక్క చూడండి. దాన్ని చూస్తే మీరు ఆశ్చర్యపోవడం ఖాయం. ఎందుకంటే వాటిలో అనవసర ఖర్చులు చాలా ఉంటాయి. కనుక అటువంటి వాటిని కొనకుండా డబ్బు మిగల్చాలంటే నెలసరి బడ్జెట్ తప్పనిసరి. ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే... ఖర్చు పెట్టేందుకు అప్పు చేయకూడదన్న విషయం. నేడు ప్రతి ఒక్కరికి క్రెడిట్‌కార్డు సౌకర్యం అందుబాటులో ఉండటంతో డబ్బును ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేసేస్తున్నారు. కనుక క్రెడిట్ కార్డుకు స్వస్తి చెప్పి డెబిట్‌కార్డును మాత్రమే ఉపయోగించండి. అప్పుడు డబ్బు ఆదా అవుతుంది. నెలకు సరిపడా వంటింటి సరుకులు మాత్రమే కొనండి. డబ్బులున్నాయి కదాని రెండు మూడు నెలల స్టాకును ఇంటికి తెచ్చుకోకండి. కారణం చేతిలో ఉన్న డబ్బు ఖాళీ అవడమే కాక, తెచ్చిన వస్తువులు పాడయిపోయే అవకాశం లేకపోలేదు. అంతేకాదు, ఏదో ఇంట్లో ఉంటుందిలే అనుకుని అవసరం లేని వస్తువులకు డబ్బు ఖర్చు చేయకండి. ఆ వస్తువు ఎలాగూ మీకు ఉపయోగపడదు. కాగా చేతిలో ఉన్న డబ్బు మాత్రం ఖర్చయిపోతుంది. షాపింగ్ చేయడంపై మక్కువ చూపుతున్నారా? అయితే ఏం కొనాలనుకుంటున్నారో ముందే ఒక చీటీలో రాసుకోండి. షాపుకు వెళ్ళిన తర్వాత మీకు అవసరమైనది కాక చూసిన ప్రతి వస్తువు కొనాలనే కోరిక కలుగుతుంది. ఆ కోరికకు అడ్డుకట్ట వేసి మీకు కావలసిన వస్తువులు మాత్రమే కొనుగోలు చేయండి. డబ్బు ఆదా అవుతుంది.

మీరు వేసుకున్న బడ్జెట్ మించి ఖర్చు చేయాల్సి వస్తుంటే... ఒక్కసారి లెక్క సరిచూసుకోండి. ఎక్కడ ఎక్కువ ఖర్చుపెట్టామోనని తరచి తరచి చూడండి. అదనంగా కొనుగోలు చేసిన వాటి గురించి పునరాలోచించుకునే వీలు కలుగుతుంది. ఇలా మరొక్కసారి జరగకుండా చూసుకుంటే వృథా ఖర్చుకు కొంతైనా అడ్డుకట్ట పడుతుంది.

ఇక ఇంట్లో ఉన్నా... బయట ఉన్నా మనం నిత్యం చేసే పొరపాటు ఒకటి ఉంది. అదే ఇంట్లో లైట్లు, ఫ్యాన్లు, టీవీలు అవసరం లేకపోయినా పెట్టడం. ఇటువంటి వాటిని మార్చుకోవాలి. దాంతో విద్యుత్ ఆదా అవుతుంది. కరెంట్ బిల్లు తగ్గి డబ్బులు ఆదా అవుతాయి.

ప్రణాళికతోనే పొదుపు సాధ్యం

కుటుంబంలో భార్యభర్త ఇద్దరూ సంపాదిస్తుంటే ఆర్థికంగా ఎంతో వెసులుబాటు ఉంటుంది. అందులోనూ కచ్చితమైన ఆర్థిక ప్రణాళికతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సులువవుతుంది. అందుకే, ఖర్చులు తగ్గించుకుంటూ పొదుపు బాట పట్టడం ఎంతో ఉత్తమం.

సింధు, కుమార్ ఇద్దరూ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగులు. వయసు 35 ఏళ్లు. నెలకు ఇద్దరూ కలిసి 40వేలు సంపాదిస్తారు. వీరికి ఒకత్తే కూతురు. కూతురుకి పదేళ్ళు. కూతురంటే కుమార్‌కి ఎంతో ఇష్టం. తను ఏదడిగినా కాదనడు. అలాగని పాప అడిగిందల్లా కొనిస్తూ పోతే... ఎలా? అంటుంది సింధు. సింధు కూడా తక్కువేం కాదు, ఎప్పుడైనా షాపింగ్‌కి వెళితే అవసరం లేకున్నా ఆ డ్రస్ చాలా బాగుంది అంటూ కొనేస్తుంది. సింధు ఎప్పుడైనా స్నేహితులతో షాపింగ్‌లకు వెళ్ళినా తనకు నచ్చింది తెచ్చుకుంటుంది. కాని కుమార్ మాత్రం పొదుపరి. ఈ మధ్యనే బ్యాంకులో రుణం తీసుకొని ఇల్లు కొన్నారు. ఇది ప్రతి ఇంట్లో ఉండే సమస్యే. ఇదే కాదు, ఈతరం పిల్లలు షాపింగ్ అంతా ఆన్‌లైన్‌లలో చేస్తున్నారు. దాంతో క్రెడిట్ కార్డులకు చిల్లులు పడుతున్నాయి.

ఆర్థిక ప్రణాళికలు వేసుకొని వాటిని పాటించాలని చాలా మందే అనుకుంటారు. కాని అవి అమలు కావు. ఎందుకనంటే... ఖర్చులు పెరిగిపోతున్నాయి.ధరలు ఆకాశానంటుతున్నాయి అంటారు. అంతేకాదు, కొంతమందైతే ఎప్పుడో వచ్చే ఖర్చులకు ఇప్పటి నుంచే ప్రతి పైసా లెక్కలేసుకుంటూ గడపటం అవసరమా అని చిరాకు పడుతుంటారు. ఎవరి ధోరణి వారిది. కాని రోజురోజుకు ధరల్లో మార్పులు చాలా వస్తున్నాయి. గ్యాస్, పెట్రోల్, డీజిల్, కూరగాయలు, ఇంటి అద్దెలు, బ్యాంకు రుణ వడ్డీలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో తెలియదు. కాని వీటి ప్రభావం రోజువారీ, నెలవారీ ఖర్చులపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఇలాంటప్పుడు మనం ఇష్టమున్నట్లు ఖర్చు పెట్టడం తగ్గించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నామన్న సంగతి మరిచిపోవద్దు. అందుకే, సాధ్యమైనంత వరకు ఆర్థిక ప్రణాళికలను పాటించాలి. అంతేకాదు, వ్యక్తిగతంగా భార్యాభర్తల మధ్య ఆర్థికపరమైన సయోధ్య ఉంటే తప్ప కుటుంబ ఆర్థిక ప్రణాళిక సజావుగా నడవదు. కుటుంబం హాయిగా, ఆనందంగా, ప్రశాంతంగా ఉండాలంటే ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి.అందుకే కొన్ని ఆర్థిక విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని గురించి కొన్ని చిట్కాలు...

భార్యభర్తలు ఇద్దరూ ఎలాంటి ఖర్చులు పెట్టినా వాటిని ఇద్దరూ చెప్పుకోవాలి. డబ్బు విషయంలో ఇద్దరి మధ్య దాపరికాలు ఉండకూడదు. ఒకరికి అవసరం అనిపించింది ఇంకొకరికి వృథా అనిపించొచ్చు. ఇలాంటి విషయాల్లో ఇద్దరూ వాదులాడుకోవడం కన్నా ఆ వస్తువు కొనడం వల్ల అవసరం ఏమిటో చర్చించుకోవాలి.

చాలా ఇళ్ళల్లో నెల మొదలు చేతిలో డబ్బులున్నాయి కదాని అవసరమున్నా లేకున్నా అనుకున్నవన్నీ కొనేస్తాం. కాని నెల చివరికి వచ్చే సరికి చేతిలో డబ్బు లుండవు. కాని నెల మొదలు గురించే కాక నెల చివరి గురించి కూడా ప్రణాళికలో చేర్చాలి. అప్పుడే నెలంతా అవసరానికి తగ్గట్లు చేతిలో డబ్బులుంటాయి.

ఇప్పుడు జీతాలన్నీ బ్యాంకు అకౌంట్‌లోనే పడుతున్నాయి అందరికీ. కాబట్టి నెల మొదట్లో మనం వేసుకునే ప్రణాళిక ఆధారంగా ఎంత అవసరమో అంతే మొత్తాన్ని డ్రా చేయాలి. అలాకాక, మొత్తం డబ్బులు డ్రా చేసి ఖర్చు పెట్టేస్తే చివరికి చేతిలో డబ్బులు లేని పరిస్థితులు వస్తాయి.

అంతేకాదు, బీమా పాలసీలు, లోన్‌లు లాంటివి ఉన్నప్పుడు వాటి గడుపుకు ముందే చెల్లించేలా ప్రణాళికలు వేసుకోవాలి. సమయం పెరిగే కొద్ది వాటిపై అదనపు వడ్డీ పడుతుంది. అది మన అవసరాలపై ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి ఇలాంటి ఖర్చులకు నెల మొదట్లోనే బ్యాంకులో వేయడమో లేక కట్టడమో చేయాలి. లేదా చెక్కుల ద్వారా చెల్లించేవయితే ప్రతినెల ఐదో తేదీ లోపునే ముగించుకోవాలి.

భర్త తరపు వాళ్ళకు గానీ, భార్య వాళ్ళకు గానీ మీరు ఏం ఇచ్చినా పరస్పరం చెప్పుకోవాలి. అవసరాన్ని గుర్తించి సహాయం చేయాల్సి వచ్చినప్పుడు ఇద్దరూ సహకరించుకోవాలి.

ఒకరికి తెలియకుండా ఒకరు అప్పులు చేయకూడదు, ఇవ్వకూడదు.



అనుకోకుండా కొన్ని ఖర్చులు వచ్చిపడుతుంటాయి. అవి ఆరోగ్యానికి సంబంధించినవి అవ్వొచ్చు మరొకటయినా సరే... వాటి కోసం ముందునుంచే ప్లాన్డ్‌గా వ్యవహరించాలి. ఇలాంటి ఖర్చుల కోసం నెలవారీ ప్రణాళికలో కొంత మొత్తాన్ని తీసి ఉంచాలి.

ఖర్చుల వ్యవహారాలు, డబ్బుల వివరాలన్నీ పారదర్శకంగా ఉండాలి. అంతేకాదు, ఆర్థిక విషయాల గురించి నువ్వు ఇలా ఖర్చు చేస్తున్నావ్ అంటే నువ్విలా అని ఒకరిపై ఒకరు చిటపటలాడకుండా ఇద్దరూ పారదర్శకంగా వ్యవహరించినప్పుడే కుటుంబం సాఫీగా సాగుతుంది. అంతేకాదు, పిల్లలకు ఆర్థిక అవగాహన కల్పించాలి. పిల్లలకు కూడా ఇంట్లో ఖర్చులు, డబ్బుల విలువ తెలిసినప్పుడే వారి ఖర్చులను కూడా నియంత్రించుకోగలుగుతారు. అప్పుడే అనుకున్న ప్రణాళికలను చేరుకోగలుగుతారు.

వంటింటి చిట్కాలు

- మినపప్పు త్వరగా నానాలంటే ఆ నీళ్లలో ఇనుప వస్తువు ఏదైనా వెయ్యాలి.
- బ్రెడ్ పేకెట్‌లో బంగాళదుంప ముక్కలు ఉంచితే త్వరగా పాడవదు.
- నూనె పొంగకుండా ఉండాలంటే అందులో కొంచెం చింతపండు వెయ్యాలి.
- చేతులకు నూనెరాసి పనసకాయ తరిగితే జిగురు అంటకుండా ఉంటుంది.
- వడియాల పిండిలో కొంచెం నిమ్మరసం వేస్తే తెల్లగా వస్తాయి.
- గుడ్లు ఉడకబెట్టేటపుడు కొంచెం ఉప్పు వేసి ఉడకనిస్తే పెంకులు త్వరగా ఊడిపోతాయి.
- పకోడిలు వేసేటపుడు పిండిలో కొంచెం సోడా కలిపితే లావుగా అవుతాయి.



అతడు-ఆమె

జరిగిన కథ

ఈవాళకి కలం ముట్టుకుని యే నాలుగు నెలలైందో! ఏమి జబ్బులు బాబూ! బతికి బయట పడతాం అనుకోలేదు. తల్చుకుంటే, మళ్ళా ఆ సావిత్రీ సత్యవంతుడూ- యముడూ, రవివర్మ చిత్రించిన బొమ్మే కళ్ళకి కట్టినట్టుంది. ఆనా జబ్బు లోనూ-శాస్త్రి జబ్బులోనూ, ఆబొమ్మ- అచ్చంగా ఆ బొమ్మే యెన్నిసార్లు నా కళ్ళముందర వచ్చిందో గదా? ఇప్పటికి - నిజంగా ఆ యముడు అలా బాణం పట్టుకుని నా యెదుట నిలబడితే ఫో- యిక్కడ నుంచి ఫో-అని నేను నిజంగా అన్నా నేమోకూడా!...ఆవేళ హోరనివర్షం - వూరూ వాడా యిలా యేకం అయిపోతుంటే - యిప్పడా ప్రధాన మంత్రి గారింట్లో విందుకు హాజరు కాకపోతే మునిగి పోయిందేమిటి? అని నేనన్నా విన్నాడుకదు.

(నిన్నటి సంచిక తరువాయి)

ఆడయారునుంచి వచ్చేటప్పుడు కారు అల్లరి పెట్టిం దట. తడిసి ముద్దయి ఇంటికొచ్చాడు. దాంతో న్యూమోని యాలోకి దింపేసింది. పదిహేనురోజులు నాకు నిద్రాహారం లేదు. ఒక రోజు మరీ భయం వేసింది. డాక్టరు మూర్తిగారి ధర్మమా అంటూ నెల్లాళ్ళలో శాస్త్రి తేరుకుని మళ్ళీ కచేరికీ వెళ్ళడం మొదలెట్టాడు.

సరి - నాలుగురోజులైంది కాంసు - నా వంతు! ప్రొద్దున్న ఎనిమిది గంటలైంది. "కాంగ్రెసు పెద్దలెవరో నిన్ను టెలిఫోనులో పిలుస్తున్నారు శాంతం!" అని శాస్త్రి కేకేశాడు. సావడిలోనుంచి గుమ్మం దాటుతున్నాను - కాలు జారింది - పడిపోయాను. అసలే బరువుగా వున్నాను - దాంతో నానా చికాకు అయిపోయింది. నెల్లాళ్ళు మళ్ళీ ఆసుపత్రిలో వెనకటి పాపాయి పురిటి ఆస్పత్రి రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. బాధ హెచ్చుగా వున్నా - మనసులో ఆనందం. ఆవేశం వుండేవి అప్పుడు. ఇప్పుడు ఏమిటో అంతా బెంగే. ఆస్పత్రిలో అంతా పరిశుభ్రం - బయట అంతా కుళ్ళు - ఏమిటిది అనిపించేది.

ఈ పుట్టుకలు - యీ చావులు - యీ అహంకారాలు - యీ డాబులు దర్పాలు - ఏమిటీ నాటకం అనిపిస్తుంది. మళ్ళీ రెండో క్షణంలోనే - శాస్త్రీ పాపం ఒక్కడూ ఇంట్లో ఎలా గున్నాడో - వంట బ్రాహ్మణుడు సరిగా వేళకి భోజనం, ఫలహారం చేసి పెడుతున్నాడో - లేదో, పాపాయి ఎలా వుందో - తొమ్మిది గంటలూ కొట్టేసరికి అన్నం పెట్టకపోతే వుండలేదు - ముందు వామూ యింత ఆవునేతిపిసరు కలిపి పెడుతూందో లేదో సుభ - అని యివే జ్ఞాపకం వచ్చి - కడుపులో వేధించుకు పోతూంది.

శాస్త్రి రెండుపూటలూ వస్తాడు నన్ను చూడడానికి. పాపాయిని తీసుకుని పొద్దున్న సుభ, సాయంత్రం తాయారూ వస్తారు. నా జబ్బుకి శాస్త్రి చాలా చిన్నబోయాడు. కొడుకు పుట్టాలి కొడుకు పుట్టాలి అని యింత పలవరిం చాడో - అంత ఆశాభంగం అయింది అతనికి - పాపం. నూరుసార్లేనా అని వుంటాడు. నాతో వల్లభ జోశ్యులవారి వంశం మరి వుండదేమో - అంటూ. నాకేం అలా అనిపించడం లేదు - సరేకదా - వల్లభజోశ్యులవారి వంశం అంతరించితే - పుట్టి మునిగిపోయిందేముంది? - అనబోయాను కూడాను....

నలుగురు పిల్లలు చుట్టూ వుండాలి - మనవల్ని మనవరాళ్ళని యెత్తుకోవాలి - కోడళ్ళూ, అల్లుళ్ళు ఇంటికి వస్తూండాలి. వెళుతూండాలి - అని నాకు యేమాత్రం అనిపించదు. మరి నేను అందరి ఆడవాళ్ళలాంటిదాన్నా - లేకపోతే ప్రత్యేక వ్యక్తినా? ఈ ప్రమాదం ఎందుకు రావాలీ - అని అట్టే ఆలోచిస్తున్నాను - పదిరోజులై. "నీ జీవిత మంతా మార్చుకో - నీ స్వభావంలో చురుకుపాలు హెచ్చు - చైతన్యం కోరే వ్యక్తిత్వం నీది" - అని నాతో ఎవరో చెపుతూన్నట్టు అనిపిస్తూంది. ఆశయమా?



ఈ మధ్య మూడు నాలుగుసార్లు ఆస్పత్రిలో నన్ను చూడడానికి వచ్చింది - ఊర్వశీ మిత్ర. మొన్న సాయం కాలం - ఊర్వశీ వచ్చింది. ఆవిడ వెంటనే శాస్త్రీ వచ్చాడు. ఇద్దరూ కలిసే వచ్చారా అనిపించింది. ఊర్వశీ నేనూ కాలేజీలో కలిసి చదువుకున్నా, ఊర్వశి అంటే నాకు మొదలు దగ్గిరనుంచి ఏమిటో కిట్టేది కాదు. అప్పటి రోజుల్లోనే మొగాళ్ళ వెంట పడుతూండేది అని అనేవారు. ఇప్పుడు పూర్తిగా బాహాటం అయిపోయింది. తండ్రి కలకత్తా నుంచి వచ్చేసి చెన్నపట్నంలో ఏదో ఉద్యోగం చేసి



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

చచ్చిపోయాడు. డబ్బున్న వాళ్ళా కాదు - పెద్ద కుటుంబం. ఊర్వశి బి.ఏ. అయ్యాక ఉద్యోగమూ చెయ్యలేదు - మరేలాగు గడుపుకొస్తూందో! మళ్ళీ రోజుకో చీరె - మోటారు కారూ - రాయపేటల్లో ఇల్లు - అన్ని విందులకీ - వివాహాలకీ - గార్డెను పార్టీలకీ అన్ని ఫోటోలలోనూ హాజరు! మళ్ళీ చూస్తే అందమూ లేదు. శాస్త్రీ, ఊర్వశీ కలిసి నిలబడితే - నాకు అతి ఏవగింపుగా వుంది. నేను అనుమానం పడే మనిషిని కాను. కాని శాస్త్రి జాగ్రత్తగా వుండాలి. అతను వంటరిగా వుండలేడు. అయినా నేనేం అనకూడదు.

ఈ ఆస్పత్రి నెలరోజుల్లోనూ భారతం విరాటపర్వం చదివేను. పద్యాలు బోధపడతాయో బోధపడవో అని భయం వేసింది - కాని ఉగ్గుపాలతో అలవడిన భాష అర్థంకాకపోవడం ఏమిటీ అని ప్రయత్నించి చదివేను. దేవుళ్ళని దేవతలని పులుపు ఖారం తినే మనలాంటి మనుష్యుల్లాగే చిత్రించిపారేశారు. అంచేతనే ఎంత పురాతన గ్రంథం అయినా, ఆధునికంగా మనం ఎంత ఈ కాలపువాళ్ళం అయినా, అంత సరదాగా చదివి ఆనందించ గలుగుతున్నాం.....

ఒక్కటి ఆశ్చర్యం వేస్తూంది నాకు - పదిహేనేళ్ళాయి గాంధీగారి నాయకత్వాన జాతీయోద్యమం నడుస్తోందిగదా! దేశంలో -అటువంటిది- మన ఆంధ్ర సారస్వతంలో కాని, ఒక్క బొమ్మ కాని వ్రాయలేకపోయాం - కళాసృష్టిలో ఇంత అధోగతిలో వున్నామే ఆంధ్రులం-కాని, గొప్పలు చెప్పుకుంటామే? మన కీర్తి నిలబెట్టడానికని - "మాలపల్లి" ఒక్కటుంది - వేలు నొక్కి చెప్పడానికి ..... అది తప్పితే - సున్న.

తాజా : ఇంటికొచ్చి పదిరోజులైంది. ఇంటి కొచ్చానన్న ఆనందంలో దినచర్య వ్రాయడమే మర్చి పోయాను. తాయారు - సుభ - పాపాయి - శాస్త్రి. శాస్త్రి అంటే నాకు అమిత ప్రేమ - అతనిలో ఎన్ని లోపాలు వున్నా - అతనంటే ప్రేమే - పదేళ్ళు సంసారం చేసిం తరువాత కూడా పెనిమిటిమీద నాకు ప్రేమ పోలేదు అని అనగల గడం గొప్పమాటే అనుకుంటాను... భార్యాభర్తలు అందరూ అలాగే అనుకుంటారనుకుంటాను, ఎవరిమటుకు వాళ్ళు!

68 అతడు

శాంతం మళ్ళీ ఇంటికొచ్చే నలుగురిలోనూ తిరుగు తుందుకోలేదు - ఆ వేళ అంబులెన్సులో ఆసుపత్రికి పంపించేటప్పుడు. శాంతం ఇంటికొచ్చి పదిరోజులైంది - ఇప్పుడు నాకు కాస్త మనసు కుదుట పడింది - యీ రెండు మూడు నెలలూ కీలుబొమ్మలాగు వేళపట్టున పనులు చేసుకుంటూ గడిపేను. కాని-ఏం మనసుకుదుటబడడం? నా పదిరోజులు సుస్తీకేమిటి? శాంతం జబ్బు చేయడం - నేను కన్న కలలు, కట్టిన గాలి మేడలు - అన్నీ ఎగిరి పోయాయి. నాసుస్తీ, శాంతం జబ్బు-బోలెడు ఖర్చు అయి పోయింది. మళ్ళీ అదంతా కూడదియ్యాలంటే ఎన్నాళ్ళ పడుతుందో? నాకు ఉపచారం చెయ్యటం - తను మంచం పట్టడం - నేను తనను ఆస్పత్రిలో చూడటానికి వెళ్ళి - బాచిగాడో - డబ్బో - అని సణుగుతూంటే, తనకి ఎంత చికాకు - ఎంత బాధగా వుండెనో కదా!

ఎంత మర్చిపోదాం అనుకున్నా మర్చిపోలేకుండా వున్నా. బాచిగాడు-బాచిగాడని ఎన్నో ఆశలు పెట్టుకున్నా! ఎంతో ఉబలాటపడ్డా. అన్నీ సున్నా అయిపోయాయి - అన్నీ అడుగంటిపోయాయి. మొదటి మాటే ఆశపడ్డాను. ఆడపిల్లని మంత్రసాని చెప్పగానే - సరే, మనచేతిలో యేంలేదుకదా - అని సమాధానపడ్డాను. సరి - పాపాయి, దాని సంరక్షణ. దాన్ని సింగారించడం - దాంతో రెండేళ్ళు మూడేళ్ళు గడిచిపోయాయి. తరువాత కాంగ్రెసు - సత్యాగ్రహం - లాఠీచార్జీ - హరిజన సేవ - వీట్లలోపడి నాలుగేళ్ళు నా మాటే మర్చిపోయింది, సరి. అన్నీ బాగున్నా యనుకునేసరికి - ఈమాటు ఇలా దగా అయిపోయింది.

కొడుకే పుట్టాలి - కుటుంబం నిలబెట్టాలి - వంశం చిరస్థాయిగా వుండాలి - అనుకోవడం ప్రత్యేకం పురుషుడి నైజం అనుకుంటాను. దేవుడేదిస్తే - కాయ అయితే కాయ - పండైతే పండు - దాన్నే కళ్ళకద్దుకుని - తృప్తిపడడం స్త్రీ స్వభావం. నూరు సంవత్సరాలు - వెయ్యి సంవత్సరాలు - అయనాలు, యుగాలు - అనంతకాలం - ఇలా చరిత్రాత్మకంగా ఆలోచించడం స్త్రీ నైజంకి విరుద్ధం. అంచేతే మనవాళ్ళు - బాలాత్రిపురసుందరిని శక్తిగా పూజించినా, - బ్రహ్మనే సృష్టికర్తగా చేశారు. ఆర్యులు సింధునదీతీరాన్ని ఏ కొద్ది శతాబ్దాలపాటో సమిష్టిగా జీవించినా - ఆర్యావర్తంలో స్థిరనివాసం ఏర్పరచుకోగానే - సంఘజీవనంలోనూ, కుటుంబజీవనంలోనూ - పురుషునికీ ప్రాముఖ్యత ఇచ్చి - సమాజాలు - రాజ్యాలు - ధర్మాలు - ఏర్పరుచుకున్నారు. శాంతంతో ఈ మాట చెప్పి లాభంలేదు - ఒకమాటు నన్ను "కొరడుబారిన కాపిటలిస్టు" అంది!....

- ఇంకా వుంది.

2022 కామన్వెల్త్ క్రీడలను ఎక్కడ నిర్వహించనున్నారు ?





1. గుర్జర్లు/గుజ్జర్లు సహా 5 కులాలకు ఎంత శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ?
   1. ఒక శాతం 2. రెండు శాతం
   3. మూడు శాతం 4. నాలుగు శాతం
2. 2017 సంవత్సరానికిగాను అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?
   1. సుద్దాల అశోక్‌తేజ
   2. వంగపండు ప్రసాదరావు
   3. గద్దర్
   4. గోరేటి వెంకన్న
3. దేశంలోనే తొలి ఏసీ సబర్బన్ రైలు 2017 డిసెంబర్ 25న ఏ నగరంలో అందుబాటులోకి వచ్చింది ?
   1. బెంగళూరు 2. కోల్‌కతా
   3. ముంబయి 4. చెన్నై
4. అంతర్జాల సమానత్వం (నెట్ న్యూట్రాలిటీ) నిబంధనలకు నీళ్లు వదిలేయాలని ఏ దేశ టెలికాం నియంత్రణ విభాగం నిర్ణయించింది ?
   1. బ్రిటన్ 2. అమెరికా
   3. ఫ్రాన్స్ 4. జర్మనీ
5. అభివృద్ధికి దూరంగా ఉన్న ఈశాన్య భారత రాష్ట్రాలలో ప్రాంతీయ, జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ, అనుసంధానం కోసం వచ్చే రెండు మూడేళ్లలో ఎన్నివేల కోట్ల రూపాయలను వెచ్చించనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ వెల్లడించారు ?
   1. రూ.60 వేల కోట్లు
   2. రూ.70 వేల కోట్లు
   3. రూ.80 వేల కోట్లు
   4. రూ.90 వేల కోట్లు
6. కనుచూపుమేరలో ఉన్న భూమిని దాటుకుని వెళ్లొచ్చని, ఆకాశంలోనూ నడవచ్చని ప్రపంచానికి తొలిసారి చాటి చెప్పిన అంతరిక్ష యోధుడు 2017 డిసెంబర్ 21న మరణించాడు. ఆయన పేరు ఏమిటి ?
   1. వ్లాదిమిర్ కొమరోవ్
   2. మైకేల్ పి. ఆండర్సన్
   3. జార్జి దొబ్రొవొల్‌స్కీ
   4. బ్రూస్ మెక్ కాండ్లెస్
7. బీడబ్ల్యూ బిజినెస్ వరల్డ్ ఐదవ స్మార్ట్‌సిటీస్ కాన్‌క్లేవ్ అవార్డుల కార్యక్రమంలో 'అర్బన్ లీడర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును అందుకున్నది ఎవరు ?
   1. నారా లోకేశ్
   2. కె.తారక రామారావు
   3. ఎం.ఆర్.సీతారాం
   4. ఎం.మణికందన్
8. భారత్‌లో అత్యధికంగా ఆర్జించిన వినోదరంగ ప్రముఖుల జాబితాలో వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానంలో నిలిచింది ఎవరు ?
   1. షారుఖ్ ఖాన్ 2. సల్మాన్ ఖాన్
   3. అమీర్‌ఖాన్ 4. అమితాబ్ బచ్చన్
9. ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్-2017లో పురుషుల విభాగంలో టైటిల్‌ను గెలుచుకున్నది ఎవరు ?
   1. సెర్గీ కర్జాకిన్
   2. మాగ్నస్ కార్ల్‌సన్
   3. విశ్వనాథన్ ఆనంద్
   4. వ్లాదిమిర్ క్రామ్నిక్
10. దివ్యాంగులకు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సాయం ద్వారా నడిచే ఉన్నత విద్యాసంస్థల ప్రవేశాల్లో ఎంత శాతానికి తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది ?
   1. 5 శాతం 2. 6 శాతం
   3. 7 శాతం 4. 8 శాతం
11. నాలుగున్నర దశాబ్దాల పాటు (1972 నుంచి) దేశానికి సేవలందించిన ఏ హెలికాప్టర్‌కు బెంగళూరు యలహంకలోని ఎయిర్‌బేస్‌ల నిర్వహించిన కార్యక్రమంలో ఎయిర్ మార్షల్ ఎస్.ఆర్.కె.నాయర్, ఇతర వైమానిక దళ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు ?
   1. ఎంఐ-6 ప్రతాప్ 2. ఎంఐ-7 ప్రతాప్
   3. ఎంఐ-8 ప్రతాప్ 4. ఎంఐ-9 ప్రతాప్
12. జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో కొత్త ఛాంపియన్‌గా అవతరించింది ఎవరు ?
   1. రవికుమార్ 2. దినేశ్‌కుమార్
   3. మనీశ్‌యాదవ్ 4. మనీశ్‌కుమార్
13. ప్రముఖ రచయిత దేవీప్రియ రాసిన ఏ కవిగా సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైంది ?
   1. విరామమెరుగని పయనం
   2. వాళ్లిద్దరూ అంతేనా?
   3. గాలి రంగు
   4. పూర్ణిమ
14. గుజరాత్ నూతన ముఖ్యమంత్రిగా 2017 డిసెంబర్ 26న ప్రమాణస్వీకారం చేసింది ఎవరు ?
   1. భారత్‌సిన్హ్ మాధవ్‌సిన్హ్ సోలంకి
   2. జిగ్నేష్ మెవాని
   3. డాక్టర్ ఆశాపటేల్
   4. విజయ్ రూపానీ
15. భారత ఆర్థిక సంఘం (ఐఈఏ) 100వ వార్షిక సదస్సు 2017 డిసెంబర్ 27 నుంచి 30 వరకు ఎక్కడ జరిగింది ?
   1. విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్)
   2. మంగళూరు (కర్ణాటక)
   3. కన్యాకుమారి (తమిళనాడు)
   4. కోచి (కేరళ)



16. బొగ్గు కుంభకోణానికి సంబంధించి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా, బొగ్గు శాఖ మాజీ కార్యదర్శి హెచ్.సి.గుప్తాలకు ఎన్నేళ్ల జైలుశిక్షను విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది ?
   1. రెండేళ్లు 2. మూడేళ్లు
   3. నాలుగేళ్లు 4. ఐదేళ్లు
17. టర్కీ ఓపెన్ అంతర్జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అండర్-10 బాలికల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచింది ఎవరు ?
   1. జె.కె.మాళవిక 2. జక్కా వైష్ణవిరెడ్డి
   3. దిశా జైన్ 4. టినూ దహియా
18. బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
   1. పి.వి.సింధు (భారత్)
   2. అకానె యమగుచి (జపాన్)
   3. సయక సటో (జపాన్)
   4. హె బింగ్‌జియావో (చైనా)
19. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ?
   1. ప్రొఫెసర్ వై.సి.మోడీ
   2. ప్రొఫెసర్ ప్రదీప్‌సింగ్ ఖరోలా
   3. ప్రొఫెసర్ ఉపేంద్రప్రసాద్ సింగ్
   4. ప్రొఫెసర్ ధీరేంద్రపాల్ సింగ్
20. మెక్‌లాయిడ్ రస్సెల్ టూర్ - 2017 ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
   1. హెన్రిక్ స్టెన్‌సన్ (స్వీడన్)
   2. శుభాంకర్ శర్మ (భారత్)
   3. జోర్డాన్ స్పీత్ (అమెరికా)
   4. కామిలో విల్లేగాస్ (కొలంబియా)
21. హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2017 డిసెంబర్ 27న ప్రమాణస్వీకారం చేసింది ఎవరు ?
   1. జైరాం ఠాకూర్
   2. వీరభద్రసింగ్
   3. రీటా దేవీ
   4. కమ్‌లేశ్ కుమారి
22. దేశంలో తొలి రైల్వే యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ యూనివర్సిటీ (ఎన్ఆర్‌టీయూ) పేరిట దీనిని ఎక్కడ నెలకొల్పాలని ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు ?
   1. చిక్‌మగ్‌ళూర్ (కర్ణాటక)
   2. అమరావతి (ఆంధ్రప్రదేశ్)
   3. లక్నో (ఉత్తరప్రదేశ్)
   4. వడోదర (గుజరాత్)
23. తిమోర్ లెస్తే ద్వీపానికి ఉత్తరాన కేవలం 81 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న కిసర్ అనే కొత్త ద్వీపాన్ని ఆస్ట్రేలియా జాతీయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త తాజాగా కనుగొన్నారు. ఇది ఏ దేశంలో ఉంది ?
   1. ఇండోనేషియా 2. ఆస్ట్రేలియా
   3. జపాన్ 4. క్యూబా
24. ప్రపంచవ్యాప్తంగా విదేశాల్లో ఎక్కువగా ఉంటున్నవారి జాబితాలో ఏ దేశీయులు మొదటిస్థానంలో ఉన్నారని ఐరాస విడుదల చేసిన 'అంతర్జాతీయ వలస నివేదిక' ఒకటి పేర్కొంది?
   1. చైనీయులు 2. అమెరికన్లు
   3. భారతీయులు 4. నైజీరియన్లు
25. ప్రసిద్ధ అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శిగా ఎవరు ఎంపికయ్యారు ?
   1. పియర్రె సానె
   2. కుమీ నాయుడు
   3. ఇయాన్ మార్టిన్ 4. ఇరెనె ఖాన్
26. భారత ఆటగాడు రోహిత్‌శర్మ టీ 20ల్లో అత్యంత వేగవంతమైన (35 బంతులు) శతకాన్ని బాదడం ద్వారా ఎవరి పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు ?
   1. డేవిడ్ మిల్లర్ (దక్షిణాఫ్రికా)
   2. రిచర్డ్ లెవి (దక్షిణాఫ్రికా)
   3. క్రెయిగ్ విలియమ్స్ (నమీబియా)
   4. షాహిద్ అఫ్రిది (పాకిస్థాన్)
27. ప్రతిష్ఠాత్మక 'ఐఎంఏ డాక్టర్ ఎంజీ గార్గ్ జీవితకాల సాఫల్య పురస్కారం' ఎవరికి లభించింది ?
   1. ప్రణీత సారంగి
   2. ఆచార్య కె.శివారెడ్డి
   3. డాక్టర్ పి.శ్యామరాజు
   4. డాక్టర్ నాగేశ్వరరెడ్డి
28. ప్రఖ్యాత మీడియా సంస్థ బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) ఏటా అందించే క్రీడా పురస్కారాల్లో ఈసారి 'విదేశీ అత్యుత్తమ క్రీడాకారుడు' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?
   1. రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)
   2. రఫెల్ నాదల్ (స్పెయిన్)
   3. ఆండీ ముర్రే (బ్రిటన్)
   4. నొవాక్ జకోవిచ్ (సెర్బియా)
29. టీ-20 క్రికెట్‌లో 400 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కింది ఎవరు ?
   1. డ్వేన్ స్మిత్ (వెస్టిండీస్)
   2. డారెన్ సామీ (వెస్టిండీస్)
   2. రవి రాంపాల్ (వెస్టిండీస్)
   4. డ్వేన్ బ్రావో (వెస్టిండీస్)
30. భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఎన్నవ స్థానంతో ఈ ఏడాది (2017)ను ముగించింది ?
   1. 102వ స్థానం 2. 104 వ స్థానం
   3. 105వ స్థానం 4. 110వ స్థానం
31. చిలీ నూతన అధ్యక్షునిగా ఎవరు ఎన్నికయ్యారు ?
   1. కరొలినా గోయిక్
   2. సెబాస్టియన్ పినెర
   3. బీట్రిజ్ శాంచెజ్
   4. అలెజాండ్రో గుయిల్లర్
32. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యునెస్కో సంయుక్త భాగస్వామ్యంతో టెక్ సదస్సు- 2017ను ఎక్కడ నిర్వహించారు ?
   1. తిరుపతి 2. విజయవాడ
   3. విశాఖపట్నం 4. కర్నూలు
33. 2022 కామన్వెల్త్ క్రీడలు ఎక్కడ నిర్వహించనున్నారు ?
   1. బర్మింగ్‌హామ్ (ఇంగ్లాండ్)
   2. బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా)
   3. విక్టోరియా (కెనడా)
   4. ఆక్లాండ్ (న్యూజీలాండ్)
34. ప్రపంచంలో అతిపెద్ద ఉభయచర విమానం 2017 డిసెంబర్ 24న తొలిసారిగా గాలిలోకి ఎగిరింది. స్వదేశీ పరిజ్ఞానంతో చైనా అభివృద్ధి చేసిన ఈ విమానం పేరేమిటి ?
   1. కున్లంగ్ (ఎజీ600)
   2. కున్లంగ్ (ఎజీ800)
   3. కున్లంగ్ (సీజీ600)
   4. కున్లంగ్ (సీజీ800)
35. శాస్త్ర సాంకేతిక శాఖలోని బయోటెక్నాలజీ విభాగం అందజేసే.. ప్రఖ్యాత 'ఇన్నోవేటివ్ యంగ్ బయోటెక్నాలజిస్ట్' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?
   1. డాక్టర్ సంజయ్‌రెడ్డి
   2. ప్రణీత సారంగి
   3. ప్రొఫెసర్ చంద్రశేఖర శర్మ
   4. ఎం.పి.అహ్మద్
36. అండర్-23 కల్నల్ సీకే నాయుడు ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకుంది ?
   1. రాజస్థాన్
   2. తమిళనాడు
   3. ఢిల్లీ
   4. కర్ణాటక
37. ఢాకాలో జరిగిన శాఫ్ అండర్-15 మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
   1. భారత్
   2. శ్రీలంక
   3. బంగ్లాదేశ్
   4. పాకిస్థాన్
38. పిన్నమనేని సీతాదేవి అవార్డు - 2017కు ఎవరు ఎంపికయ్యారు ?
   1. డాక్టర్ ఎల్.లోంగోవా
   2. నోరి దత్తాత్రేయుడు
   3. కె.శివారెడ్డి
   4. టెస్సీ థామస్

సమాధానాలు

1. 1	2. 4	3. 3	4. 2
5. 4	6. 4	7. 2	8. 2
9. 3	10. 1	11. 3	12. 1
13. 3	14. 4	15. 1	16. 2
17. 2	18. 2	19. 4	20. 2
21. 1	22. 4	23. 1	24. 3
25. 2	26. 1	27. 4	28. 1
29. 4	30. 3	31. 2	32. 3
33. 1	34. 1	35. 2	36. 3
37. 3	38. 4		

స్కాలర్‌షిప్స్

యూజీసీ పీజీ ఉపకారవేతనాలు

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. యూనివర్సిటీ స్థాయిలో అండర్ గ్రాడ్యుయేషన్‌లో ర్యాంకు పొంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరిన అభ్యర్థులకు అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తులు కోరుతోంది.

స్కాలర్‌షిప్ :పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ ఫర్ యూనివర్సిటీ ర్యాంకు హోల్డర్స్.
స్కాలర్‌షిప్ వ్యవధి : రెండేళ్లు.
ఫెలోషిప్ : నెలకు రూ.3,100 (ఏడాదిలో 10 నెలలు మాత్రమే).
అర్హతలు : అండర్ గ్రాడ్యుయేషన్(లైఫ్ సైన్సెస్/ ఫిజికల్ సైన్సెస్/ కెమికల్ సైన్సెస్/ఎర్త్ సైన్సెస్/మ్యాథమెటికల్ సైన్సెస్/సోషల్ సైన్సెస్/కామర్స్/ లాంగ్వేజెస్)లో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశం పొంది ఉండాలి.
వయసు : పీజీలో ప్రవేశం పొందేనాటికి 30 ఏళ్ల లోపు ఉండాలి.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.
వెబ్‌సైట్ : www.scholarships.gov.in, www.ugc.ac.in

జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో 40 ఫెలోషిప్స్

కోల్‌కతాలోని జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ).. 40 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఈ సంస్థ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖకు చెందింది.

పోస్టు- ఖాళీలు : జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)- 20 పోస్ట్ డాక్టోరల్ ఫెలో (పీడీఎఫ్)- 20.
స్టైపెండ్ : జేఆర్ఎఫ్- రూ. 12,000+ హెచ్ఆర్ఏటీ పీడీఎఫ్- రూ. 36,000+ హెచ్ఆర్ఏ.
అర్హతలు : జేఆర్ఎఫ్‌కు జువాలజీ ప్రధాన సబ్జెక్టుగా కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీతోపాటు జువాలజీ/ లైఫ్ సైన్సెస్/ బయలాజికల్ సైన్సెస్‌లో మాస్టర్ డిగ్రీ/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత; పీడీఎఫ్‌కు జువాలజీ/లైఫ్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ/ తత్సమాన విద్యతో పాటు ఎంఎస్సీ+ పరిశోధన/ బోధనలో అనుభవం+ జర్నల్స్ ప్రచురణ.
వయసు : 2018, జనవరి 1 నాటికి జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు; పీడీఎఫ్‌కు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : మెరిట్ జాబితా, ఇంటర్వ్యూ.
దరఖాస్తు రుసుం: జనరల్- రూ.400; ఓబీసీ-రూ.200; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ- రూ.100.**దరఖాస్తు విధానం** : ఆఫ్‌లైన్.
దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 1, 2018.
వెబ్‌సైట్: www.zsi.gov.in

ఎన్‌సీఆర్ఐలో డాక్టోరల్ ఫెలోషిప్స్

హైదరాబాద్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్‌సీఆర్ఐ).. రూరల్ స్టడీస్‌లో పరిశోధనలు చేసే అభ్యర్థుల నుంచి 2018-19కి గాను డాక్టోరల్ ఫెలోషిప్స్‌కు దరఖాస్తులు కోరుతోంది.

కాల వ్యవధి : మూడేళ్లు.
ఫెలోషిప్ : రూ.16,000. అలాగే కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15,000 అదనంగా ఇస్తారు.
పరిశోధన విభాగాలు : రూరల్ కమ్యూనికేషన్, రూరల్ మేనేజ్‌మెంట్, రూరల్ సోషల్ వర్క్, రూరల్ సోషియాలజీ, రూరల్ టూరిజం, రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రూరల్ ఎడ్యుకేషన్ తదితర రూరల్ స్టడీస్ అంశాలు.
అర్హతలు : సంబంధిత విభాగాల్లో పరిశోధనలకు ఏదైనా విద్యాసంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. అలాగే సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో పీజీ/ తత్సమాన విద్య, నెట్/ స్లెట్/ ఎంఫిల్.
వయసు : దరఖాస్తు సమర్పణ గడువు నాటికి 40 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ ఓబీసీ/మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు సడలింపు ఉంటుంది.
దరఖాస్తు విధానం : వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'మెంబర్ సెక్రెటరీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్‌సీఆర్ఐ), సాకార్ భవన్, ఫతేమైదాన్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్- 500004' చిరునామాకు గడువులోగా పంపాలి. లేదా fellowship.ncri@gmail.com మెయిల్ ఐడీకి మెయిల్ చేయాలి.
దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ : జనవరి 25, 2018.
వెబ్‌సైట్: www.ncri.in

విశాలాంధ్ర బిజినెస్

341.97 ▲	117.50 ▲	1,200 ▲	400 ▲	డాలరు Vs రూపాయి	ముడి చమురు ▲
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి		
36,139.98	11,083.70	28,800	39,900	63.81	69.03
		22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)		బ్రెంట్ ధర (డాలర్లలో..)

స్టాక్ మార్కెట్ల సంచలనం



- 36వేల పైన సెన్సెక్స్..
- 100 పాయింట్ల లాభంతో నిఫ్టీ

ముంబై: బుల్ ఉత్సాహం ఉరకలేస్తోంది.. మదుపరుల సంతోషం రెట్టింపైంది. లాభాల జడివానలో దలాల్ స్ట్రీట్ తడిసి ముద్దయ్యింది. సూచీలు చరిత్ర సృష్టిస్తున్నాయి. వరుస సంచలనాలతో సరికొత్త రికార్డులను లిఖిస్తున్నాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు అదరగొట్టాయి. మార్కెట్ చరిత్రలో తొలిసారి జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీ 11వేల మైలు రాయిని, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సెన్సెక్స్ 36వేల మైలురాయిని దాటాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలు, బ్యాంకింగ్, ఐటీ, టెలికాం తదితర రంగాల కంపెనీల షేర్లల పెట్టుబడుల మోత మోగడం.. మార్కెట్ సెంటి మెంట్‌కు కలిసొచ్చింది. దీంతో మంగళవారం ఆరంభం నుంచే సూచీలు రికార్డుల బాట పట్టాయి. ట్రేడింగ్ మొదలైన కొద్ది సేపటికే నిఫ్టీ 11వేల బెంచ్‌మార్క్‌ను దాటగా.. సెన్సెక్స్ 36వేల పైన ట్రేడ్ అయ్యింది. ఆద్యంతం లాభాల జోరు కొనసాగించిన సూచీలు చివరకు సరికొత్త రికార్డులను సాధించాయి.

మంగళవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 342 పాయింట్ల లాభంతో 36,140 వద్ద, నిఫ్టీ 1శాతం పెరిగి 117 పాయింట్లు ఎగబాకి 11,084 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 63.81గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో వేదాంతా లిమిటెడ్, గెయిల్, ఎస్‌బీఐ, హిందాల్కో, టాటాస్టీల్ షేర్లు రాణించాయి. ఒక్కో కంపెనీ షేరు విలువ సగటున 3 నుంచి 4శాతం పెరిగింది. ఇక ఐషర్ మోటార్స్, అంబుజా సిమెంట్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, విప్రో, భారతీ ఇన్‌ఫ్రాటెల్ షేర్లు నష్టపోయాయి.

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఎస్‌బీఐ	319.95	3.84
టాటా స్టీల్	786.85	3.72
ఓఎన్‌జీసీ	208.45	3.60
ఐసీఐసీఐ బ్యాంక్	364.55	3.06
కోల్ ఇండియా	293.90	3.04

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
విప్రో	322.75	-1.50
టాటా మోటార్స్	422.10	-0.83
ఏషియన్ పెయింట్స్	1,178.00	-0.75
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,1964.70	-0.64
టీసీఎస్	3,137.75	-0.42

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.87	63.81
యూరో	78.24	78.76
పౌండ్	88.83	89.02
ఆస్ట్రేలియా డాలర్	51.61	50.85
సింగపూర్ డాలర్	48.41	48.36

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,860	30,866
చెన్నై	28,860	30,866
బెంగళూరు	28,200	30,160
ముంబై	29,500	31,556
విజయవాడ	28,800	31,200

విస్తీర్ణం పెరిగింది, దిగుబడి తగ్గింది

ఆందోళనలో కంది రైతులు



విశాలాంధ్ర-అమరావతి: వర్షాభావ పరిస్థితులతో ప్రభుత్వం ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించటంతో ఈ ఏడాది రాష్ట్రంలో రైతులు కంది పంటను గతేడాదికన్నా రెట్టింపు విస్తీర్ణంలో సాగు చేశారు. అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు, చీడ పీడలు సోకటంతో రాష్ట్రంలో కంది దిగుబడులు ఆశించిన మేర లేకపోవడంతో కంది రైతులు దిగాలు పడుతున్నారు. గతేడాది కనీసం రూ.3 వేలకు కూడా కొన్న దాఖలాలు లేవు. చివరకు వచ్చిందే చాలన్నట్లుగా అమ్ముకున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కందులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ప్రకటిస్తామని ప్రభుత్వం చెప్పటంతో తొలకరి జల్లులు కురవగానే అన్నదాతలు కందిపంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అయితే వర్షాభావ పరిస్థితులు ఒకవైపు, మరోవైపు ప్రాజెక్టలలో నీరున్నా కాల్వలకు అవసరమైన మేర విడుదల చేయకపోవటంతో గింజ పోసుకునే దశలో నీరు అందకపోవటంతో దిగుబడులు తగ్గాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం 859.8 మి.మీ కురవాల్సి ఉండగా 744.7 మి.మీ మాత్రమే కురిసింది. ప్రధానంగా కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఎకరాకు సగటున 5 క్వింటాళ్ళు రావాల్సిన దిగుబడి 3 క్వింటాళ్ళు రావటం కూడా గగనంగా మారింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కందిపంట సాగు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం 65,819.44, చిత్తూరు 7,307.24, తూర్పుగోదావరి 1046.41, గుంటూరు 26,599.91, కడప 8761.11, కృష్ణా 1070.37, కర్నూలు 62,093.53, నెల్లూరు 1195.53, ప్రకాశం 87,110.04, శ్రీకాకుళం 830.32, విశాఖపట్నం 1746.47, విజయనగరం 833.76, పశ్చిమగోదావరి 23.64 మొత్తం 2,64,437.77 హెక్టార్లలో కందిపంట వేశారు. గతేడాది 1,88,485.31 హెక్టార్లలో పంట సాగు చేయగా, ఈ ఏడాది అదనంగా మరో 1,80లక్షల ఎకరాల్లో కంది పంటను రైతులు సాగు చేశారు. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.4,150లు ప్రకటించినా మార్కెట్‌లో ఆ ధర దక్కటం లేదు. దీంతో కంది రైతులకు నష్టాలు తప్పేలా లేవు. మూడేళ్ళ క్రితం క్వింటా కందులు రూ.10వేలు పలికేవి. ఆ సమయంలో ప్రభుత్వం కందులను కొనుగోలు చేసి భారీగా నిల్వలు ఉంచింది. ఆ తర్వాత కందుల ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీనికి కారణంగా ప్రభుత్వం వద్ద నిల్వలు బయటకు రావటంతో పాటు బర్మా, ఆఫ్రికా నుండి కందులు దిగుమతి అవుతుండటం కూడా ఓ కారణంగా చెప్తున్నారు. మరోవైపు ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణలలో కూడా రైతులు కందిపంట ఎక్కువగా వేయటంతో ధర తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది కూడా తమకు నష్టాలు తప్పవనికంది రైతులు ఆందోళన చెందుతున్నారు.



యాపిల్ చీ(టెన్).. ఆగిపోనుందా?

ఇంటర్నెట్‌డెస్క్: దిగ్గజ మొబైల్ తయారీ సంస్థ యాపిల్ నుంచి తొలి ఐఫోన్‌ను విడుదల చేసి 10ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది సెప్టెంబరులో 'ఐఫోన్ టీ(టెన్)' పేరుతో ప్రత్యేక స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చిందా సంస్థ. అధునాతన ఫీచర్లతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విడుదల చేసింది. అయితే ఈ ఫోన్ విక్రయాలను, ఉత్పత్తిని యాపిల్ త్వరలోనే నిలిపివేసే అవకాశాలున్నాయని తైవాన్ బిజినెస్ గ్రూప్ కేజీఐ సెక్యూరిటీస్‌కు చెందిన ప్రముఖ మొబైల్ విశ్లేషకులు మింగ్-చీ కుయో తెలిపారు. వినియోగదారుల నుంచి ఊహించినంత ఆదరణ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. 2018 జనవరి-మార్చి మధ్య 20-30 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్-జూన్ మధ్య 15-20 మిలియన్ యూనిట్ల ఐఫోన్ టెన్ ఫోన్లను విక్రయించగలమని సంస్థ అంచనా వేసిందని కుయో అన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఆ అంచనాలను యాపిల్ అందుకునే అవకాశాలు కన్పించట్లేదన్నారు. జనవరి-మార్చి మధ్య కేవలం 18 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్-జూన్ మధ్య 13 మిలియన్ యూనిట్లు మాత్రమే విక్రయించొచ్చు అని కుయో అంచనా వేశారు. ఐఫోన్ టెన్‌ను కొనసాగించాలంటే ధర తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అయితే ఒకవేళ అలా చేస్తే సంస్థ ఈ ఏడాదిలో విడుదల చేసే తక్కువ ధర గల కొత్త మోడళ్లపై ఆ ప్రభావం పడే అవకాశముందని.. కొత్త ఫోన్ల విక్రయాలు తగ్గే ప్రమాదం ఉందని కుయో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కారణాలతో 2018 జూన్ తర్వాత ఐఫోన్ టెన్ విక్రయాలను యాపిల్ నిలిపివేసే అవకాశాలున్నాయని కుయో అంచనా వేశారు.

భారత్ అంటే వ్యాపారమే

ప్రధాని మోడీ



40మంది సీఈఓలను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. ఇందులో 20మంది సీఈఓలు భారత్‌కు చెందిన వారే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా మోడీ తన ప్రసంగంలో భారత్ వృద్ధి గమనాన్ని గురించి శ్రోతలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు.

దావోస్: భారత్ అంటే వ్యాపారమేనని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. అంతర్జాతీయ వ్యాపార అవకాశాలకు భారత్‌లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చు కోవాలని కోరారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్యుఈఎఫ్) వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోడీ విచ్చేసిన సంగతి తెలిసిందే. గడచిన 20 సంవత్సరాల్లో డబ్ల్యుఈఎఫ్ సదస్సుకు భారత్ ప్రధాని హాజరు కావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా 'భారత్ అంటే వ్యాపారం' అనే విషయంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ పమావేశంలో ప్రపంచ దేశాలకు చెందిన ప్రధాని మోడీ కూడా విదేశాంగ కార్యదర్శి జైశంకం, విదేశీ వ్యవహారాల శాఖకు అనుబంధంగా ఉన్న ఆర్థిక సంబంధాల కార్యదర్శి విజయ్ గోఖలే, పారిశ్రామిక విధానం, అభివృద్ధి విభాగం కార్యదర్శి రమేష్ అభిషేక్ సహా పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

స్విట్జర్లాండ్ అధ్యక్షునితో భేటీ

అనంతరం స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలెయిన్ బెర్సెట్‌తో మోడీ బేటీ అయారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిపారు. దీనిపై అలెయిన్ స్పందిస్తూ మోడీకి ధన్యవాదాలు తెలిపారు. భారత్‌తో తమ సంబంధాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ముక్కలైన ప్రపంచాన్ని

ఎవరూ కాపాడలేరు: రాజన్



దావోస్: అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సాయం లేకుండా తాము ఎంతో కాలం ముందు కెళ్లలేమన్న విషయాన్ని పాశ్చాత్య దేశాలు గుర్తించాలని భారత రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశానికి హాజరైన రాజన్.. ఏ దేశాన్ని నేరుగా ప్రస్తావించకుండా పాశ్చాత్య విధానాలపై ప్రసంగించారు. 'పాశ్చాత్య దేశాల్లో జనాభా పెరుగుతోందన్న విషయాన్ని ఆయా దేశాలు గుర్తించాలి. అంతేగాక.. వారి ఉత్పత్తులకు అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచే డిమాండు ఎక్కువగా ఉంటుందని గమనించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల అండ లేకుండా పాశ్చాత్య దేశాలు ఎంతోకాలం మనుగడ సాధించలేవు. ఆ విషయాన్ని ఆయా దేశాలు అర్థం చేసుకోవాలి. ఆ దేశాలు సాధించే ప్రయోజనాలను కూడా అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవాలి. పాశ్చాత్య దేశాల దృక్పథం వీలైనంత త్వరగా మంచిగా మారాలి. లేదంటే ఈ ముక్కలైన ప్రపంచంలో ఏర్పడే సమస్యలను ఎవరూ పరిష్కరించలేరు' అని రాజన్ అన్నారు. ఆదాయ అసమానతల వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి సింగపూర్ లాంటి దేశాలు కొన్ని చర్యలు చేపడుతున్నాయని రాజన్ తెలిపారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కలిసి జీవించేలా హౌసింగ్ ప్రాజెక్టులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డ్రైవర్ రహిత కార్ల సాంకేతికపై కూడా రాజన్ ప్రస్తావించారు. టెక్నాలజీ పరంగా అవి మంచివే అయినప్పటికీ.. డ్రైవర్ రహిత కార్లు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తే.. కొంతమంది ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

విజ్ఞానం



ఆలివ్ ఆయిల్‌తో అద్భుతాలు

ఖాళీ కడుపుతో ఆలివ్ ఆయిల్‌ను తీసుకోవడం వల్ల కలిగే నమ్మశక్యం కాని అద్భుతమైన ప్రయోజనాలున్నాయి. ఆలివ్ ఆయిల్ అనేది మాక్రోన్యూట్రియంట్స్, కొవ్వు ఆమ్లాలు, విటమిన్లతో పూర్తిగా నిండి ఉంటుంది. అందువల్ల ఆరోగ్యానికి మంచిగా ఉపయోగపడుతుంది. కాలేయం మన శరీరంలో ఉన్న అన్ని అంతర్గత వ్యవస్థలను శుభ్రపరుస్తుంది. కానీ కొన్నిసార్లు మనము మన కాలేయమును కూడా నిర్వీర్యము పరచాల్సిన పరిస్థితి ఎదురైనప్పుడు, ఆలివ్ ఆయిల్‌ని వాడటం వల్ల ఈ పరిస్థితిని దాటవేయవచ్చు! ఉత్తమ ఫలితాలను పొందడానికి, ఆలివ్ ఆయిల్ 2 టేబుల్ స్పూన్లుగా తీసుకొని ఒక గ్లాసులో 1/3 వంతు నిమ్మకాయను కలిపి తాగండి. ఆలివ్ ఆయిల్ మంచి కొవ్వు ఆమ్లాలన్నింటికీ కలిగి ఉంటుంది, ఇది మీకు ఆరోగ్యాన్ని కలగజేసే - ఒక రకమైన మంచి కొవ్వును ఇస్తుంది. అది మీ పొట్టను సంపూర్ణంగా నింపిన అనుభూతిని కలిగిస్తుంది. వెన్నకు బదులుగా దీనిని భర్తీ చేసి వినియోగించటం చాలా ఉత్తమం. ఆలివ్ ఆయిల్లో ఉన్న కొవ్వు ఆమ్లాలు రోగనిరోధక పనితీరు యొక్క వేర్వేరు భాగాలలో ఒక గొప్ప పాత్రను పోషిస్తాయి. వాటిలో, నిరోధక వ్యవస్థ నియంత్రణ, మద్దతుతో పాటు, స్వయం ప్రతిరక్షక వ్యాధులకు చికిత్స కూడా ఉంది. ఆలివ్ ఆయిల్ రక్తంలో ఉన్న కొలెస్ట్రాల్, గ్లూకోజ్ స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుంది. మధుమేహానికి, హృదయనాళ వ్యవస్థ కోసం ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

పెట్టుబడుల ఉపసంహరణలో రికార్డు



ముంబై: ఈసారి పెట్టుబడుల ఉపసంహరణ శాఖ లక్ష్యానికిమించి రాణిస్తోంది. తొలిసారి పెట్టుబడుల ఉపసంహరణ మొత్తం ఒక ఏడాదిలో రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటేందుకు సిద్ధమైంది. ఇది ఒక రకంగా రికార్డే. ఈ నేపథ్యంలో రానున్న బడ్జెట్ అమల్లోకి వచ్చే నాటికి రూ.లక్ష కోట్లను ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద జమచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పుడు పావులు కదుపుతోంది.

అక్కరుకొచ్చిన భారీ డీల్..


తాజాగా ఓ పాక్షిక ప్రభుత్వ రంగ సంస్థలోని ప్రభుత్వ వాటాలను మరో పాక్షిక ప్రభుత్వ రంగ సంస్థ కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇంధన రంగ దిగ్గజమైన హెచ్‌పీసీఎల్‌లోని 51శాతం ప్రభుత్వ వాటాను ఓఎన్‌జీసీ కొనుగోలు చేయనుంది. ఇందుకు సంబంధించిన ఒప్పందం ఈ వారాంతంలో ఖరారు అవుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇదే జరిగితే రూ.36వేల కోట్లు ప్రభుత్వానికి అందుతాయి. ఫలితంగా ఇంకా మూడు నెలలు మిగిలి ఉండగానే గత బడ్జెట్ నిర్దేశించిన రూ.75వేలకోట్ల లక్ష్యాన్ని అలవోకగా దాటేసినట్లు అవుతుంది. హెచ్‌పీసీఎల్ ఒప్పందంతో అందే మొత్తంతో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వం వద్ద రూ.91.2వేల కోట్లు జమ అవుతాయి.

ద్రవ్యలోటు తగ్గించేందుకు..

గత బడ్జెట్‌లో అంచనా వేసిన 3.2శాతం ద్రవ్యలోటును తగ్గించేందుకు ఈ మొత్తం ఉపయోగపడుతుందని ఆర్థికశాఖ భావిస్తోంది. ఒక పక్క జీఎస్‌టీ కారణంగా పరోక్ష పన్ను వసూళ్లు తగ్గడంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఆర్థికశాఖకు ఇది పెద్ద ఉపశమనమే. పరోక్ష పన్నుల లక్ష్యమైన రూ.9.26లక్షల కోట్లను చేరుకోవాలంటే వచ్చే నాలుగు నెలల్లో మరో రూ.4.2లక్షల కోట్లను ప్రభుత్వం వసూలు చేయాల్సి ఉంది.

మరిన్ని ఉపసంహరణలు..

రూ.లక్ష కోట్ల మార్కును చేరుకోవాలంటే మరో ప్రభుత్వ రంగ సంస్థలో సుమారు రూ.9,000 కోట్ల విలువైన వాటాలను విక్రయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏదైనా భారీ ప్రభుత్వ రంగ సంస్థలో చిన్న మొత్తంలో వాటాలను విక్రయించే అవకాశం ఉంది. గత ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణతో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రభుత్వ వాటాల విక్రయం జోరుగా సాగింది. గత ఏడాది సవరించిన అంచనాలతో కలిపి రూ.56.5వేల కోట్లు విలువైన వాటాలను మాత్రమే విక్రయించారు.



గ్రామీణ భారత్‌లో మహిళ వివక్ష అధికం

ఐఎంఎఫ్ అధ్యక్షురాలు క్రిస్టీన్ లగార్డే

దావోస్: గ్రామీణ భారతంలో మహిళలు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అధ్యక్షురాలు క్రిస్టీన్ లగార్డే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వివక్ష తొలగింపుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లింగ సమానత్వం దిశగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) వార్షిక సదస్సులో భాగంగా నిర్వహించిన మహిళ ప్రతినిధుల భేటీలో ఆమె ప్రసంగించారు.

భారత ఆర్థిక వ్యవస్థలో మహిళల నిజ భాగస్వామ్యం విశాల ప్రాతిపదికన అమలు జరగాలని ఈ సందర్భంగా లగార్డే సూచించారు. కార్మికశక్తిలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశం కల్పిస్తే భారత ఆర్థిక వ్యవస్థ 27శాతం పుంజుకుంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంస్కరణలను -ప్రత్యేకించి ఆర్థిక సేవల రంగంలో సంస్కరణలు కొనసాగించాలన్నారు. 2018లో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7.4శాతంగా ఉంటుందన్న అంచనా తమకున్నట్లు ఆమె తెలిపారు.

రహదారులు ఎండమావులే

- నిర్మించకుండా నిధులు హాంపట్
- నీరుగారుతున్న ప్రధాని గ్రామ సడక్ యోజన
- నాయకుల బంధుగణాలకే కాంట్రాక్టులు
- పరిశోధనా పత్రం వెల్లడి



న్యూఢిల్లీ: మెరుగైన రహదారుల నిర్మాణంతో దేశంలోని సుమారు మూడు లక్షల గ్రామాలను అనుసంధానించాలన్న లక్ష్యంగా ప్రారంభమైన ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం దుర్వినియోగమవుతోంది. వేయని రహదారులను వేసినట్లుగా చూపడం ద్వారా ప్రభుత్వ నిధులు కొల్లగొడుతున్నారని పరిశోధన పత్రం ఒకటి పేర్కొంది. 2000లో ఈ పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు మొత్తం 88,020 గ్రామీణ రహదారుల నిర్మాణం జరిగింది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల అనుచర గణాలు సంబంధిత రహదారుల కాంట్రాక్టులను దక్కించుకుంటున్నారని తేలింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ఇంటి పేరు కలిగి ఉన్న కాంట్రాక్టర్ల సంఖ్య నాలుగు నుంచి ఏడు శాతం పెరిగింది. రాజకీయాలతో సంబంధాలున్న కాంట్రాక్టర్లే రహదారి నిర్మాణ కాంట్రాక్టులు దక్కించుకోగలుగుతున్నారు. రహదారులు వేయడం విస్మరిస్తున్నారు. ' బిల్డింగ్ కనెక్షన్స్ : పొలిటికల్ కరప్షన్ అండ్ రోడ్ కన్‌స్ట్రక్షన్ ఇన్ ఇండియా' పేరిట ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ అండ్ పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ పరిశోధకులు రూపొందించిన నివేదికను జర్నల్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ మార్చి మాస సంచికలో ప్రచురించారు. పరిశోధనలో జొనాథన్ లెహ్నే, జాకబ్ ఎన్ షపీరో, అలివర్ వాండెన్ భాగస్వాములుగా ఉన్నారు. సామాజిక అనుసంధానతలో ఇంటిపేర్లను ఎమ్మెల్యేలకు 'బదులు' (ప్రాక్సీ)గా ఉపయోగించుకున్నట్లు గుర్తించామని వారు ఆపత్రంలో ఉదహరించారు. ఈ ప్రాథమిక సమాచారం ఆధారంగా కులం, మతం, ఏ ప్రాంతం వ్యక్తులనేది గుర్తించడం జరుగుతోందన్నారు. ఎన్నికలకు ముందు, జరిగిన తరువాత ప్రతి నియోజకవర్గంలోనూ రహదారి కాంట్రాక్టులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల ఇంటిపేర్ల వివరాలను పోల్చి చూశామని లెహ్నే మీడియాకు పంపిన ఇ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికలు జరిగిన తరువాత గెలిచిన రాజకీయ నాయకుడి ఇంటి పేరు, కాంట్రాక్టరు ఇంటి పేరూ ఒకటిగా ఉన్న సంగతిని గుర్తించగలిగినట్లు తెలిపారు. రాజకీయ నాయకుల బంధుగణాలే అత్యధిక భాగం కాంట్రాక్టులు దక్కించుకోగలుగుతున్నాయన్నారు. 2001-2013 మధ్య జరిగిన ఎన్నికల సమయాల్లో నమోదైన రహదారి కాంట్రాక్టుల సమాచారాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఇంటి పేరును కలిగిన కాంట్రాక్టర్లకు మొత్తం 4,127 రహదారి ప్రాజెక్టులు దక్కినట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో సుమారు 470మిలియను డాలర్ల విలువైన సుమారు 1,600 రహదారి కాంట్రాక్టులు తమ బంధుగణానికి దక్కేందుకు ఎమ్మెల్యేలు కారకులైనారన్నారు. అయితే, 2011 గణాంకాలను పరిశీలించినపుడు పీఎంజీవై గణాంకాల్లో రహదారులు పూర్తయినట్లు, వాటికి చెల్లింపులు జరిపినట్లు ఉందన్నారు. వాస్తవానికి క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ రహదారుల నిర్మాణం జరగనే లేదన్నారు. రాజకీయ జోక్యం కారణంగా రహదారి నిర్మాణ అంచనా వ్యయాలూ పెరుగుతూ పోతున్నాయన్నారు. నాణ్యత పడిపోతోందన్నారు. రహదారులు వేయని పరిస్థితికి దారి తీస్తోందని రాజకీయ జోక్యాన్ని ఆయన తప్పుపట్టారు. కాంట్రాక్టర్ల సామర్థ్యాన్ని బట్టి కాక వారి రాజకీయ ప్రాబల్యాన్ని పరిగణనలోకి తీసుకుంటున్న అవాంఛనీయ పరిస్థితి నిధుల దుర్వినియోగానికి దోహదపడుతోందన్నారు.

యాజమాన్య పద్ధతులతో దాళ్వా వరిలో
ఆశించిన దిగుబడులు



దాళ్వా వరిపైరులో మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఆశించిన రీతిలో దిగుబడులు పొందువచ్చు. స్థానిక వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు అక్కడున్న పరిస్థితులకు అనుగుణంగా మందులను వాడాలి. ఎరువుల దుకాణదారుల మాటలు నమ్మి విచక్షణా రహితంగా ఎరువులు వాడకూడదు. సాగునేల స్వభావాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. వరిలో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తల సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి

భూసార పరీక్షల్లో సంబంధిత సాగునేలకు వచ్చిన వివరాలను అనుసరించి ఎరువులు వాడాలి. హెక్టారు వరికి 100-120 కిలోల నత్రజని, 40-60 కిలోల భాస్వరం, 60 కిలోల పొటాష్‌ను వేయవచ్చు. నత్రజని ఎరువుల యాజమాన్యంలో సిఫారసు చేసిన నత్రజని ఎరువును మూడు దఫాలుగా వేయాలి. దమ్ములో ఒక వంతు (యూరియా 40 కిలోలు), పైరు పిలక తొడిగి దుబ్బు చేసే దశలో ఉన్నపుడు రెండో వంతు (యూరియా 40 కిలోలు), అంకురం దశలో మూడోవంతు (యూరియా 25-30 కిలోలు) వేయాలి. అలా వేయడం వలన వెన్నుల సంఖ్య, గింజల సంఖ్య పెరిగి దిగుబడులు అధికమవుతాయి. భూసార పరీక్ష ఆధారంగానే సాగుభూమికి భాస్వరాన్ని తగిన మోతాదులో వాడాలి. భాస్వరం అధికంగా ఉన్న నేలలో హెక్టారుకు 40 కిలోలు దమ్ములోనే వేసుకోవాలి. తక్కువగా ఉన్న నేలల్లో 60 కిలోలు వేయవచ్చు. బరువు (నల్ల) నేలలో హెక్టారుకు 40 కిలోలు దమ్ములోనే పొటాష్ వేయాలి. తేలిక నేలల్లో 60 కిలోల వరకూ వాడవచ్చు. దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో తరువాత సగాన్ని నత్రజని ఎరువుతో కలిపి వేయాలి. దాళ్వా వరి కాల పరిమితులు (120-130 రోజులు) తక్కువగా ఉండటం వలన కాంప్లెక్స్ ఎరువులు వేయదలిచిన రైతులు ఊడ్చిన తరువాత 10-15 రోజులకు వేయాలి. అపుడే పైరు పెరుగుదలకు నాటిన 30-35 రోజుల్లో పైరు పూర్తిస్థాయికి వస్తుంది. దీనివలన ఎరువుల ఖర్చు ఆదా అవుతుంది.

జింకు సల్ఫేటును భాస్వరపు ఎరువులో కలిపి వేయరాదు

జింకు ధాతు లోపం ఉన్న నేలలో జింకు సల్ఫేటును భాస్వరపు ఎరువుల్లో కలిపి వేయరాదు. 2-3 రోజుల వ్యవధిలో వేసుకోవాలి. డౌడు భూములకు కాల్వల చివరి హూముల‌కు జింకు సల్ఫేటు ద్రావణాన్ని పైరుపై జల్లుకోవడం మంచిది. మార్కెట్‌లో లభించే చిలేటెడ్ జింకు ఎకరాకు 200 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి.

కలుపు నిర్మూలన అవసరం

నాట్లు వేసిన పైరులో కలుపు నివారణకు నాటిన 15-20 రోజుల మధ్య అన్ని రకాల కలుపు మొక్కలను నివారించేందుకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 100 మిల్లీ లీటర్ల బిస్‌పైరిబాక్ సోడియం కలిపి పిచికారీ చేయాలి. మందులు చల్లిన తరువాత వారం వరకూ పొలం నుంచి నీటిని బయటకు పోనీయరాదు.

నీటి యాజమాన్య పద్ధతులు

వరి నాటిన వెంటనే మొక్క మూడోవంతు వరకూ మునిగేలా నీరు పెట్టాలి. నాటిన వారం రోజుల నుంచి పైరు పిలకలు తొడగడం పూర్తయ్యేవరకూ మూడు సెంటీమీటర్ల లోతు మించకుండా నీరు కట్టాలి. పైరు కోతకు ముందు 10 రోజుల వరకూ మడిలో 5 సెంటీమీటర్ల లోతు నీటిని ఉంచాలి. పిలకలు తొడిగి దుబ్బు కట్టడం పూర్తయిన దశలో అంటే అంకురం ప్రారంభ దశలో 2-3 రోజులు చేనును ఆరనివ్వాలి. ఇలా చేయడం వలన పొలం నుంచి చెడుగాలులు బయటకు పోతాయి. ప్రాణవాయువు (ఆక్సిజన్) పైరు వేర్ల వ్యవస్థకు బాగా అందుతుంది. అంకురం దశలో వేసే ఆఖరి మోతాదు ఎరువు (యూరియా/అమ్మోనియం సల్ఫేటు + మ్యూరేట్ ఆఫ్ పొటాష్) పోషకాలను మొక్క బాగా తీసుకోగలుగుతుంది. చంక పిలకలు చిన్నగా ఉండే పిలకలు పోషకాలు సరిగా అందక చనిపోతాయి. మిగిలిన పిలకలు బాగా పెరిగి, మంచి పొడవైన వెన్నులు వేస్తుంది. వెన్నులో ఎక్కువ రెల్లలతోపాటు గింజల సంఖ్య ఎక్కువగా ఏర్పడతాయి.





పురుగులు, తెగుళ్ల పేర్లు.. నివారణా చర్యలకు వాడే మందులు

- **కాండం తొలుచు పురుగు** : ఎకరానికి క్లోరిపైరిపాస్ 500 మిల్లీలీటర్లు లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు 12 కిలోలు.
- **ఆకుముడత** : మోనోక్రోటోఫాస్ 400 మిల్లీలీటర్లు లేదా అసిఫేట్ 300 గ్రాములు.
- **గోధుమ రంగు దోమ** : మోనోక్రోటోఫాస్ 440 మిల్లీలీటర్లు లేదా దీపపు పురుగులు. అసిఫేట్ 300 గ్రాములు.
- **రెల్ల రాల్చు పురుగు** : మోనోక్రోటోఫాస్ 320 మిల్లీలీటర్లు లేదా క్లోరిఫైరిపాస్ 400 మిల్లీలీటర్లు.
- **అగ్గితెగులు** : ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు లేదా ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు.
- **మెడవిరుపు** : ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు.
- **పొడతెగులు** : కార్బండిజమ్& 350 గ్రాములు లేదా హెక్సాకోనజోల్ 400 మిల్లీలీటర్లు.
- **కంకినల్లి** : ప్రొఫెనోపాస్ 400 మిల్లీలీటర్లు లేదా డైకోఫాల్ 1,000 మిల్లీలీటర్లు.

సుడిదోమ తీవ్రతే అధికం

- దాళ్వా వరిపంటను ఆశించి తీవ్ర ఆర్థిక నష్టం కలుగజేసే దోమల్లో 'గోధుమరంగు దోమ' ఒకటి. దీనినే సుడిదోమ అని పిలుస్తారు.
- ఇది ఆశించిన పంటకు సుడితెగులు కలుగజేస్తుంది. సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించకపోతే నత్రజని ఎరువుల మోతాదును మించి విచక్షణా రహితంగా బస్తాల కొద్దీ గుమ్మరించినా ఇది సోకుతుంది.
- క్రిమి సంహారక మందులను అధికంగా వినియోగించినా పొలాల్లో ఈ పురుగు ఉధ్రుతి అధికమవుతుంది.
- పొటాష్‌ను అనుకూల సమయంలో వాడకపోయినా ఇది సోకుతుంది.
- వరినాట్లు వేసేటప్పుడు అంకురం దశ లేక చిరుపొట్ట దశలో కనీసం రెండుసార్లు పొటాష్‌ను వాడాల్సిందే.
- వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన సురక్షిత మందులు వాడకపోవడం కూడా కారణమే.
- పొలాల నుంచి మురుగునీరు బయటకు వెళ్లే సదుపాయాలు లేకపోవటం.
- సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం.
- అనుకూల వాతావరణం ఉష్ణోగ్రత 30-32 డిగ్రీలు, గాలిలో తేమ 75-80 శాతం ఉండటం కూడా కరణం.

దోమపోటును అదుపు చేసే విధానాలు

- దోమపోటును తట్టుకునే వంగడాలనే సాగుచేసుకోవాలి.
- విత్తనశుద్ధి తప్పనిసరి. నిర్ణీత సమయాల్లో పొలాన్ని ఆరబెట్టి, తడి పెట్టే చర్యలను చేపట్టాలి.
- ముఖ్యంగా పిలకలు చేయడం పూర్తయి, ఆంకురం దశల పొలం నెరలు ఇచ్చేవరకూ ఆరబెట్టి తరువాత నీరు పెట్టాలి.
- అనుకూల పరిస్థితులు ఏర్పడినపుడు దీపపు ఎరలు పెట్టి, దోమ ఉధ్రుతికి నివారణ చర్యలు చేపట్టాలి.
- దుబ్బుకు పది దోమలు మించకుండా ఉన్నపుడు చిరుపొట్ట దశలో ముందస్తుగానే ఇమిడాక్లోప్రిడ్ 500 మిల్లీలీటర్లు గానీ థయోమిథాగ్జామ్ 4.0 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి.
- దోమలు ఎక్కువ సంఖ్యలో ఉన్నపుడు (దుబ్బుకు 15-20 దోమలు దాటితే) ఎస్పేట్ 350 గ్రాములు లేదా డీడీవీపీ 250 మిల్లీలీటర్లు గాని బీపీఎంసీ 400 మిల్లీలీటర్లు లేదా బుప్రొఫెజిన్ (అప్లాడ్) 300 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేస్తే, దోమపోటును అదుపు చేయవచ్చు.
- డైనో ఫ్యూరాన్ 20 శాతం చొప్పున దుబ్బుల అడుగు భాగానికి మందు పడిటట్లు పిచికారీ చేసుకుంటే మరింతగా సుడితెగులును నియంత్రించవచ్చు.

చిరుపొట్ట దశలోనూ దోమపోటు..

వరి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడే దోమ ఆశిస్తుంది. ఇలాంటి సమయంలో పిల్ల దోమలు ఎక్కువగాను, చిన్న దోమలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి తరుణంలో 'కార్బోఫ్యూరాన్' గుళిక మందు ఎకరాకు 10-12 కిలోలు వాడాలి. పిల్ల దోమలు మోస్తరుగా ఉండి, పెద్ద దోమలు ఎక్కువగా ఉంటే, ద్రావణం మందులతోపాటు 'డైక్లోరోవాస్' 250 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి వారం పది రోజులకు మరలా పిచికారీ చేసుకుంటే దోమను అదుపు చేసుకోవచ్చు. దోమపోటు ఎక్కువగా ఆశించినపుడు ఫోరేట్ గుళికలు వాడితే 75-80 శాతం వరకే దోమలు చనిపోతాయి. మిగిలిన 20-25 శాతం దోమల్లో ఎక్కువగా ఆడవి ఉంటాయి. విపరీతమైన కసితో 800-1000 గుడ్లు పెట్టి, పంటకు విపరీతమైన నష్టాన్ని కలుగజేస్తాయి. ఈ పరిస్థితిని 'రిసర్జెన్సు' అంటారు. అందుకే ఫోరేట్ గుళికలను వాడరాదు.

విక్రమ్ 'స్కెచ్' ఏంటి..?

మీడియాతో 'చియాన్' చిట్‌చాట్



చాలా రోజుల తరువాత చియాన్ విక్రమ్ తన అభిమానులను అలరించేందుకు 'స్కెచ్' వేశాడు. వైవిధ్యమైన పాత్రలకు బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచిన విక్రమ్ స్కెచ్ సినిమాలో మరో విలక్షణమైన పాత్ర పోషించాడు. స్కెచ్ మూవీ ప్రమోషన్ కోసం హైదరాబాద్ వచ్చిన విక్రమ్ తో మీడియా చిట్‌చాట్‌లో పంచుకున్న విశేషాలు ఇవి.

ఈ సినిమా కథ ఏంటంటే!

బ్యాంక్‌లో కార్ లోన్స్ రికవరీ ఏజెంట్స్ గా పనిచేసే గ్రూప్, లోన్స్ రికవరీ చేయడం కోసం స్కెచ్ వేసే గ్రూప్ సడెన్ గా ఒక పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు వాళ్లు ఏం చేశారు? ఆ తరవాత వాళ్ళు వేసిన స్కెచ్ ఏంటి? అనేదే సినిమాలో ఇంట్రెస్టింగ్ పాయింట్.

ఊరమాస్ సినిమా

ఈ సినిమా కంప్లీట్ గా అల్ట్రా మాస్ సినిమా, సినిమాలో కీ ఎలిమెంట్స్ ని డిఫెరెంట్ గా ప్రెజెంట్ చేశాం. అదే సినిమాలో హైలెట్ పాయింట్. ఈ సిచ్యువేషన్స్ మధ్య సెన్సిటివ్ లవ్ స్టోరీ. సినిమాని మ్యాగ్జిమం రియలిస్టిక్ గా చూపిస్తూనే, ఫాంటసీ ఎలిమెంట్స్ ని జతచేశాం.

కథ బాగా నచ్చింది

కథ వినగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. తమన్నాకి కూడా చాలా నచ్చింది. ఇంత మంచి క్యారెక్టర్ దొరకడం నిజంగా ఆమె అదృష్టం.

నో ఎక్స్ పెరిమెంట్స్

విక్రమ్ సినిమా అనగానే ఏదో ఒక ఎక్స్ పెరిమెంట్ ఉంటుందని ఎక్స్ పెక్ట్ చేస్తుంటారు. కానీ ఎటువంటి ప్రయోగాలు లేని సినిమా చేయడం కూడా నాకు ఎక్స్ పెరిమెంట్ లాంటిదే



తమన్నా తళుక్కుమంది

తమన్నా ఈ సినిమాలో చాలా సీరియస్ రోల్ చేసింది. బ్రాహ్మణ అమ్మాయిగా నీట్ గా, పద్ధతి గల అమ్మాయిలా కనిపిస్తుంది. ఇక నా క్యారెక్టర్ కంప్లీట్ మాస్, గూండాలా ఉంటాను. ఇలాంటి వెరీ డిఫెరెంట్ క్యారెక్టర్స్ మధ్య రొమాన్స్ చాలా కొత్తగా అనిపిస్తుంది.

హీరోయిజం తగ్గించాం

ఈ స్టోరీలో హీరోయిజంని ఇంకా చాలా రెట్లు ఎలివేట్ చేసే చాన్సెస్ ఉన్నా, నేనే తగ్గించమన్నాను. అప్పుడే ప్రతి ఒక్కరు క్యారెక్టర్‌కి కనెక్ట్ అవుతారు. పాత్రలు కూడా సహజంగా ఉంటాయి కదా.

నో కామెడీ

సినిమాలో ఇంట్రెస్టింగ్ కామెడీ ట్రాక్ ఉన్నా సినిమా స్పీడ్ గా ఉండాలన్న రీజన్ తో కామెడీ ట్రాక్ ని తొలగించాం. ఈ విషయంలో యూనిట్ కు సారీ కూడా చెప్పాను. అయినా సినిమాలో కావాల్సినంత కామెడీ ఉంటుంది. న్యాచురల్ గా నేను, నా ఫ్రెండ్స్ కాంబినేషన్ లో కామెడీ ఉంటుంది. కానీ స్పెషల్ గా కామెడీ ట్రాక్ ఉండదు. సినిమాకి ఆ ట్రాక్ అంతలా అవసరం కూడా లేదు.

అప్ కమింగ్ ప్రాజెక్టులు

ప్రస్తుతం ధ్రోణ చేస్తున్నాను, ఆ తరవాత వరసగా సామి, కమల హాసన్ బ్యానర్ లో సినిమా, ఆ తరవాత మహావీర సినిమా ఉంటుంది. ఫిబ్రవరిలో 'ధ్రోణ' సినిమాకి సంబంధించి కంప్లీట్ డీటేల్స్ అనౌన్స్ చేస్తారు. 300 కోట్లతో చాలా మంచి సినిమా ప్లాన్ చేస్తున్నారు. డీటేల్స్ విన్నాక మీరు షాక్ తినడం ఖాయం. ఆ రేంజ్ లో కాస్టింగ్ ఉంటుంది.

అర్జున్ రెడ్డి రీమేక్ నేనే చేద్దామనుకున్నాను

తెలుగులో సెన్సేషన్ క్రియేట్ చేసిన సినిమా అర్జున్‌రెడ్డితో ధృవ్ తమిళ్‌లో లో లాంచ్ అవ్వడం, అందునా పర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉన్న సినిమా చేస్తున్నాడు కాబట్టి హ్యాపీ. యాక్టర్ కి ఏజ్ తో సంబంధం ఉండదు. ఈ విషయంలో నాకు బిగ్ బి ఇన్స్ పిరేషన్. ఒకవేళ ధృవ్ లేకపోతే నేనే అర్జున్ రెడ్డి సినిమా చేసి ఉండేవాణ్ణి. ఓల్డ్ క్యారెక్టర్స్ చేయడమన్నా నాకిష్టమే.

ఇల్లే ఇండియా.. దిల్లే ఇండియా..



అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం తొలిపాటను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. 'సైనికా..' అని సాగే ఈ పాటను సైనికులకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొంది. రెండోపాటను ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు చెప్పింది. ఈ సందర్భంగా గేయరచయిత రామజోగయ్యశాస్త్రి ట్వీట్ చేశారు. "ఇల్లే ఇండియా.. దిల్లే ఇండియా.. ' సైనికులకు అంకితం' అని పోస్ట్ చేశారు. మరోపక్క ఈ చిత్రం శాటిలైట్ హక్కులకు మంచి డిమాండ్ ఏర్పడినట్లు సమాచారం. ఓ ఛానెల్ రూ.24 కోట్లతో హక్కులను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. హిందీ డబ్బింగ్ వెర్షన్ హక్కులను కూడా ఇదే సంస్థ కొన్నదట. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లో అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటిస్తున్నారు. శరత్‌కుమార్, అర్జున్, బొమన్ ఇరానీ, రావు రమేశ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. రామలక్ష్మి క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. విశాల్-శేఖర్ స్వరాలు అందిస్తున్నారు. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్‌గా అనసూయ



డా. మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న గాయత్రి చిత్రం ఫిబ్రవరి 9 న విడుదల కానుంది. సంక్రాంతికి విడుదలైన టీజర్ కు అద్భుతమైన స్పందన రాగా, 'రాయలసీమ రామన్న చౌదరి' తరహాలో మోహన్ బాబు ఓ పవర్ఫుల్ పాత్రలో కనిపించనుండటంతో చిత్రంపై అంచనాలు భారీగా పెరిగాయి. విష్ణు మంచు, శ్రియలు ముఖ్య పాత్రలలో కనిపించనున్నారు. వారి లుక్స్ కి కూడా విశేష స్పందన వచ్చింది. తాజాగా అనసూయ పాత్ర పరిచయ పోస్టర్ ను విడుదల చేసింది చిత్ర బృందం. అనసూయ శ్రేష్ట జయరాం అనే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్ గా కనిపించనున్నారు. పోస్టర్ పై ఆమె తీక్షణ చూపులు పాత్రపై ఆసక్తి రేపుతోంది. కథలో ప్రాధాన్యత ఉండే పాత్ర అని తెలుస్తోంది. నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఫిబ్రవరి 9న మన ముందుకు రాబోతున్న గాయత్రీ చిత్రాన్ని మోహన్ బాబు తన ప్రతిష్టాత్మక బ్యానర్ అయిన శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పై నిర్మించగా అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు.

హాలీవుడ్ చిత్రంలో రకుల్ సోదరుడు!

ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ వరుస సినిమాలతో టాలీవుడ్‌ని ఒక ఊపుఊపేస్తోంది. త్వరలో తన సోదరుడు అమన్ కూడా సినిమాల్లోకి రానున్నట్లు వార్తలు వెలువడుతు న్నాయి. 2017లో 'రాక్ అండ్ రోల్' అనే లఘు చిత్రంతో అమన్ ప్రేక్షకులకు పరిచయ మయ్యారు. ఇప్పుడు ఆయన ఓ హాలీవుడ్ చిత్రంలో నటించే అవకాశం దక్కించుకు న్నారు. ప్రస్తుతం అమన్ 'సెడిషన్' అనే చిత్రంలో నటిస్తున్నారట. ఇది ఆంగ్లంతో పాటు హిందీలోనూ విడుదల కాబోతోంది. ఇందులో ఆస్ట్రేలియాతో పాటు పలువురు భారతీయ నటులు కూడా నటిస్తున్నారు. సమ్మర్ బోధి నిక్స్, , జోయెల్ మరాక్కోలు తెరకెక్కిస్తున్నారు. ఆస్ట్రేలియా, అమెరికా, ఇండియాలో ఈ సినిమా విడుదల కాబోతోంది.



'మోహిని' చిత్రంలో త్రిష, జాకీ

అడివిశేష్, శివాని జంటగా కొత్త చిత్రం



లక్ష్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అడివి శేష్ హీరోగా ఓ కొత్త చిత్రం షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. వెంకట్ రెడ్డి దర్శకత్వంలో ఎం.ఎల్.వి.సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిందీలో ఘన విజయం సాధించిన '2 స్టేట్స్' చిత్రానికి తెలుగు రీమేక్ ఇది. రాజశేఖర్, జీవిత తనయ శివాని ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. శివాని తొలి చిత్రం కోసం ఎన్నో కథలు విన్నప్పటికీ నటనకు ఎంతో ఆస్కారం ఉన్న ఈ కథను ఎంచుకోవడం విశేషం.

బ్యూటీఫుల్ లవ్ అండ్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. దర్శకుడు వెంకట్ రెడ్డి వి.వి. వినాయక్ తో అసోసియేట్ గా చాలా చిత్రాలకు పనిచేసారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా నటీనటులను, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే నిర్మాతలు ప్రకటిస్తారు. ఈ చిత్రానికి సంగీతం : అనూప్ రూబెన్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎం.ఎస్.కుమార్, నిర్మాత : ఎం.ఎల్.వి.సత్యనారాయణ, దర్శకత్వం : వెంకట్ రెడ్డి.

అనర్హతపై హైకోర్టుకు ఆప్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ : లాభదాయక పదవులకు సంబంధించిన అంశంలో అనర్హత వేటు పడిన ఢిల్లీలోని 20 మంది అమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు మంగళవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. లాభదాయక పదవులు నిర్వహించినందుకు తమపై అనర్హత వేటు వేయడాన్ని వారు సవాల్ చేశారు. ఈ అంశంపై అత్యవసరంగా విచారణ జరపాలనే పిటిషన్ బుధవారం జస్టిస్ ఎస్ రవీంద్రభట్, జస్టిస్ ఏకే చావ్లాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానున్నది. ఢిల్లీ అసెంబ్లీలోని 20 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఆరీచేసినందున ఈ అంశాన్ని అత్యవసరంగా విచారణకు చేపట్టాల్సివున్నదని 20 మంది ఎమ్మెల్యేలలో ఒకరి తరఫున కోర్టుకు హాజరైన న్యాయవాది మనీష్ వశిష్ట్ ధర్మాసనానికి విన్నవించారు. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ కేపిటల్ టెరిటోరి ఆఫ్ ఢిల్లీ (జీఎన్‌సీటీడీ) చట్టం కింద 20 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తున్నట్టు రాష్ట్రపతి తెలిపినట్టుగా ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌ను కొట్టిపారేయాలని ఆ పిటిషన్‌లో ఎమ్మెల్యే కోరారు. 2015 మార్చి 13 నుంచి 2016 సెప్టెంబరు 8వ తేదీ మధ్య పార్లమెంటరీ కార్యదర్శులుగా పనిచేసి లాభదాయక పదవులు నిర్వహించారన్న ఆరోపణపై 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని సిఫార్సుచేస్తూ రాష్ట్రపతికి ఎన్నికల కమిషన్ లేఖ రాసిన రెండు రోజుల తరువాత నోటిఫికేషన్ విడుదలైంది.

సీఈసీగా రావత్ బాధ్యతల స్వీకరణ..!



న్యూఢిల్లీ : కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా ఓం ప్రకాశ్ రావత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ అచల్ కుమార్ జోతి పదవీకాలం సోమవారం ముగియడంతో.. ఆయన స్థానంలో ఓపీ రావత్ నియామకం అయ్యారు. రావత్ 1977 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన 1993లో భారత రక్షణశాఖలో డైరెక్టర్‌గా, 1994లో దక్షిణాఫ్రికా ఎన్నికల్లో ఐరాస తరఫు పరిశీలకుడిగా పని చేశారు. 2004-2006 మధ్య మధ్యప్రదేశ్ సీఎం బాబూలాల్ గౌర్ హయాంలో రావత్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ నుంచి ఓంప్రకాశ్ రావత్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో ఆ స్థానంలో ఆర్థిక మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి అశోక్ లవాసాను ప్రభుత్వం నియమించింది.

వైవాహిక స్థితిపై ఎన్ఐఏ దర్యాప్తు చేయదు : సుప్రీంకోర్టు

కేరళ లవ్‌జీహాద్‌పై స్పష్టీకరణ

న్యూఢిల్లీ : కేరళలో వివాదాస్పదమైన లవ్ జీహాద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు జరుపుతుంది కాని, వారి వైవాహిక స్థితిపై దర్యాప్తు జరపబోదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. లవ్‌జీహాద్ కేసులో పురోగతి కన్పిస్తుందని, కోర్టు ఆదేశాల మేరకు ఎన్ఐఏ దర్యాప్తు జరుపుతోందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్ లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వెల్లడించింది. లవ్‌జీహాద్ బాధితురాలిగా భావిస్తున్న కేరళకు చెందిన యువతి హదియా ఆమె ఇష్టప్రకారమే షఫిన్ జహన్‌ను వివాహం చేసుకున్నానని తెలుపడంతో కోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది. హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కేరళ హైకోర్టులో సమగ్రంగా విచారించిందా లేదా అని సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. మేజర్ అయిన యువతి తనకు ఇష్టమైన వారిని పెళ్లి చేసుకుందని దానిపైనే విచారణ చేపట్టామని కోర్టు తెలుపుతూ, కేసును ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది. గతేడాది నవంబరు 27న సుప్రీంకోర్టు ఆమె తల్లిదండ్రుల కస్టడీ నుంచి విడుదల చేసి కాలేజీకి వెళ్లే అవకాశం కల్పించింది. అయితే భర్తతో ఉండేందుకు అవకాశం కల్పించాలని ఆమె అభ్యర్థించడంతో 25 ఏళ్ల హదియాతో సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోనుంది. హదయా పుట్టుకతో హిందువు, ఆపై ఇస్లాంలోకి మారి జహన్‌ను వివాహమాడింది. లవ్ జీహాద్ పేరుతో వివాహాన్ని రద్దు చేయడాన్ని జహన్ కేరళ హైకోర్టులో సవాలు చేశారు.

కమలంతో కటీఫ్?!

- సమస్యల్ని గాలికి వదిలేసి మోడీ విదేశీ పర్యటనలు
- బీజేపీ హిందూత్వం అర్థం కాదు
- కులాలకు అతీతంగా మరాఠ ఐక్యత
- వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు లేదు
- శివసేనాధిపతి ఉద్ధవ్ ఠాక్రే



ముంబై: శివసేన బీజేపీతో పాతికేళ్ల అనుబంధాన్ని శివసేన తెగదెంపులు చేసుకుంది. ఇక బీజేపీతో దోస్తీ లేదని కటీఫ్ చెప్పేసింది. కేంద్రంలో, మహారాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంలో సంకీర్ణభాగస్వామి శివసేన.. 2019 సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించింది. గుజరాత్‌లో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును శివసేన తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే? రూ.35 వేల కోట్ల భారాన్ని మహారాష్ట్రపై మోపారని మోడీ సర్కారును ఉతికి ఆరేస్తోంది. నోట్ల రద్దు, జీఎస్టీపైనా గరంగరంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో కలిస్తే?తమకూ ఓటమి తప్పదనే భావనకు వచ్చిన శివసేన మంగళవారం జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గం భేటీలో ఈ మేరకు తీర్మానం చేసింది. ఇక నుంచి బీజేపీతో పొత్తు ఉండదనే తీర్మానాన్ని జాతీయ కార్యనిర్వాహక సమావేశంలో శివ నేత సంజరు రౌత్ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో, రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేయబోమని శివసేన స్పష్టం చేసింది. ఇక నుంచి జరిగే ఏ ఎన్నికల్లోనైనా ఒంటరిగానే పోటీ చేస్తామని వెల్లడించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాలకు గానూ 25 స్థానాలు, అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకు గానూ 150 స్థానాల్లో గెలవాలని శివసేన ప్రతిజ్ఞ చేసింది. ఇక, శివసేన జాతీయ కార్యవర్గ సభ్యుడిగా అధినేత ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే నియమితులయ్యారు. ఇటు కేంద్రంలో, అటు మహారాష్ట్రలో బీజేపీతో శివసేన కలహాల కాపురాన్ని కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీలు చిక్కినప్పుడల్లా బీజేపీపై, కేంద్రంలోని మోడీ సర్కారుపై శివసేన తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో బీజేపీతో దోస్తీపై నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉద్ధవ్ ఠాక్రే ఇప్పటికే తెలిపారు. ఇది బీజేపీకి అల్టిమేటం కాదని అన్నారు. ప్రధాని మోడీపై విమర్శనాస్త్రాలు సంధించారు. నిత్యం విదేశీ పర్యటనల్లో మునిగిపోతున్న ప్రధాని దేశ సమస్యలను గాలికి వదిలేశారని ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు బెంజమిన్‌ను అహ్మదాబాద్‌కు తీసుకువచ్చారని, కానీ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌కు ఎందుకు తీసుకువెళ్లలేదన్నారు. కనీసం అక్కడ రోడ్‌షో నిర్వహించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించలేదేం అని ప్రశ్నించారు. లాల్ చౌక్‌కు ఇజ్రాయిల్ ప్రధానిని తీసుకువెళ్లకుండా అహ్మదాబాద్‌కు తోడ్కొని వెళ్లారని ఎద్దేవ చేశారు. హిందూత్వంపై బీజేపీ నిర్వచనం ఏమిటో బోధపడటం లేదన్నారు.

బీజేపీ అన్వయిస్తున్న హిందూత్వం మనకు తెలీదు. గోహత్యలంటే గోహత్యలే. ఉగ్రవాదమంటే ఉగ్రవాదమే మనకు తెలుసు. గోరక్షక్ ఆగడాలేంటీ? కులాలకు అతీతంగా మారాఠ ప్రజలకు ఏకం చేయటమే శివసేన లక్ష్యం అన్నారు. ఔరంగజేబ్ విభజించి పాలించినా మరాఠ ప్రజలు విడిపోలేదని, కులాలవారీగా మనుషులను విభజించటం మరాఠ ప్రజలకు తెలీదు, అని ఉద్ధవ్‌ఠాక్రే అన్నారు. ఇదిలా ఉంటే, దావోస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ ఆర్థిక సదస్సుకు హాజరైన మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ, ఆ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్న తమ ప్రభుత్వానికి ఢోకా లేదన్నారు. ఇరుపార్టీలు పూర్తికాలం అధికారంలో ఉంటాయని, ఆ తరువాత జరిగే ఎన్నికల్లోనూ తామే విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేశారు

ముస్లిం పురుషులను శిక్షించేందుకే...



- ట్రిపుల్ తలాఖ్ బిల్లుపై ఒవైసీ
- బడ్జెట్‌లో ముస్లిం మహిళల కోసం రూ.2కోట్లు
- ఇన్‌స్టెంట్ తలాక్ కోరితే బహిష్కరించండి : ముస్లింలకు పిలుపు

ఔరంగాబాద్ : ట్రిపుల్ తలాఖ్ బిల్లు ముస్లిం పురుషులను శిక్షించేందుకు జరుగుతున్న కుట్ర అంటూ ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. ముస్లిం మహిళలను రోడ్లపైకి తీసుకొచ్చి, ముస్లిం పురుషులను కటకటాల పాల్జేసే వ్యూహమని సోమవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఒవైసీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ట్రిపుల్ తలాక్ బిల్లు ముస్లిం వర్గీయులను చీల్చే పన్నాగమన్నారు. విడాకుల కోసం ఇన్‌స్టెంట్ ట్రిపుల్ తలాక్ మార్గాన్ని అనుసరించే వారిని ముస్లింలంతా బహిష్కరించాలని ఒవైసీ పిలుపునిచ్చారు. ముస్లిం మహిళల కోసం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండు చేశారు. పద్మావత్ చిత్రం కోసం కమిటీ వేసిన కేంద్రం ట్రిపుల్ తలాక్ వ్యవహారంలో కమిటీ ఎందుకు వేయలేదని ఒవైసీ ప్రశ్నించారు. దేశం కోసం ఏమీ చేయని ప్రధాని ఇతరులు చేసే మంచికి క్రెడిట్ కొట్టేస్తుంటారని ఎద్దేవా చేశారు. ముస్లింరహిత భారతదేశాన్ని బీజేపీ కోరుకుంటోందని, ముస్లింలు, దళితులు ఇప్పటికైనా మేల్కొని తమకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించాలని ఒవైసీ అన్నారు. వీడీ సవార్కర్ సిద్ధాంతాలను బలవంతంగా అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని, ఎంఎస్ గోవాల్కర్, కేబీ హెగ్డేవార్, సవార్కర్‌లది హిందూత్వ సిద్ధాంతమని, దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించమన్నారు. కోరేగావ్ హింసకు కారణమైన శివప్రతిష్ఠాన్ హిందుస్థాన్‌కు చెందిన సంభాజీ భిడే, హిందూ ఎక్తా అఘాడీకి చెందిన మిలింద్ ఎక్తాబోటెలను ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని ఒవైసీ ప్రశ్నించారు.

ప్రధాని మోడీ, సీఎం యోగీలకు రక్తంతో లేఖ

న్యాయం కోసం అత్యాచార బాధితురాలి వేడుకోలు





రాయ్‌బరేలి (యూపీ) : తన జీవితాన్ని బలి తీసుకున్న నిందితులు తిరుగుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీలకు రక్తంతో లేఖ రాసిన దీనురాలి వ్యథ ఇది.

పోలీసులు నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, అందుకు కారణం వారికి రాజకీయంగా పలుకుబడి ఉండటమేనని ఆమె ఆ లేఖలో పేర్కొంది. అంతేకా కుండా ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలని వారు ఆమెపై ఒత్తిడి తెస్తున్నారని 'నాకు తక్షణమే న్యాయం చేయాలని లేకుంటే ఆత్మహత్య' చేసుకుంటానని జనవరి 20న రాసిన లేఖలో ఆమె వెల్లడించింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గతేడాది మార్చి 24న నిందితులు దివ్యపాండే, అంకిత్ వెర్మలపై కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ దాఖలు చేశామని రాయబరేలీ ఏఎస్పీ శశి శేఖర్ సింగ్ తెలిపారు. నిందితులు ఇంజనీరింగ్ విద్యార్థులని తరచు తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని బాధితురాలి తండ్రి వాపోయారు. 2017 అక్టోబరులో గుర్తుతెలియన నిందితులు ఫేస్‌బుక్ ఓపెన్ చేసి బాధితురాలి పేరుతో అశ్లీల దృశ్యాలు పోస్టు చేశారని మరొక ఫిర్యాదు చేశారని, దీనిపై దర్యాప్తు జరుగుతుందన్నారు. రక్తలేఖపై ఏఎస్పీని ప్రశ్నించగా ఆ విషయాలు తమకు తెలియవన్నారు.

పద్మావత్‌ను ఆపేది లేదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

రాజస్థాన్, మధ్యప్రదేశ్ పిటిషన్ కొట్టివేత

తీర్పునకు కట్టుబడాల్సిందే.. : అన్ని రాష్ట్రాలకు ఆదేశం

న్యూఢిల్లీ /జైపూర్ / ముంబై : ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన వివాదాస్పద చిత్రం 'పద్మావత్' విడుదలపై ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఓవైపు రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు వీల్లేదని వాదిస్తుండగా మరోవైపు కర్ణిసేన పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలకు తెరతీస్తోంది. ఇటీవల సెన్సార్ బోర్డు పచ్చజెండా ఊపడంతో సర్వోన్నత న్యాయస్థానం సైతం పద్మావత్ సినిమా విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా చూడాలంటూ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది. కాగా, మంగళవారం రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పద్మావత్ విడుదలను ఆపేది లేదని మరోమారు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి ఈనెల 18న వెలువరించిన తీర్పును సవరించబోమని తేల్చిచెప్పింది. 'సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుకు ప్రజలంతా కట్టుబడి ఉండాలి. అలాగే అన్ని రాష్ట్రాలు చట్టానికి లోబడి వ్యవహరించాలి. ఇప్పటికే వెలువరించిన తీర్పును సవరించేది లేదు' అంటూ జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ప్రధానన్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. పద్మావత్ విడుదలను నిలిపివేయాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం తమ ఆదేశాలను ధిక్కరిస్తే సహించేది లేదని అన్ని రాష్ట్రాలకు కచ్చితంగా చెప్పింది. అత్యవసర పరిస్థితుల్లో తమను ఆశ్రయించవచ్చునని సూచించింది. శ్రీరాష్ట్రీయ రాజ్‌పుట్ కర్ణిసేన, అఖిల భారతీయ క్షత్రియ మహాసభల పిటిషన్లనూ సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ చిత్రం విడుదలపై ఆంక్షలొద్దని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు స్పష్టంచేయడం విదితమే.

సినిమా హాళ్ల వద్ద 'జనతా కర్ఫ్యూ' : కర్ణిసేన

ఈనెల 25న పద్మావత్ చిత్రం విడుదలైతే ఆయా సినిమా హాళ్ల వద్ద జనతా కర్ఫ్యూ అమలవుతుందని శ్రీరాజ్‌పుట్ కర్ణిసేన హెచ్చరించింది. 'ప్రజల్లోకి వెళతాం. ఈ సినిమా విడుదలయ్యే ప్రతి సినిమా హాల్ వద్ద జనతా కర్ఫ్యూ అమలు చేస్తాం. జనతా కర్ఫ్యూ అంటే సినిమా ప్రదర్శనను ప్రజలే అడ్డుకుంటారన్న మాట' అని సంఘం చీఫ్ లోకేంద్రసింగ్ కాల్వి తెలిపారు. ఇప్పటికే సినిమా హాళ్ల యజమాను లు, డిస్ట్రిబ్యూటర్లతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మద్దతు ను కోరినట్టు వెల్లడించారు. ఈ సినిమా హక్కులను కొనుగోలు చేయవద్దని డిస్ట్రి బ్యూటర్లను కోరామన్నారు.

సిద్ధి వినాయక్‌ను దర్శించుకున్న దీపికా పదుకొణె : పద్మావత్‌లో ప్రధాన పాత్ర పోషించిన దీపికా పదుకొణె భారీ బందోబస్తు నడుమ సిద్ధివినాయక్ ఆలయాన్ని సంద ర్శించి ప్రత్యేక పూజలు ఆచరించారు. పద్మావత్ సినిమా శుక్రవారం విడుదల కానున్న విషయం తెలిసిందే.





బెదరని బాలీవుడ్

చారిత్రక కథాంశంతో చలనచిత్ర నిర్మాణమనేది ఎంతటి ఆసక్తిదాయకమవుతోందో అంత కంటే ఎక్కువ వివాదాస్పదమూ అవుతోంది. అయితే, చారిత్రక కథాంశ చలనచిత్రాల నిర్మాణం కొనసాగించడానికి అనేక భాషల్లోని నిర్మాతలు, దర్శకులు ఇష్టపడుతున్నారు. తాజాగా, సంజయ్ లీలా భన్సాలీ రూపకల్పనలో నిర్మాణమైన 'పద్మావత్' చిత్రం ఈనెల 25న విడుదల కానుంది. దీపిక పదుకొణె, షాహిద్ కపూర్, రణ్వీర్ సింగ్‌లు ఇందులో ప్రధాన పాత్రధారులు

ఏడాది క్రితం ప్రారంభమైన నిర్మాణ దశ నుంచి చిత్ర పరిచయానికి ఉద్దేశించి విడుదల చేసిన టీజర్ వరకు ఈ వివాదాల పరంపర కొనసాగింది. సెన్సార్ బోర్డు నిర్దేశించిన కత్తిరింపుల అనంతరం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత 'పద్మావతి' అని పేరు పెట్టగా సెన్సార్ కత్తిరింపుల్లో దీన్ని 'పద్మావత్'గా మార్చారు. దీనిపై వివాదం చాల తీవ్ర స్థాయికి చేరింది. అయినా బాలీవుడ్ బెదరలేదు.. నిరసనలకు వెరవలేదు. కేతన్ పరేఖ్, సిద్ధార్థ్ మల్హోత్ర, ఆర్ మాధవన్ తదితరులు ఇప్పటికీ చారిత్రక ప్రాధాన్యత కథాంశాలను తెరకెక్కించే యత్నాల్లోనే ఉన్నారు. చరిత్ర అంటే కథల ధనాగారమని మెహత మీడియాకు చెప్పారు. 1993లో విడుదలైన 'సర్దార్' (సర్దార్ వల్లభాయ్‌పటేల్), 2005లో విడుదలైన అమీర్ ఖాన్ కథానాయకునిగా నటించిన 'మంగళ్‌పాండే' చారిత్రక నేపథ్య చలన చిత్రాలకు ఆయన దర్శకుడు. తాజాగా భన్సాలీ బృందం మీద వెల్లువెత్తిన విద్వేషాన్ని గమనించిన ఆయన తన సహచరులను అప్రమత్తం కావాల్సిందిగా హితవు పలికారు. ఏ అంశం మీదనైనా విభిన్న అభిప్రాయాలుంటాయి. ఎవరికి వారే స్వీయ నిర్ణయాలకు లోనుకారాదు. భావ ప్రకటన స్వేచ్ఛ అనేది ప్రాథమిక హక్కని గుర్తించాలని, దీన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన వివరించారు. చిత్రంలో లోపాలను చక్కదిద్దేందుకు సెన్సార్ బోర్డు ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఓటు హక్కును ప్రజలు ఎలా వినియోగించుకుంటున్నారో అలానే వారికి ఉన్న నచ్చిన సినిమాను చూసే హక్కును ఏ ఒక్కరూ తోసి వేయరాదన్నారు.

ఝాన్సీ రాణి లక్ష్మీబాయి జీవితచరిత్ర ఆధారంగా కంగనా రనౌత్ కథానాయికగా రూపొందిస్తున్న 'మణికర్ణిక : ఝాన్సీ రాణి' సినిమా నిర్మాత కమల్ జైన్ మాట్లాడుతూ జీవితానికి చరిత్రను అతి చేరువ చేయగల సాధనం సినిమానే అని అన్నారు. ప్రజలకు ఏసందేశాన్ని చేరవేయాలన్నా సినిమాను మించిన సాధనం లేదన్నారు. అశుతోష్ గోవారికర్ దర్శకత్వం వహించిన 'జోధా అక్బర్'లో కథానాయకునిగా నటించిన ప్రముఖ నటుడు సోనూ సూద్ మాట్లాడుతూ చరిత్ర నేపథ్యంగా తీసే సినిమాలపై భిన్నాభిప్రాయలుండటం సహజమేనన్నారు. అలా అని చలన చిత్ర నటీనటులు, సిబ్బంది స్వేచ్ఛ, గౌరవాలకు భంగం కలిగించే రీతిలో ఎవరూ నడుచుకోరాదన్నారు. చలన చిత్ర కళాకారుల మీద రాజకీయాల ప్రాబల్యం ఉండరాదని మాధవన్, నిమ్రత్ కౌర్‌లు చెప్పారు. నిరసనలకు బెదిరి చారిత్రక కథాంశ చలన చిత్ర నిర్మాణాలు నిలిపి వేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలను ఎవరూ బెదిరించలేరని వారు చెప్పారు.

నేతాజీ జయంతినాడు సెలవు లేదా..

కోల్‌కతా: కేంద్ర ప్రభుత్వం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి జనవరి 23ను జాతీయ సెలవు దినంగా ప్రకటించకపోవడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ మండిపడ్డారు. నేతాజీ 121వ జయంతి సందర్భంగా రెడ్ రోడ్‌లోని ఆయన స్మారక మందిరం వద్ద నివాళులు అర్పిస్తూ ముఖ్యమంత్రి, నేతాజీ అదృశ్యం వెనుక ఉన్న నిజాన్ని తెలుసుకునేందుకు దేశ ప్రజలు ఇప్పటికీ ఆసక్తి చూపుతున్నారన్నారు. 'జనవరి 23'ను రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల క్రితమే సెలవు దినంగా ప్రకటించిందని, కేంద్రం ఇప్పటికీ మౌనంగా ఉంటుందన్నారు. ఆయనకు మనం ఇచ్చే గౌరవం ఇదా' అంటూ మమత ప్రశ్నించారు.

ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్‌కు జైలు

న్యూఢిల్లీ : మనీ ల్యాండరింగ్ కేసులో ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్‌ను న్యాయస్థానం జైలుకు పంపిన సంఘటన ఇది. గుజరాత్‌కు చెందిన ఓ ఫార్మా కంపెనీతో ప్రమేయం ఉన్న రూ.5,000 కోట్ల మనీ ల్యాండరింగ్ కుంభకోణంలో బ్యాంకు అధికారి అనూప్ ప్రకాష్ గార్గ్ పాత్ర ఉన్నందున ఈడీ తొమ్మిది రోజుల విచారణ జరిపి, అనంతరం కోర్టు ముందు హాజరు పర్చాగా, అదనపు సెషన్స్ జడ్జి సిద్ధార్థ శర్మ రెండు వారాల కస్టడీకి పంపుతూ తీర్పు ఇచ్చారు.

కూతురిని కడతేర్చిన తండ్రి

ప్రతాప్‌ఘర్ (యూపీ) : ప్రతాప్‌ఘర్‌లో దారుణం జరిగింది. దళిత యువతి అంజు (19)ని ఆమె తండ్రి, సోదరుడు కిరోసిన్‌పోసి నిప్పంటించారని పోలీసులు తెలిపారు. ఇంట్లో ఆమె ఒక్కతే ఉండగా ఈ ఘటన జరిగిందన్నారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆమె మరణించిదని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు.

రెండేళ్లలో 168 కర్ఫ్యూలు,ఆంక్షలు..

జమ్మూ: గత రెండేళ్లలో జమ్మూకాశ్మీర్‌లోని 9 జిల్లాల్లో 168 కర్ఫ్యూలు, ఆంక్షలు విధించినట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. శాసనసభ సమావేశాల సందర్భంగా నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే అలీ మొహమ్మద్ అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ, అనంతనాగ్ జిల్లాలో అత్యధికంగా 51 సార్లు కర్ఫ్యూ లేదా ఆంక్షలు విధించగా, అత్యల్పంగా కిష్త్వార్ జిల్లాలో 5 సార్లు కర్ఫ్యూ విధించినట్టు తెలిపారు.

ఎన్నికల ముందే 'నాగా' పరిష్కారం:ఎన్ఎస్ఏ

కొహిమా: నాగా రాజకీయ సమస్యకు రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందే పరిష్కారాన్ని కనుగొనాలని నాగా విద్యార్థి సంఘం(ఎన్ఎస్ఏ)తో పాటు రాష్ట్ర ట్రైబల్ సంఘం, పౌర సంఘాలు మంగళవారం ర్యాలీ నిర్వహించాయి. నాగా హెూహెూ, నాగా మదర్స్ అసోషియేషన్ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. ఈ నెల 18న ఎన్నికల సంఘం 60 సీట్లున్న నాగాలాండ్ అసెంబ్లీకి ఫిబ్రవరి 27న ఎన్నికలు జరపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

అమృత్‌సర్ మేయర్‌గా కరంజిత్ సింగ్

అమృత్‌సర్ : కరంజిత్ సింగ్ రింటూ అమృత్‌సర్ మేయర్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైయారు. సీనియర్ డిప్యూటీ మేయర్‌గా రమణ్ బక్షీ, డిప్యూటీ మేయర్‌గా యూనీస్ కుమార్ ఎన్నికైయారు. అయితే ఈ ఎన్నికలకు అమృత్‌సర్ ఎమ్మెల్యే అయిన రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి నవ్‌జోత్ సింగ్ సిద్ధూ గైరుహాజరవ్వడం ప్రస్ఫుటంగా కనిపించింది. సిద్ధూ,కరంజిత్ సింగ్‌ల మధ్య సత్సంబంధాలు లేవు. సీనియర్ డిప్యూటీ మేయర్‌తోనూ సిద్ధుకు సరియైన సంబంధాలు లేవన్న సంగతి రాష్ట్రంలో అందరికీ తెల్సిన విషయమే.

పోలీసు అధికారితోపాటు నలుగురిపై కేసు

పాల్ఘర్ : మహారాష్ట్రలో 28 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారితోపాటు నలుగురిపై కేసు నమోదైంది. పాల్ఘర్ జిల్లాలోని విరార్‌లో నివాసముంటున్న అమిత్ ఝా శనివారం విషం తీసుకున్నాడని, ముంబైలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మృతిచెందాడని పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసు అధికారితో పాటు నలుగురి వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని అమిత్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చాడని కేసు నమోదు చేశామన్నారు.

జమ్మూ, కాశ్మీర్ జైళ్లలో 2,535 మంది ఖైదీలు

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్‌లోని వివిధ జైళ్లలో 69 మంది విదేశీయులతో పాటు మొత్తం 2,500 మందికి పైగా ఖైదీలు ఉన్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తెలిపారు.రాష్ట్రంలోని జైళ్లలో ఎంతమంది ఖైదీలున్నారన్న వివరాలపై శాసనసభలో అడిగిన ప్రశ్నకు ఆమె మంగళవారం లిఖితపూర్వకంగా బదులిచ్చారు. ఉగ్రవాదానికి సంబంధించిన కేసుల్లో 63 మంది, విచారణలో ఉన్న విదేశీ ఖైదీలు 20 మంది ఉన్నారని తెలిపారు.

బొగ్గు కుంభకోణం కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ

కోల్‌కొతా : రూ 487 కోట్ల విలువైన బొగ్గు దిగుమతి కుంభకోణం కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. 2011-12, 2014-15లో ఎన్‌టీపీసీ, ఇతర విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఇండోనేషియా నుంచి తక్కువ నాణ్యత గల బొగ్గు దిగుమతి జరగడంపై రెవెన్యూ ఇంటెలిజెన్స్ దర్యాప్తు డైరక్టరేట్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేపట్టినట్టు అధికారులు మంగళవారం తెలిపారు. చైన్నైలోని కోస్టల్ ఎనర్జీ ప్రైవేట్ సంస్థ ప్రమోటర్ అహ్మద్ ఏఆర్ బుహారీ, ఇతర అధికారులపై సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందని తెలిపారు.

కేరళలో నేడు మోటారు వాహనదారుల సమ్మె

తిరువనంతపురం : తరచూ చమురు ధరలను పెంచడాన్ని నిరసిస్తూ కేరళలో ట్రేడ్ యూనియన్‌లు ఇచ్చిన సమ్మె పిలుపునకు మోటారు వాహన దారులు మద్దతు తెలిపాయి. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు బస్సులు, ఆటోరిక్షాలు, ట్యాక్సీలు నడపకుండా సమ్మెలో పాల్గొనాలని ట్రేడ్ యూనియన్లు, సీపీఐ(ఎం),యూడీఎఫ్‌లు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. భారతీయ మజ్దూర్ సంఘ్ సమ్మెలో పాల్గొనడం లేదు.

మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఆనందీబెన్ పదవీ ప్రమాణ స్వీకారం

భోపాల్ : మధ్యప్రదేశ్ గవర్నర్‌గా బీజేపీ సీనియర్ నాయకురాలు ఆనందీబెన్ పటేల్ బుధవారం పదవీప్రమాణ స్వీకారం చేశారు. ఆ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ హేమంత్ గుప్తా రాజ్‌భవన్‌లో ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆయన క్యాబినెట్ సహచరులు, ఇతర నాయకులు హాజరయ్యారు.

90 లక్షల విలువైన బంగారం స్వాధీనం-ఇద్దరి అరెస్ట్

చెన్నై : చెన్నైలోని విమానాశ్రయంలో ఐదు వేర్వేరు ఘటనల్లో రూ.90 లక్షల విలువైన మొత్తం 2.5 కిలోల బంగారాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్‌కు చెందిన కస్టమ్స్ విభాగం స్వాధీనం చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారాలతో సంబంధాలున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. దుబాయి నుంచి వచ్చిన చెరియా పరంబాత్ అన్సార్ నుంచి 25 లక్షల విలువైన 829 గ్రాముల బంగారాన్ని, అలాగే దుబాయి నుంచి వచ్చిన ఇద్దరు మహిళల నుంచి 28 లక్షల విలువైన 492 గ్రాముల బంగారాన్ని, కువైట్ నుంచి వచ్చిన శివయ్య నుంచి రూ.10 లక్షల విలువైన 333.8 గ్రాముల బంగారాన్ని, అలాగే మరో ఇద్దరి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నేతాజీకి ఒడిశా సీఎం ఘననివాళి

భువనేశ్వర్ : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 121వ జయంత్యుత్సవం, వీర సురేంద్ర సాయి 209వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఒడిశాలో పలువురు ప్రముఖులు వారికి ఘననివాళులర్పించారు. బుధవారం కటక్‌లోని నేతాజీ విగ్రహం వద్ద సీఎం నవీన్ పట్నాయక్ పుష్పాంజలి ఘటించారు. నేతాజీ ఒడిశా ముద్దుబిడ్డ అని, గొప్ప దేశభక్తుడు,స్వాతంత్ర్య సమరయోధుడని ఆయన కొనియాడారు. అలాగే స్వాతంత్రోద్యమంలో పాల్గొని గిరిజనుల కోసం పాటుపడి వీర్‌సురేంద్ర సాయి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో బెయిల్ ఇప్పిస్తున్న వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-గుంటూరు క్రైం : తప్పుడు ధ్రువపత్రాలతో న్యాయస్థానాన్ని మోసగించేందుకు యత్నించిన వ్యక్తిని గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం తన కార్యాలయంలో సీఐ శ్రీధర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ స్పెషల్ మొబైల్ కోర్టు ఆదేశాలతో ప్రతిపాడు మండలం పరిమి రాజారావు, శీలం నాగరాజు కోర్టులో శిక్షపడిన ముద్దాయిలకు తప్పుడు ధృవపత్రాలతో బెయిల్ ఇప్పిస్తుంటారని తెలిపారు. గుంటూరు ఇజ్రాయిల్ పేటకు చెందిన నాగరాజు ప్రత్తిపాడు మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాజారావు రేవేంద్రపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. కోర్టులో శిక్షపడిన వ్యక్తులకు బెయిల్ ఇప్పించేందుకు వీరు ముఠాగా ఏర్పడి కొంత మొత్తం వసూలు చేస్తూ వారికి ఉపయోగపడతారన్నారు. మొబైల్ కోర్టు ఆదేశాలతో వీరి ధృవపత్రాలను పరిశీలించిన నగరంపాలెం పోలీసులు తప్పుడువని తేలడంతో కోర్టుకు విన్నవించారు. కోర్టు ఆదేశాలతో రాజారావును అరెస్టు చేశారు. నాగరాజు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

గుండెపోటుతో కళారత్న వెంపటి రవిశంకర్ మృతి



విశాలాంధ్ర-కూచిపూడి : ప్రముఖ కూచిపూడి యువనాట్యాచార్యులు, కళారత్న వెంపటి రవిశంకర్(48) మంగళవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఆకస్మికంగా మృతి చెందినట్టు సమాచారం అందుకున్న కృష్ణాజిల్లా కూచిపూడి నాట్యాచారులు తల్లడిల్లిపోయారు. కూచిపూడి నాట్య కళాపీఠంలో ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, అధ్యాపకులు డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, పసుమర్తి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, పసుమర్తి హరనాథశాస్త్రి, దేగల సాంబశివరావు, గ్రామస్తులు భాగవతుల రామతారకం, కావూరి శివకృష్ణ, తేజ, కె.పి.సి. శర్మ, కె. నరసింహారావు, గ్రంథాలయాధికారి ఏలేశ్వరపు వెంకట ఫణికుమార్, విశ్వం తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం రెండవ కుమారుడు రవికి కూచిపూడి గ్రామంతో ఎనలేని అనుబంధం ఉంది. తండ్రికి తగిన తనయునిగా పేరు ప్రఖ్యాతలు గాంచిన రవి కొంత కాలంగా మూత్రపిండ వ్యాధితో బాధ పడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. రవి మరణవార్త విని అఖిల భారత కూచిపూడి నాట్య కళా మండలి కార్యదర్శి పసుమర్తి కేశవప్రసాద్, కూచిపూడి భాగవత మేళం అధ్యక్షుడు డాక్టర్ వేదాంతం వెంకటాచలపతి, సభ్యులు వెంపటి సత్యప్రసాద్ తదితరులు కన్నీటి పర్యంతమయ్యారు.

బైబిల్ మిషన్ వార్షిక సమావేశాలకు ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బైబిల్ మిషన్ వార్షిక సమావేశాల నేపథ్యంలో విజయవాడ-గుంటూరు మధ్య నాగార్జుననగర్ రైల్వేస్టేషన్‌లో కొన్ని రైళ్లకు హాల్ట్, మరికొన్ని రైళ్లను నాగార్జుననగర్ వరకు పొడిగించడంతో పాటు కొన్ని రైళ్లకు ప్రత్యేక కోచ్‌లు ఏర్పాటు చేసినట్టు విజయవాడ రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వివరించారు.

అదనపు కోచ్‌లు వేసిన రైళ్లు : రైలు నంబర్ 57382/57381 నరసాపూర్-గుంటూరు- నరసాపూర్ ప్యాసింజర్, రైలు నంబర్ 57317 గుంటూరు - మాచర్ల , రైలు నంబర్ 57327 డోన్ - గుంటూరు.

నాగార్జుననగర్ వరకు పొడిగించిన రైళ్లు : రైలు నంబర్ 57226/57225 విశాఖపట్నం-విజయవాడ- విశాఖపట్నం ప్యాసింజర్,రైలు నంబర్ 57232/57231 కాకినాడ పోర్టు-విజయవాడ-కాకినాడ పోర్టు, రైలు నంబర్ 57272 రాయగఢ్- విజయవాడ

ప్రత్యేక రైళ్లు : రైలు నంబర్ 07223 కాకినాడ టౌన్ - గుంటూరు ప్యాసింజర్(ఈనెల 26న), రైలు నంబర్ 07224 గుంటూరు -కాకినాడ పోర్టు(ఈనెల 29న)

తాత్కాలికంగా హాల్ట్ ఇచ్చిన రైళ్లు : రైలు నంబర్ 17201/17202 గుంటూరు-సికింద్రాబాద్-గుంటూరు, రైలు నంబర్ 17239/17240 గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఈ కార్యాలయ టెండరు నోటీసు నం.లు. 782 మరియు 784/2017-18, 785 నుండి 788/2017-18, తేదీ : 19.1.2018 (3వ పిలుపు) కెనాల్స్, డ్రెయిన్లు మరియు ఐ.డి. ఏలూరు **రూ.166.51 లక్షలకు** గాను 7 పనులు . టెండర్ల స్వీకరణకు చివరి తేదీ/సమయం : 05.02.2018, మ.3.00 గం.ల వరకు. తదుపరి వివరములను **www.apepro curement.gov.in** నందు చూడవచ్చును. ఫోన్ : 08812-220108.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, నీటిపారుదల వలయం, ఏలూరు

డిపిఆర్:3110/సివిల్/ఎడివిటి-1/1/17-18, తేదీ : 23/01/2018

సిండికేట్ బ్యాంక్
సోమాజీగూడ బ్రాంచ్, 6-3-666, గ్రౌండ్ ఫ్లోర్, లుంబిని టవర్స్, నిమ్స్ ఎదుట, పంజాగుట్ట, హైదరాబాద్-500082.
ఫోన్ : 04023311104/23311015
ఇ-మెయిల్ : br.3008@syndicatebank.co.in

సర్ఫేసీ చట్టం, 2002 కింద ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (ఇకమీదట చట్టంగా పరిగణించబడునది) కింద స్థిర/చరాస్తుల అమ్మకం

ఈ కింద వివరించిన బాకీలు మరియు తదుపరి వడ్డీ, చార్జీలు మరియు వ్యయాలు మొదలైనవి రాబట్టుకొనేందుకు చట్టంలోని సెక్షన్ 13(4) కింద సిండికేట్ బ్యాంకు అధీకృత అధికారి స్వాధీనంలోకి తీసుకున్నదైన బ్యాంకుకు తాకట్టు పెట్టబడిన కింద పేర్కొన్న ఆస్తి దిగువ వివరించినట్లుగా ఇ-వేలం ద్వారా విక్రయించబడునని ప్రత్యేకించి రుణగ్రహీత'లు మరియు హామీదారు'లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

కింద ప్రస్తావించిన బకాయిలను రాబట్టుకోవడానికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు (ఇక మీదట నిబంధనలుగా ప్రస్తావించబడును) నిబంధన నం.8 & 9 కింద **'ఎచ్చట ఉన్నది ఉన్నట్లు, అక్కడ ఏది ఉంటే అది మరియు గత్యంతరం లేని పద్ధతి'** పై ఈ దిగువ వివరించబడిన ఆస్తి విక్రయించబడును.

రుణగ్రహీత/లు హామీదారు/లు పేరు మరియు చిరునామా : ఎం/ఎస్. కనుమర్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్., ఫ్లాట్ నం.8/2, హెచ్.నం.3-6-3/2/1, వివేకానంద నగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072. **హామీదారులు : 1.** కె.వి. రంగారెడ్డి, తండ్రి కె.పిచ్చి రెడ్డి, ఫ్లాట్ నం.301, ఎవిఎస్‌ఆర్ పూర్ణా రెసిడెన్సీ, వి.ఎన్. కాలనీ, హైదరాబాద్-500072. **2.శ్రీమతి** కె.మాధవి, భర్త పి. శ్రీనివాసరెడ్డి, ఫ్లాట్ నం.301, ఎవిఎస్‌ఆర్ పూర్ణా రెసిడెన్సీ, వి.ఎన్. కాలనీ, హైదరాబాద్-500072. **3. శ్రీ** ఎస్. విజయ రాఘవ, తండ్రి ఎస్.వీరభద్ర శర్మ, ఎ-305, వి.ఎస్.ఆర్. Celestial టవర్స్, గాజులరామారం, హైదరాబాద్. **4. శ్రీ.** మహ్మద్ అబ్దుల్ వహీద్ బేగ్, తండ్రి అబ్దుల్ రషీద్ బేగ్, 6-5-7/1, ఎం.ఎఫ్. మంజిల్, బగత్‌గల్లి, పటాన్‌చెరు, మెదక్-502319.

ది.30-01-2017 నాటికి బాకీ మొత్తం + వడ్డీ మరియు వ్యయాల తర్వాత :మొత్తం బాకీ :రూ.4,51,90,898.73 (నాలుగు కోట్ల యాభై ఒక్క లక్షల తొంభై వేల ఎనిమిది వందల తొంభై ఎనిమిది రూపాయల డెబ్బై మూడు పైసలు మాత్రమే) (01-01-2017 నుండి భవిష్యత్తు వడ్డీ + వ్యయాలు + (విజయవంతమైన బిడ్డర్ విద్యుత్ బకాయిలు, ఆస్తి పన్ను & నిర్వహణ చార్జీలు చెల్లించవలెను)

యజమాని/తనఖాదారు పేరుతో ఉన్న స్థిర/చర ఆస్తుల వివరాలు :

శ్రీమతి పి.జ్యోతి పేరుతో ఉన్న స్థిర ఆస్తి వివరాలు : **01.** చెరుకుపల్లివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడలో శ్రీమతి పి.జ్యోతి పేరుతో 282.25 చదరపు గజాల కొలతతో వార్డ్ నం.24, డి.నం.29-5-12 ఆధారంగా ఉన్న నివాసిత ఇల్లు యొక్క ఆర్ఇఎం. **హద్దులు : తూర్పు :** చెరుకుపల్లి వారి వీధి @ మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :**మల్లాది వారి వీధి @ మున్సిపల్ రోడ్డు, **పడమర :** చెరుకుపల్లి గోపాలకృష్ణ మూర్తి ఆస్తి, **ఉత్తరం :** గద్దమణుగు సూర్యనారాయణ ఆస్తి.

బ్యాంకు తెలిసినంతవరకు ఆస్తిపై అప్పుల వివరాలు : ఏమీ లేవు

ఇ-వేలంకు సంబంధించిన వివరాలు ఈ కింద పేర్కొనబడినవి :

ఇ-వేలం తేదీ & సమయం : **16.02.2018 మ॥ 2.00 గం.ల నుండి సా.400 గం.ల మధ్య.**

అస్తి రిజర్వు ధర : **రూ.2,26,67,000/- +** విజయవంతమైన బిడ్డర్ విద్యుత్ బకాయిలు, ఆస్తి పన్ను & నిర్వహణ చార్జ్ చెల్లించవలెను.

ఇ-వేలం వెబ్‌సైట్ చిరునామా : **https://syndicatebank.auctiontiger.net**

ధరావత్తు సొమ్ము డిపాజిట్ (ఇఎండి) : **రూ.22,67,000/-**

బిడ్లు సమర్పించుటకు చివరి తేదీ : **14.02.2018, సా॥ 4.00 గం.**

కనిష్ఠంగా బిడ్ పెంపుదల మొత్తం : **రూ.2,00,000/-**

ఉద్దేశిత కొనుగోలు దారుల కొరకు ఆస్తి తనిఖీ తేదీ & సమయం : **తేదీ : 12-02-2018 నుండి 13.02.2018 వరకు ఉ.10.00 సా. 4.00** గం.ల మధ్య సంప్రదించవలసినది : సిండికేట్ బ్యాంక్, సోమాజీగూడ బ్రాంచ్, ఫోన్ : **040-23311104 (క్యాబిన్), మొబైల్ : 9440905006**

సర్వీస్ ప్రొవైడర్ కాంటాక్టు వివరాలు & వెబ్‌సైట్ చిరునామా (పేరు/టెలిఫోన్ నెం./ ఇ-మెయిల్ ఐడి/చిరునామా) : ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (అక్షన్ టైగర్), బి 704-705, వాల్‌స్ట్రీట్-2, ఓరియంట్ క్లబ్ ఎదుట, గుజరాత్ కాలేజ్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్, 079-40230844/ 813/814/815/816/817/818/819/820/821/822/823/824. మొబైల్ నెం.9898745874,/ 9978591888, ఇ-మెయిల్ ఐడి : support@auctiontiger.net, rikin@auctionertiger.net, ramesh. sengunthar@ auctiontiger.net లేదా శ్రీ భాస్కర్ (హైదరాబాద్, ఫోన్ నం.8341410158).

నియమ నిబంధనలు : 1. ఆన్‌లైన్‌లో బిడ్ల సమర్పణకు ముందుగా ఎ/సి నం. **30083170000024, సిండికేట్ బ్యాంక్, సోమాజీగూడ బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సి కోడ్ SYNB0003008** కు ఆర్.టి.జి.ఎస్/ఎన్.ఇ.ఎఫ్.టి/ఫండ్ ట్రాన్సర్ ద్వారా ఇఎండి డిపాజిట్ చేయాలి. హైదరాబాద్‌లో చెల్లించబడే విధంగా సిండికేట్ బ్యాంక్ పేరిట తీసుకున్న పే ఆర్డర్ / డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా కూడా ఇఎండి చెల్లించవచ్చును. **2.** ఆశావాహులైన బిడ్డర్లు ఇఎండి నిమిత్తం డి.డి. / పి.ఓ. / ఎన్.ఇ.ఎఫ్.టి. యు.టి.ఆర్. నెంబర్‌ను ఉటంకించడం ద్వారా / ఆర్.టి.జి.ఎస్.తో పాటుగా సంపూర్ణంగా భర్తీ చేసిన బిడ్ ఫారంను (పై వెబ్‌సైట్‌లో ఫార్మాట్ లభ్యమవుతుంది) సీలు వేయబడిన ఒక కవరులో **అధీకృత అధికారి, రీజనల్ ఆఫీసు, హైదరాబాద్ సిటీ, 6-2-915, 2వ అంతస్తు, వెస్ట్‌బ్లాక్, హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్. & ఎస్‌బి అడ్మిన్ బిల్డింగ్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004,** ఈమెయిల్ : **ro.hyderabad@syndicatebank.co.in** చిరునామాకు సమర్పించాలి. అయితే ఇది తేదీ : **14.02.2018, సా.4.00** గం.లకు (బిడ్ సమర్పణకు ఆఖరు తేది) ముందుగా చేరాలి. సీలు వేయబడిన కవరుపై **ఎం/ఎస్. కనుమర్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఖాతా యందు** "ఇ-వేలంలో పాల్గొనేందుకు బిడ్" అని స్పష్టంగా వ్రాయాలి. **3.** ఇ-వేలం విక్రయానికి సంబంధించిన అన్ని నియమ నిబంధనలు పొందుపరచిన సమగ్ర ఇ-వేలం నోటీసు కొరకు బ్యాంక్ వెబ్‌సైట్ www.syndicatebank.in ను దర్శించవలసిందిగా బిడ్డర్లకు సూచన. బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌ను కూడా దర్శించవచ్చును లేదా ఎట్టి వివరణలు/ప్రశ్నలకైనా పైన ఇవ్వబడిన వివరాల ప్రకారం వారిని సంప్రదించవచ్చును. **4.** ఆశావాహులైన బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే డిజిటల్ సంతకం సర్టిఫికెట్లు, క్రియాశీల మెయిల్ చిరునామా మరియు పాన్ నెంబరు కలిగి ఉండాలి. **5.** ఎట్టి ముందస్తు నోటీసు లేకుండా మరియు ఎట్టి కారణం తెలుపకుండా ఎట్టి బిడ్‌నైనా ఆమోదించే లేదా తిరస్కరించే లేదా వాయిదా/విక్రయ రద్దు లేదా ఎట్టి నియమనిబంధనలనైనా సవరించే పూర్తి హక్కు మరియు విచక్షణను దిగువ సంతకందారు కలిగివున్నారు. **6.** చట్టం మరియు నిబంధనలో నిర్దిష్ట నియమ నిబంధనలు మరియు వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన నిర్దిష్ట సవివరమైన నియమ నిబంధనల షరతులకు లోబడి విక్రయం వుంటుంది. **7.** మరిన్ని వివరాలకు **అధీకృత అధికారి రీజినల్ ఆఫీసు, హైదరాబాద్ సిటీ, 6-2-915, 2వ అంతస్తు, వెస్ట్‌బ్లాక్, హెచ్ఎండబ్ల్యుఎస్ & ఎస్‌బి అడ్మిన్ బిల్డింగ్, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004,** ను సంప్రదించండి. ఇ-మెయిల్ ro.hydera bad@syndicatebank.co.in

పైన ప్రస్తావించబడిన బాకీ మొత్తాలను పూర్తిగా చెల్లించనట్లయితే పైన ప్రస్తావించబడిన తేది మరియు సమయానికి పైన పేర్కొన్న విక్రయానికి సంబంధించి పైన ప్రస్తావించబడిన సెక్యూర్డ్ డెబిట్ రుణగ్రహీత/లు మరియు హామీదారు/లు, తనఖాదారు/లు కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు 2002, నిబంధన 8(6) కింద నోటీసుగా కూడా దీనిని పరిగణించాలి.

ఈ ప్రకటనలో భాగంగా చదువుకొనే వేలం విక్రయ సమగ్ర నియమ నిబంధనల కొరకు బ్యాంక్ వెబ్‌సైట్‌ను దర్శించవలసిందిగా ఆశావాహులైన బిడ్డర్లకు అభ్యర్థన.

తేదీ : 23.01.2018, ప్రదేశము : హైదరాబాద్ **సం/- అధీకృత అధికారి, సిండికేట్ బ్యాంక్**




సంక్షోభంలో చక్కెర పరిశ్రమ

చక్కెరశాఖ ఇన్‌చార్జి కమిషనర్ సాధు సుందర్

విశాలాంధ్ర-జామి : రాష్ట్రంలో చక్కెర పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని చక్కెరశాఖ ఇన్‌చార్జి కమిషనర్ సాధుసుందర్ అన్నారు. మంగళవారం విజయనగరం జిల్లా జామి మండలంలోని భీమసింగి శ్రీవిజయరామ సహకార చక్కెర కర్మాగారాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది ఎనిమిది లక్షల టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు విశాఖ జిల్లా చోడవరంలో 1,79,790 టన్నులు, ఏటికొప్పాకలో 50,710 టన్నులు, తాండవలో 60,645 టన్నులు, భీమసింగిలో 29,170 టన్నుల చెరకు క్రషింగ్ చేశామన్నారు. ఏటా చెరకు సాగు తగ్గడంతో సంక్షోభానికి దారి తీస్తోందన్నారు. భీమసింగి విషయంలో సైతం ఇది ప్రమాదకరంగా ఉందన్నారు. రానున్న కాలంలో చెరకు విస్తీర్ణం పెంచేందుకు రైతులతో సమావేశాలను నిర్వహించడంతోపాటు వారిని ప్రోత్సహించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని ఉయ్యూరు, పెరుమాళ్ళ, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో కొత్త రకం వంగడాలు తయారుచేయడం ద్వారా రైతులకు అధిక దిగుబడి వచ్చేలా చూడాలన్నారు. చెరకు యాంత్రీకరణకు అనుకూలంగా సాగు చేయాలన్నారు. గెడకూ గెడకూ మధ్య నాలుగు అడుగుల స్థలం వదిలిపెట్టాలని, ఈ విధానంలో రైతులకు ఎటువంటి నష్టం రాదన్నారు. సహకార కర్మాగారాలకు ప్రభుత్వం ఎలాంటి సాయంచేసే స్థితిలో లేదన్నారు. ఎన్‌సీడీసీ ద్వారా నాలుగు కర్మాగారాలకు రూ.235 కోట్లను రుణంగా ఇచ్చేందుకు ప్రభుత్వం హామీ తెలిపిందన్నారు. పంచదార ధర ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో మరిన్ని ఆర్థిక ఇబ్బందులను కర్మాగారాలు ఎదుర్కోవాల్సివస్తోందని చెప్పారు. ఆయన వెంట తాండవ ఎండీ వి.సన్యాసినాయుడు, భీమసింగి ఎండీ ఎం.సత్యనారాయణ, కర్మాగార సిబ్బంది పాల్గొన్నారు.

400 చెరువులకు సాగర్‌నీరు

- గుంటూరు, ప్రకాశం జిల్లాలకు..
- ఇప్పటికే కొన్ని చెరువుల్లోకి నీరు
- వచ్చే నెలాఖరులోపు పూర్తిస్థాయిలో చర్యలు
- ఈ సీజన్‌లో 57 టీఎంసీల విడుదల
- నెలాఖరుకు మరో ఆరు టీఎంసీల విడుదలకు సన్నాహాలు
- తాగునీటి ఎద్దడికి చెక్ పెట్టేందుకు ప్రయత్నం



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : వేసవి నేపథ్యంలో నాగార్జునసాగర్ నుంచి ప్రత్యేకంగా నీటిని విడుదల చేశారు. వీటితో రెండు జిల్లాల పరిధిలో ఉన్న నాలుగు వందల చెరువులను నింపుతున్నారు. వచ్చేనెలాఖరులోపు పూర్తిస్థాయిలో నింపేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు చెరువులలోకి నీటిని నింపే పనిలో నిమగ్నమయ్యారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి ఏటా తాగునీరు నిమిత్తం గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీరు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నీటి విడుదల ఆరంభించారు. రెండు జిల్లాల పరిధిలో 400 చెరువులను నింపుతున్నారు. దీనిలో గ్రామీణనీటి సరఫరా విభాగానికి చెందిన ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, కుంటలు ఉన్నాయి. ఇప్పటికే నీటిని విడుదల చేయడంతో చెరువులకు నీరు వెళుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సాగర్ కుడికాలువ ద్వారా 57 టీఎంసీల నీటిని విడుదల చేసింది. ఈ నెలాఖరుకు మరో ఆరు టీఎంసీల నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అయితే ఫిబ్రవరి, మార్చినెలల్లో మరో 23 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. దీనిపై కొంతవరకు సందిగ్ధత ఉంది. ఈ నేపథ్యంలో చెరువులను వేగంగా నింపేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. గత ఏడాది సాగర్‌నీటిని సకాలంలో విడుదల చేయకపోవడం వలన పంటలు ఎండిపోయాయి. రెండు జిల్లాల్లో ప్రధానంగా మిర్చి పంట ఎండిపోయి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తాగునీటితోపాటు, రబీలో సాగు అవుతున్న పంటలకు సకాలంలో తడులు ఇవ్వాల్సిఉంది. అందువలన ప్రకటించిన కార్యాచరణ ప్రకారం నీటిని విడుదల చేయాల్సిఉంది. దీనివలన ప్రభుత్వం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ఇచ్చిన ప్రతిపాదనల ప్రకారం నీటిని సాధించుకోవాల్సి ఉంది. లేనిపక్షంలో నీరు విడుదల కాకపోతే రెండు జిల్లాల పరిధిలో రబీలో పంటలు సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి.

చెరువుల నుంచే మారుమూల గ్రామాలకు

ఈ చెరువులలో ఉన్న నీటిని జిల్లా గ్రామీణనీటి సరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా మారుమూల గ్రామాలకు నీటిని తరలిస్తుంది. ఇలా తరలించేందుకు రెండు జిల్లాల పరిధిలో అధికారులు సుమారు రూ.20కోట్లతో వేసవి కార్యాచరణ కూడా రూపొందించారు. ఈ నేపథ్యంలో చెరువుల నిండా సమృద్ధిగా నీరు లేకపోతే వచ్చే మార్చి, ఏప్రిల్, మేనెలల్లో నీటికోసం ఇబ్బందులు పడాల్సివస్తుంది. పైగా వేసవివేడికి కొంతనీరు ఆవిరి అయిపోతుంది. అందువలన ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ చెరువులను నూరుశాతం నింపేందుకు కృషిచేస్తున్నారు.

పంటలకు మరో రెండు తడులు

రెండు జిల్లాల్లో సాగు అవుతున్న రబీ పంటకు మరో రెండు తడులు ఇస్తారు. దీనిలో ఒకటి వచ్చేనెల పదోతేదీన, మరొకటి మార్చి తొలివారంలో ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండుపర్యాయాలు ఇచ్చే నీటిని రైతులు ప్రణాళికాయుతంగా వినియోగించుకోవాలని ఇరిగేషన్ అధికారులు సూచించారు.

టెట్‌ను వాయిదా వేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు

విశాలాంధ్ర- డోన్ : రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత ఆలోచన వల్ల నిరుద్యోగులు ఒత్తిళ్లకు గురవుతున్నారని, టెట్‌ను నెల రోజుల పాటు వాయిదా వేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు అన్నారు. కర్నూలు జిల్లా డోన్‌లో మంగళవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతున్నదన్నారు. భాషా పండితులకు మూడు పేపర్లను విభజించి టెట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. మూడవ పేపర్‌లో 1వ తరగతి నుంచి పీజీ వరకు సిలబస్ ఉండటంతో నిరుద్యోగులు చదవడానికి తగిన సమయం సరిపోవడం లేదన్నారు. పాత సిలబస్ కాకుండా కొత్త సిలబస్‌ను టెట్‌లో ప్రవేశపెట్టడంతో నిరుద్యోగుల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. దీంతో నిరుద్యోగులు మానసిక ఒత్తిళ్లకు గురై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మరో నెలపాటు వాయిదా వేసి పాత సిలబస్ ద్వారానే పరీక్షలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా మూడవ పేపర్ 10వ తరగతి వరకు మాత్రమే సిలబస్ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేంద్రంలో మళ్ళీ మోడీ వస్తే విపత్తే

మాజీ ఎంపీ ఉండవల్లి



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభుత్వం వస్తే పెను విపత్తు తప్పదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా అధికార టీడీపీ, విపక్ష వైసీపీ మాట్లాడలేని వింత రాజకీయ పరిస్థితి ఇక్కడ కనిపిస్తోందన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వై జంక్షన్ ఆనం రోటరీ హాలులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014 ఎన్నికలయ్యాక కేంద్రానికి మద్దతు ఇస్తున్నట్లు జగన్ ఢిల్లీ వెళ్లి చెప్పాడని, హోదా ఇవ్వకుండా ప్యాకేజీ ఇస్తున్నట్టు చెప్పిన కేంద్రం అది కూడా ఇవ్వలేదన్నారు. 'ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీకి మద్దతిస్తానంటూ జగన్ చెబుతున్నాడని, నిజానికి ఇక్కడ టీడీపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉందన్నారు. కేంద్రంపై పోరాటం చేయకుండా టీడీపీ మీదే వైసీపీ పోరాటం చేస్తోందన్నారు. 'మోడీ ప్రత్యేక హోదా ఇవ్వరనే ఉద్దేశంలో జగన్ ఉన్నాడేమో అనిపిస్తోందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలపై వేటు, తమిళనాడు రాజకీయాలు చూశాక మోడీకి చంద్రబాబు, జగన్ భయపడుతున్నారా అన్న ప్రశ్న తలెత్తుతుందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ వలన జీడీపీ పెరిగిందంటున్నారని, అయితే డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి చెప్పిన ప్రకారం అంచనాలు ఎక్కువచేసి చెప్పమంటున్నారన్న విషయం తేలిపోయిందని ఉండవల్లి వ్యాఖ్యానించారు. ఇవన్నీ చూస్తుంటే 2019 ఎన్నికల్లో మోడీకి అడ్డుకట్ట వేయకపోతే దేశం విపత్తుకి దారితీస్తుందన్నారు. ప్రజాస్వామ్య మనుగడ దెబ్బతింటుందని, అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తుందన్నారు. ఇలాంటి పరిణామం మంచిది కాదన్నారు. రెవెన్యూ లోటు 16 వేల రూపాయలుగా లెక్క తేలిస్తే కేవలం మూడువేల కోట్లు ఇచ్చారని, రావాల్సిన 3 వేల 800కోట్లు కూడా ఇవ్వలేదని, పోలవరం బిల్లులు రూ.7 వేల కోట్లు పెడితే రూ.మూడువేల కోట్లు ఇచ్చారని, చేసిన పనికి బిల్లులు పంపితే ఇవ్వకపోతే ఎలాగని చంద్రబాబు ఆ లేఖ ద్వారా తేల్చారని ఉండవల్లి చెప్పారు. కోర్టుకి వెళ్తామని చెప్పిన చంద్రబాబు కేంద్రంపై వెళ్లడంలేదని అనడం వింతగా ఉందన్నారు. సుప్రీంకోర్టుకు వెళ్తానంటున్న చంద్రబాబు ముందు రాష్ట్రానికి ఎవరు అన్యాయం చేస్తున్నారో చెప్పాలన్నారు.

పోలవరం పనులు పాత ధరలకే ట్రాన్స్‌ట్రాయ్ చేయాలి తప్ప టెండర్లు పిలవరాదంటూ కేంద్ర మంత్రి గడ్కరి అన్న వ్యాఖ్యలను నిజం చేసేలా నవయుగ సంస్థకు అప్పగించామనే వార్తలు వచ్చాయన్నారు. పేరుకు నవయుగ ముందుకు వచ్చినట్లు చెప్పడంలో కూడా అర్థం లేదన్నారు. కాంట్రాక్ట్ మార్చాలంటే నిబంధనల ప్రకారం టెండర్లు పిలవాలేగానీ పనులు అప్పగించడంలో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో పొడిపిరెడ్డి అచ్యుత దేశాయ్, అల్లు బాబి, నక్కా శ్రీనగేష్, పసుపులేటి కృష్ణ పాల్గొన్నారు.



రాయలసీమ వర్సిటీ వీసీ చాంబర్ ముట్టడి

విశాలాంధ్ర - కర్నూలు (కలెక్టరేట్) : రాయలసీమ యూనివర్సిటీలో ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు విజయుడు, హలీమ్‌లను తక్షణమే విధుల నుంచి తప్పించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కర్నూలులోని యూనివర్సిటీలో వీసీ చాంబర్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వీసీ బయటకు వెళ్ళేందుకు ప్రయత్నించగా ఆఫీసును ముట్టడించి ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ వర్సిటీలో మహిళలపై కొనసాగుతున్న వేధింపులను ఆపడంతోపాటు పై ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌యూ ఏఐఎస్ఎఫ్ కమిటీ అధ్యక్షకార్యదర్శులు రమేష్, క్రిష్ణ మూర్తి, అంజి, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిత, లోకేష్, గిరి పాల్గొన్నారు

ప్రైవేటు వర్సిటీల బిల్లు అమలుకు సన్నాహాలు

విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రైవేటు యూనివర్సిటీల బిల్లు అమలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన వైద్య, ఆరోగ్యశాఖమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఎస్‌కేఆర్ మహిళా కళాశాలను సందర్శించారు. ముందుగా కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్థాపించిన 8 విద్యాసంస్థలను ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయానికి బదలాయించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇకపై ఎస్‌కేఆర్ కళాశాల సిటీ క్యాంపస్‌గా ఉంటుందన్నారు. విద్యాభివృద్ధికి రూ.23,200 కోట్లు ఖర్చు చేస్తున్నామని, రాష్ట్రంలో 45వేల పాఠశాలలకు రూ.4, 850 కోట్లు వెచ్చించి ప్రాథమిక అవసరాలు తీర్చగలుగుతున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రూ.259 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరలో ట్రైబల్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన కందుకూరి ఆస్తులను కాపాడుకుంటూ విద్యాభివృద్ధికి అందరూ కృషిచేయాలన్నారు. పార్లమెంటు సభ్యులు మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యేలు ఆకుల సత్యనారాయణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, ఆదిరెడ్డి అప్పారావు, మేయర్ పంతం రజనీ శేషసాయి సందేశాలిచ్చారు. అనంతరం అల్లు రామలింగయ్య హోమియో కళాశాల స్థలాన్ని పరిశీలించారు. బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గుడా ఛైర్మన్ గన్నికృష్ణ, సబ్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సూర్యభగవాన్, డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, కార్పొరేటర్ తలారి ఉమాదేవి, నగర ప్రముఖులు క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, తలారి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

10న దివ్యాంగుల రాజకీయ భేరి



విశాలాంధ్ర-మంగళగిరి : దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు శాతం చొప్పన రిజర్వేషన్ సౌకర్యం కల్పించేలా బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ తీర్మానం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 10వ తేదీన మంగళగిరిలోని వైష్ణవి, వైదేహి కళ్యాణ మండపంలో దివ్యాంగుల రాజకీయ భేరి సభ నిర్వహించనున్నట్లు ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలా జోజిబాబు తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గ కన్వీనర్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి ఆరున్నర దశాబ్దాలు గడచినా దివ్యాంగులు ఇప్పటికీ కూడు, గుడ్డ, గూడు కోసం పాలకులను యాచించాల్సి రావడం దురదృష్టకరమన్నారు. దివ్యాంగులంటే కేవలం పెన్షన్‌దారులుగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణించడం శోచనీయమన్నారు. 2016లో దివ్యాంగుల ముసాయిదా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే సమయంలో ఏ ఒక్క పార్టీ కూడా బిల్లులోని అంశాలను లేవనెత్తకపోవడం దివ్యాంగుల రాజకీయ శూన్యతకు దారితీసిందన్నారు నేడు చట్టాల రూపకల్పనలో ప్రధాన భూమిక పోషిస్తున్న స్థానిక సంస్థల్లో రాజకీయాల్లో రిజర్వేషన్ల కోసం దివ్యాంగులు పోరాటానికి సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ కన్వీనర్ కె శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 10వ తేదీన జరగనున్న దివ్యాంగుల రాజకీయ భేరికి దివ్యాంగులైన విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు గోగన ఆదిశేషు, శివశంకర్, గోపాల్ దాస్‌లు పాల్గొన్నారు.

టెక్నాలజీ ప్రజల గమనం, గమ్యాన్నే మార్చేసింది



విశాలాంధ్ర-కాకినాడ : ప్రపంచం నలుమూలలా విస్తరించిన ఇంటర్నెట్, కమ్యూనికేషన్ టెక్నాలజీలు ప్రజల జీవిత గమనాన్ని, గమ్యాన్ని పూర్తిగా మార్చివేశాయని సెయింట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ బీవీఆర్. మోహన్‌రెడ్డి అన్నారు. భావి ఇంజనీర్లు సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆధునిక సాంకేతికత సహాయంతో స్థిరమైన వ్యవస్థాపకులుగా ఎదగాలని పిలుపు నిచ్చారు. తూర్పుగోదావరిజిల్లా కాకినాడలోని జేఎన్‌టీ యూకే ఆరవ స్నాతకోత్సవం మంగళవారం ఉదయం వర్సిటీ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి, రాష్ట్రమంత్రి గంటా శ్రీనివా సరావు పాల్గొన్నారు. ఉపకులపతి వివిఎస్ఎస్. కుమార్ అధ్యక్షత వహించిన సభలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పు ఊహించనంత విధంగా దేశ విదేశాల ఆర్థిక వ్యవహారాలపై ప్రభావితం చూపుతుందన్నారు. ప్రతి పారిశ్రామిక విప్లవం ఒక అభివృద్ధిపథం వైపు దూసుకుపోయి దేశ ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశమవుతున్నదన్నారు. నాల్గవ పారిశ్రామిక విప్లవం భౌతిక, సంఖ్యాత్మక, జీవాత్మక మధ్యనున్న దూరాన్ని చెరిపివేసిందన్నారు. నేడు అంతర్జాలం సుమారు 20బిలియన్ మంది ప్రజలను ప్రభావితం చేస్తున్నదన్నారు. డిజిటల్ యుగంలో పలు టెక్నాలజీలకు డేటా అనేది మూలాధారమని, దీని వలన ప్రతీ పని సులువుగా జరిగేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు. సంఘానికి మేలు చేయడం కన్నా మించిన గురుతర బాధ్యత మరొకటి లేదని, కష్టపడే తత్వం, నిరంతర అభ్యాసన, ఆవిష్కరణలపై మక్కువ పెంచుకుని పరిశోధనలకు పెద్దపీట వేసి ఇతరులకు ఆదర్శం కావాలని కోరారు. మంత్రి గంటా శ్రీనివాస రావు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు, సమాజానికి బాధ్యత గల పౌరులను అందించడానికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు. రాష్ట్రం ఆర్థిక లోటుతో సతమతమవుతున్నా విద్యా విభాగానికి రూ.23,200కోట్ల నిధులు కేటాయించామన్నారు. విశ్వవిద్యాలయాలు అధ్యాపకుల కొరతను అధిగమించడానికి త్వరలో 1385 పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.380కోట్లు మంజూరయ్యాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉందని, విద్యా వ్యవస్థ కదులుతున్న చెక్క గుర్రం వంటిదన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని కృషితో విజయాన్ని సొంతం చేసుకోవాలన్నారు. ఆరవ స్నాతకోత్సవంలో భాగంగా 191 పీహెచ్‌డీలు, 69 బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ డా.పి. రవీంద్రబాబు, రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం, రిజిస్ట్రార్ ప్రొ.వి.వి. సుబ్బారావు, ఓఎస్‌డి ప్రొ.కె.వి.రమణ, డైరెక్టర్‌లు, మాజీ ఉపకులపతి ప్రొ.అల్లం అప్పారావు, ప్రోగ్రాం డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు, విద్యావేత్తలు, జిల్లా అధికారులు, ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా పోరాటమే అజెండా : రావుల వెంకయ్య



విశాలాంధ్ర-కాకినాడ :విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా దక్కే వరకు సీపీఐ అజెండాగా తీసుకుని పోరాడుతుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక గాంధీభవన్‌లో నగర పార్టీ 21వ మహాసభ పార్టీ సీనియర్ నాయకులు చింతపల్లి సుబ్బారావు, నక్కా కిషోర్ అధ్యక్షతన జరిగింది. తొలుత పార్టీ జెండాను రావుల వెంకయ్య ఎగురవేసి మాట్లాడుతూ స్వయాన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు రాష్ట్రంలో చిల్లిగవ్వ లేదని చెబుతుండగా, మరోపక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడంబరాలకు పోతున్నారని ఆయన విమర్శించారు. తెలుగుదేశం ప్రత్యేక హోదాకై పోరాడాలని, కేంద్రమంత్రులను రాజీనామా చేయించి, అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీకి తీసుకువెళ్ళాలని రావుల వెంకయ్య హితవు పలికారు. మొదటి నుంచి సీపీఐ ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితుల తదితర ప్రజా సమస్యలపై చిత్తశుద్దితో పోరాటం చేసిందన్నారు. చంద్రబాబు విధానాలకు రాష్ట్రం మరింత ఆర్థికంగా నష్టపోతుందని ఆయన వాపోయారు. జన్మభూమి కమిటీలు తెలుగుదేశం కమిటీలుగా ఉన్నాయన్నారు. 6 నుంచి 10వరకు కడపలో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో పార్టీ రాజకీయ విధానం ప్రకటిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతినిధులు ఇసుక, మట్టి, ఖనిజ మాఫీయాలతో అక్రమంగా సంపాదిస్తున్నారన్నారు. ఈ మహాసభలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, ఏఐటీయూసీ నాయకులు పి.ఎస్.నారాయణ, రూరల్ కార్యదర్శి కె.అంజిబాబు, గంటా లాజర్, బాబ్జి, రేజాకుల మంగ, ఏసుపాదం, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.బాబీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్, జాన్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన స్కీం వర్కర్లు



విజయవాడలో మానవహారం



ఒంగోలులో

- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, భారీ ప్రదర్శనలు
- కనీస వేతనం రూ. 18వేల చెల్లించాలి
- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు
- కార్మికులుగా గుర్తించాల్సిందే : ఓబులేసు

విశాలాంధ్ర,విజయవాడ(గాంధీనగర్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా కదం తొక్కారు. విధులను బహిష్కరించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. అలాగే జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాలు, కూడళ్ల వద్ద ధర్నాలు నిర్వహించి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మెలో భాగంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ. 18 వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. అలాగే రూ. 3 వేల పెన్షన్‌తోపాటు పీఎఫ్ గ్రాడ్యుటీ, వైద్య సదుపాయం కల్పించాలన్నారు. రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలకు నిధులు పెంచాలని, పథకాల ప్రైవేటీకరణ నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో పేదలను ఆదుకోవడం పౌష్టికాహారం అందించడం, స్త్రీ, శిశు మరణాలు తగ్గించడం, విద్య, వైద్యం అందించే లక్ష్యాలతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ, ఆశా మధ్యాహ్న భోజనం, వెలుగు, వీఓఏ, సెర్ప్ ఉపాధి హామీ, జాతీయ ఆరోగ్య మిషన్, సర్వశిక్షా అభియాన్, సాక్షర్ భారత్ జాతీయ బాలకార్మిక ప్రాజెక్టు, చంద్రన్న సంచార చికిత్స, 108 ఏపీ పాల్స్ వంటి పథకాలు క్రమంగా నిర్వీర్యం అయిపోతున్నాయన్నారు. ఇందుకు కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలే కారణమన్నారు. పథకాలకు సరిపడా నిధులను కేటాయించి లక్ష్యాలను పూర్తి చేయవలసిన ప్రభుత్వాలే ఈ పథకాలకు పెద్దఎత్తున కోత పెడుతున్నాయని విమర్శించారు. ఫలితంగా లబ్ధిదారులకు అందే సహాయం తగ్గిపోవడంతో పాటు ఈ పథకాల్లో పని చేసే కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. దశాబ్దాల తరబడి పని చేస్తున్న వీరిని కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. పార్ట్‌టైమ్, గౌరవవేతనం, పారితోషికాలు వంటి పేర్లతో కనీస వేతనాలు, పీఎఫ్, పెన్షన్, ఆరోగ్య సౌకర్యాలు వంటి సామాజిక భద్రత కల్పించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారని తెలిపారు. ఈ కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. చివరకు సుప్రీంకోర్టు సైతం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సామాజిక భద్రతను అమలు చేయాలని ప్రకటించినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైన చంద్రబాబు ప్రభుత్వం కళ్లు తెరిచి స్కీం వర్కర్లు కోరుతున్న విధంగా చర్యలు చేపట్టాలని లేకుంటే భవిష్యత్తులో ఈ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఓబులేసు హెచ్చరించారు. ఈ సందర్భంగా విజయవాడ ధర్నాచౌక్ వద్ద చేపట్టిన నిరసనలో ఏపీ స్కీమ్ వర్కర్ల ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు సీఐటియూ నాయకురాలు బేబి రాణి, స్కీమ్ వర్కర్ల ఐక్యకార్యచరణ కమిటీ నాయకురాలు కె స్వరూపారాణి, అంగన్‌వాడీ ప్రతినిధి లలితమ్మ, మధ్యాహ్న భోజన పథకం ప్రతినిధి ఎస్‌సీఎల్ సుప్రజ, ఆశావర్కర్ల ప్రతినిధి ఎ వెంకటేశ్వరరావు, శ్రామిక మహిళా ప్రతినిధి కె శైలజ, సర్వశిక్షా అభియాన్ ప్రతినిధి యం బాలకాశి, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో...రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా కర్నూలు కలెక్టరేట్ వద్దజరిగిన ధర్నాలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, సీఐటీయూ జిల్లా నాయకులు అంజిబాబుతోపాటు వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు.

కడపలో... కడపలో జరిగిన కార్యక్రమంఓ జెడ్పీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీలో పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు హాజరయ్యారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో.. అనంతపురంలో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుటన జరిగిన ధర్నాలో పలువురు నేతలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె రాజారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జె గోవిందు, ఉప ప్రధాన కార్యదర్శి ఎ మల్లికార్జు, నగర ప్రధాన కార్యదర్శి ఎస్ రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి వి కృష్ణుడు తిదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో... విశాఖపట్నంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు పడాల రమణతోపాటు వివిధ స్కీం వర్లర్ల సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయనగరంలో... విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాకు భోజన పథక జిల్లా అధ్యక్షుడు ఎం మురళీధరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెంకిలక్ష్మి, కోశాధికారి ఉంగరాల జయలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో... శ్రీకాకులం డే అండ్ నైట్ కూడలి వద్ద జరిగిన ధర్నాలో సీఐటీయూ నాయకులు టీ తిరుపతి రావుతోపాటు నేతలు కల్యాణి, రాజేశ్వరి తదితరులు హాజరయ్యారు.

నెల్లూరులో.. నెల్లూరులో కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దామా అంకయ్య, ఏఐయూటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె ఆంజనేయులు, సీఐటీయూ నాయకులు మోహనరావు హాజరయ్యారు.

ఒంగోలులో.. స్కీం వర్కర్ల సమస్యలను పరిస్కరించాలని డిమాండు చేస్తూ ప్రకాశంజిల్లా కేంద్రం ఒంగోలు కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌డీ సర్దార్, పీవీఆర్ చౌదరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీకటి శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో.. గుంటూరుజిల్లా నరసరావుపేట ఆర్డీఓ కార్యలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ పట్టన ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ ఏరియా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య, ఏరియా కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు హాజరయ్యారు.



నరసరావుపేటలో



కర్నూలులో

కాషాయ సర్కారును

సంతోష పెట్టేందుకే ఈ నిర్ణయం

అప్ ఎమ్మెల్యేల అనర్హత వేటును ఖండించిన సీపీఐ

విశాలాంధ్రబ్యూరో-న్యూఢిల్లీ : అప్ ఎమ్మెలేలను అనర్హులుగా ప్రకటించాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ సెంట్రల్ సెక్రటేరియట్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్ ఒక లేఖను మీడియాకు విడుదల చేసింది. లాభదాయకమైన పదవులు నిర్వహిస్తున్నారంటూ 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలపై కేంద్ర ఎన్నికల కమిటీ అనర్హత వేటు వేసిందని, ఇది ఎంత మాత్రం సమర్ధనీయం కాదని పేర్కొంది. ఎలాంటి ముందస్తు నోటీసులను ఎమ్మెల్యేలకు జారీ చేయకుండా కేంద్ర ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ తప్పు పట్టింది. అత్యవసరంగా ఆగమేఘాల మీద 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేపై వేటు వేయాలని నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న అంతర్యాన్ని ప్రశ్నించింది. అప్ నాయకుల వివరణను కూడా వినటానికి అవకాశం ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుందని సీపీఐ పార్టీ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. రాష్ట్రాల్లోని పార్లమెంటరీ కార్యదర్శి పదవులను నిర్వహించిన ఎంఎల్ఏలను అనర్హులుగా ప్రకటించేందుకు అదే ప్రమాణాలు ఎందుకు పాటించలేదని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సీపీఐ ప్రశ్నించింది. కేంద్ర ఎన్నికల కమిషనర్ తాను పదవీ విరమణ చేస్తున్న రోజే హడావిడిగా అప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయటంపై సీపీఐ పార్టీ పలు అనుమానాలను వ్యక్తం చేసింది. బీజేపీ అనుకూలంగా వ్యవహరించేందుకే కేంద్ర ఎన్నికల కమిషర్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఎన్నికల సంఘంపై సీపీఐ విమర్శలు గుప్పించింది. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ సర్కారును సంతోషం పెట్టేందుకే ఎన్నికల కమిషనర్ ఏకె జోతి ఈ విధమైన నిర్ణయం తీసుకున్నారని సీపీఐ పార్టీ భావిస్తుందన్నారు.



కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం

ఏఐటీయూసీ నేతలు ఓబులేసు, రవీంద్రనాథ్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రెండు దశబ్దాలుగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కాంలలో దాదాపు 25,000 మంది వరకు కాంట్రాక్టు కార్మికులు చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నా వారి సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడంలేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ అన్నారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ 2018 క్యాలెండర్, డైరీలను వీరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ సంస్థ ప్రయోజనాల కోసం కార్మికులు అర్థాకలితో అహోర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికులు న్యాయమైన డిమాండ్ల సాధనకోసం ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందన్నారు. ఇందుకు యాజమాన్యం, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణే ప్రధాన కారణమని విమర్శించారు. అనేక పర్యాయాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి, వినపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ప్రభుత్వం కేవలం హామీల వరకే పరిమితమవుతుందని విమర్శించారు. అంతిమంగా కార్మికులుఆందోళన బాటను ఎంచుకున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 27వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టే సమ్మెకు రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం ఏసోబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శివయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం గంగాధర్, పి ప్రసాద్, నరశింహులు, నూర్ బాషా, జాన్‌రాజు, ఆర్ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కలమటకు

నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్

విశాలాంధ్ర-హిరమండలం: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కొత్తూరు కోర్టు నాన్‌బెయిల్‌బుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఎమ్మెల్యేగా వైకాపాలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేయడంతో అప్పట్లో కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పట్లో కేసును మాఫీ చేసేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించినప్పటికీ కేసు కొట్టివేయడం జరగలేదు. అప్పటినుండి కోర్టుకు ఎమ్మెల్యే హాజరు కాక నిర్లక్ష్యం వహించడంతో కోర్టును ధిక్కరించిన నేరానికి ఎమ్మెల్యే కలమటకు కోర్టు నాన్‌బెయిల్‌బుల్ జారీ చేసింది.

చలో గొట్టిపాడుకు పోలీస్ అడ్డంకులు



నల్లపాడు పోలీసుస్టేషన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు



పాతగుంటూరు పోలీసుస్టేషన్ వద్ద బైఠాయించిన సీపీఐ నాయకులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి, నూతలపాటి చిన్నలను అడ్డుకుంటున్న పోలీసులు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో దళితులపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో వారిని పరామర్శించి సంఘీభావం తెలిపేందుకు వామపక్షాలు, పలు ప్రజా సంఘాలు బుధవారం తలపెట్టిన చలో గొట్టిపాడు నేపథ్యంలో గుంటూరులో వామపక్ష నాయకులను మంగళవారం అరెస్టులు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రిలతో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి గుంటూరులోని ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి తన వాహనంలో బయలుదేరి వెళ్ళుతుండగా కుంచనపల్లి అండర్ బ్రిడ్జి వద్ద మంగళగిరి సీఐ మధుసూధనరావు, తాడేపల్లి ఎస్సై ప్రతాప్‌కుమార్ తదితరులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గుంటూరు నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా విజయవాడలో సమావేశంలో పాల్గొని వాహనంలో గుంటూరుకు తిరిగి వస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర నాయకులు నూతలపాటి చిన్నలను గుంటూరు బస్టాండ్ వద్ద డిఎస్పీ కండె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని పాతగుంటూరు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పాతగుంటూరు పోలీసు స్టేషన్ వద్ద తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన చలో గొట్టిపాడు కార్యక్రమాన్ని ఆపలేరని ఈ సందర్భంగా వామపక్ష నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం పోలీసుల ద్వారా వామపక్ష నాయకులను అడ్డగించి అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. జిల్లా వ్యాప్తంగా వామపక్ష నాయకులను అరెస్టులు చేయడం, నోటీసులు పంపించడాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సీపీఐ జిల్లా కార్యాలయాన్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడం, పహారా ఏర్పాటు చేయడం దారుణమన్నారు. అణచివేసే చర్యలకు పాల్పడటం సమంజసం కాదని, దీనిని వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. చలో గొట్టిపాడు కార్యక్రమ విజయవంతానికి నేతలు, కార్యకర్తలతో పాటు ప్రజలు సంసిద్దంగా ఉన్నారని వివరించారు.

అభివృద్ధిలో భారత్‌ది 62వ స్థానం

దావోస్: అభివృద్ధి చెందుతున్న దేశాల సమ్మిళిత అభివృద్ధి సూచీలో భారత్ 62వ స్థానానికి పరిమితమైంది. పొరుగుదేశాలైన చైనా, పాకిస్థాన్‌ల కంటే వెనుకబడిపోయింది. ఈ సూచీలో చైనా 26వ స్థానంలో ఉండగా, పాకిస్థాన్ 47వ స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అత్యంత సమ్మిళిత ఆధునిక ఆర్థిక వ్యవస్థల జాబితాలో నార్వే మొదటి స్థానంలో ఉండగా, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల జాబితాలో లిథ్వేనియా తొలి స్థానంలో ఉంది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేత్తల సదస్సు ప్రారంభానికి ముందు ఈ అభివృద్ధి సూచీని విడుదల చేశారు. ఈ సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలు దేశాధినేతలు హాజరుకానున్నారు.జీవన ప్రమాణాలు, పర్యావరణ స్థిరత్వం, భవిష్యత్తు రుణాల నుంచి ముందు తరాలను రక్షించడం.. తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ జాబితాను సిద్ధం చేసినట్లు ఎకనమిక్ ఫోరం తెలిపింది.

గత ఏడాది జాబితాలో మొత్తం 79 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ 60వ స్థానంలో ఉంది. అప్పుడు చైనా 15వ స్థానంలో, పాకిస్థాన్ 52వ స్థానంలో ఉన్నాయి. 2018 సూచీలో 103 అభివృద్ధి చెందుతున్న దేశాలను పరిగణలోకి తీసుకున్నారు. ఎదుగుదల, అభివృద్ధి, సమ్మిళితం, తరాలలో సమానత్వం ఆధారంగా ఈ దేశాలను రెండు భాగాలుగా విడదీశారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థల జాబితాలో 29, అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో 74దేశాలు చేర్చారు. అడ్వాన్సింగ్ ట్రెండ్‌లో ఉన్న అభివృద్ధి చెందుతున్న 10 దేశాల జాబితాలో భారత్‌కు చోటుదక్కింది. కేవలం రెండు అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రమే అడ్వాన్సింగ్ ట్రెండ్‌లో ఉన్నాయి.

దావోస్ నుంచి సీఎం పలకరింత...

జాజివలస జనం పులకరింత



విశాలాంధ్ర-అమరావతి : జాజివలస, కొండలు, కోనల నడుమ మారుమూల జనజీవన స్రవంతికి దూరంగా, కనీసం ఫోను సదుపాయానికి కూడా నోచుకోకుండా ప్రకృతి ఒడిలో మారుమూల అటవీ ప్రాంతాంలో అలరారుతున్న అందాల సీమ. తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం మండలం, కనివాడ పంచాయతి పరిధిలోని ఈ గ్రామానికి ఇప్పటి వరకు ఎవరైనా వెళితే కనీసం మాట్లాడటానికి ఎలాంటి ఫోను సదుపాయం, నెట్ కనెక్షన్ ఉండేది కాదు. అలాంటి గిరిజన ప్రాంతాన్ని అక్కడ ప్రజలు ఏమాత్ర ఊహించని విధంగా దావోస్ నుంచి ముఖ్యమంత్రి నారా`ంద్రబాబు నాయుడు స్వయంగా వీడియో ఫోను ద్వారా పలుకరించి, వారి యోగక్షేమాలు అడిగే సరికి జాజివలస ప్రజలు పులకించిపోయారు. రంపచోడవరం నుంచి దాదాపు 80 కిలో మీటర్ల దూరంలో ఉండే ఈ పల్లెను తొలిసారిగా మంగళవారం ఫోను, ఇంటర్‌నెట్, కేబుల్ టీవీ సదుపాయాలు పలుకరించాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ సంస్థ వ్యవ ప్రయాసాలకు ఓర్చి ఈ మారుమూల గిరిజన గ్రామాన్ని సాధారణ జనంతో మమేకయ్యేలా కనెక్టివిటీ కల్పించింది. జాజివలసకు కల్పించిన ఈ సదుపాయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. జాజివలసకు కల్పించిన నవ సాంకేతిక సదుపాయం పనితీరు ఎలా ఉందో స్వయంగా అక్కడ గిరిజనులతో మాట్లాడి తెలుసుకున్నారు. జాజివలస ప్రజలతో ఫోను ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అక్కడ ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏమమ్మా ఈ సదుపాయం ఎలా ఉంది, దీనిద్వారా ఎలాంటి ఉపయోగాలు ఉంటాయని అనుకుంటున్నారు అని ఆయన గిరిజనలు అడిగారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కలలో ఊహించని విధంగా ముఖ్యమంత్రి స్వయంగా ఇలా తమను పలుకరించే సరికి ప్రజలు ఆనందడోలికల్లో తేలిపోయారు. సారూ..చాలా సంతోషం సారూ, మీరు మాతో ఇలా మాట్లాడటం, మా ఊరికి ఫోను ఇచ్చినారు మీరు, మీకు కృతజ్ఞతలు అని జాజివలస మహిళలు తెలిపారు. తమ ఊరికి తాము ఊహించని విధంగా రోడ్డు కూడా వేస్తున్నారని అది తమకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. దానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఒక్క ఫోను ఏంటమ్మా మీ ఊరికి ఇప్పుడు ఇంటర్‌నెట్, కేబుల్ టీవీ అన్నీ వచ్చాయి. టెలీమెడిసిన్ ఒక్కటేమిటీ దీనివల్ల మీకు తెలిసీ ప్రయోజనాలు మీకు ఎన్నో కలగబోతున్నాయి అన్నారు. జాజివలసకు ఫైబర్ నెట్ సదుపాయం కల్పించడం తనకు చాలా ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

ఫైబర్ నెట్‌కు అభినందనలు...

జాజివలస గిరిజన గ్రామానికి వైర్‌లెస్ నెట్ సదుపాయాన్ని దిగ్విజయంగా కల్పించిన ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ సంస్థను, ఆ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) అహ్మద్ బాబు, అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. గుడ్ చాలా బాగా చేశారు, ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో ఇలా ఏమాత్రం కనెక్టివిటీ లేని ప్రాంతాలకు ఇదే తరహా కనెక్టివిటీని కల్పించాలి అని సూచించారు. జాజివలకు ఈ సదుపాయం ఎలా కల్పించిందో ఫైబర్‌నెట్ సీఈఓ ఎ.బాబు వివరించారు.

ప్రపంచంలోనే తొలిసారి...

ఏ మాత్రం కమ్యూనికేషన్ సదుపాయం కల్పించడానికి అవకాశం లేని మారు మూల ప్రాంతాలకు కూడా ఇలా ఏకంగా టెలిఈఫోను, కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ సదుపాయాన్ని వైర్‌లెస్ ద్వారా కల్పించడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి అని ఫైబర్ నెట్ వర్గాలు తెలిపాయి. దీనికోసం ఫైబర్ నెట్ సంస్థ గూగుల్ ఎక్స్ సంస్థ సహకారం తీసుకుని ఎఫ్.ఎస్.ఓ.సి ద్వారా ఈ సదుపాయం కల్పించింది. దీనికోసం ఏపీ ఫైబర్ నెట్ చేసిన ప్రయత్నాలు విజయవంతమయ్యాయి.

ఏమిటీ ఎఫ్.ఎస్.ఓ.సి...

ఫ్రీ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్..(ఎఫ్.ఎస్.ఓ.సి) అనేది గూగుల్ ఎక్స్ సంస్థ అందిస్తున్న సరికొత్త సాంకేతిక సదుపాయం. ప్రపంచంలోనే ఇది అత్యుత్తమ సాంకేతిక సదుపాయం. ఏ మాత్రం సెల్ ఫోను సిగ్నల్లు లేని, కేబుల్ ద్వారా బ్రాడ్ బ్యాండ్ సదుపాయం కల్పించడానికి వీలులేని మారుమూల ప్రాంతాలకు వైర్‌లెస్ ద్వారా అన్ని రకాల కనెక్టివిటీ కల్పించడమే దీని ప్రత్యేకత. 20 కిలోమీటర్ల పరిధిలో దీని ద్వారా 20 జీబీపీఎస్ (గిగా బైట్స్ పర్ సెకండ్) వేగంతో ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించవచ్చు. ఎలాంటి కేబుల్ లేకుండానే ఆ ప్రాంత ప్రజలకు టెలిఫోను, అంతర్జాలం, కేబుల్ టీవీ ప్రసారాలను కల్పించవచ్చు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, సలహాలు, సూచనల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ సంస్థ రాష్ట్ర ప్రజలకు ఈ తరహా సదుపాయాన్ని కల్పిస్తోంది. తొలిసారిగా తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం మండలం, కనివాడ పంచాయతీకి చెందిన జాజివలసకు ఈ సదుపాయం కల్పించింది. దశల వారీగా మిగిలిన ప్రాంతాలకు కూడా ఈ సదుపాయం కల్పించనున్నట్లు ఏపీ ఫైబర్ నెట్ సీఈఓ ఎ.బాబు తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్నెట్, అంతర్జాలం, కేబుల్ టీవీ సదుపాయం లేని ఆవాసాలు అనేవి ఉండకూడదనేదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ఈ లక్ష్య సాధనకు ఫైబర్ నెట్ సంస్థ పునరంకితమవుతోందని తెలిపారు.

రాష్ట్రపతి ప్రశంసలు

ఏపీ ఫైబర్‌నెట్ పనితీరుకు రాష్ట్రపతి రామ్‌నాత్ కోవింద్ ప్రశంసలు, అభినందలు కూడా లభించాయి. ఇటీవలే ఆయన వెలగపూడి సచివాలయం నుంచి ఏపీ ఫైబర్ నెట్‌ను జాతికి అంకితం చేస్తూ సంస్థ పనితీరును, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతను ప్రశంసించారు. మిగిలిన రాష్ట్రాలకు ఏపీ ఫైబర్ నెట్ ఆదర్శం కావాలని సూచించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా ఏపీ అమలు చేస్తున్న ఫైబర్ నెట్ విధానాన్ని అనుసరించాలని అన్ని రాష్ట్రాలకు సిఫారసు చేసింది. పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడ ఏపీ ఫైబర్‌నెట్ అమలు తీరును అధ్యయనం చేసి తమ రాష్ట్రాల్లో దీన్ని అమలు చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టడం సంస్థ పనితీరుకు చిరు నిదర్శనం.

Dwaraka

ముందుగా వెళితేనే మేలు..!

దక్షిణాఫ్రికాను తేలిగ్గా భావించొద్దు • టీమిండియా మహిళా కెప్టెన్ మిథాలీ రాజ్



హైదరాబాద్ :
దక్షిణాఫ్రికా పర్యటనకు ముందుగా వెళ్లితే అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు అనువుగా ఉంటుందని భారత క్రికెట్ మహిళ కెప్టెన్ మిథాలీ రాజ్ పేర్కొంది. సౌతాఫ్రికాలో టీమిండియా ఫిబ్రవరి 5 నుంచి మూడు వన్డేలు మ్యాచ్‌లు ఆడనున్నది. 13 నుంచి టీ20లు కూడా ఆడుతుంది. ఈ నేపథ్యంలో టీం బుధవారం బయలుదేరి సౌతాఫ్రికా వెళ్లనున్నది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో మిథాలీ మాట్లాడుతూ గత ఏడాది ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచ కప్‌కు ముందుగా వెళ్లి ఉంటే ఎంతో బావుండేదని, ఫలితం వేరే విధంగా వచ్చేదని అభిప్రాయ పడింది. 'ముందుగా వెళ్లి, మ్యాచ్‌లు ఆడితే, అక్కడి వాతావరణానికి అలవాటు పడవచ్చు. బౌన్స్‌ను ప్రాక్టీస్ చేయ వచ్చు. ఉప ఖండం వికెట్లలో సాధారణంగా మనకు అలాంటి బౌన్స్ కనిపించదు. అలాంటి బౌన్సే మనకు కావాలి.. ఎందు కంటే ఈసారి మనం రెండు కొత్త బంతులతో ఆడనున్నాం.. ఈ విధంగా జరిగే మొట్టమొదటి అంతర్జాతీయ మ్యాచ్ ఇదే'నని మిథాలీ పేర్కొంది. మిథాలీ అభిప్రాయాన్ని కోచ్ తుషార్ ఆరోథే సమర్థించాడు. 'అవును..అక్కడి వాతావరణానికి అల వాటు పడటం ఎంతో ముఖ్యమైన విషయం. మొదటి వన్డే ముందే మనం కొన్ని ప్రాక్టీస్ మ్యాచులను ఆడనున్నాం. తదుపరి మ్యాచులకు ఇది ఎంతో మేలు చేస్తుంది' అని తెలి పాడు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న టీం ఇండియా పేలవమైన ఆటతో రెండు టెస్టుల్లోనూ పరాజయం పాలై విమర్శలను ఎదుర్కొంటోంది. అయితే ఆఫ్రికా టూర్ అంత సులువేమి కాదని మిథాలీ అంటోంది. 'దక్షిణాఫ్రికాను అంత తేలికగా భావించడం తప్పు. అదే విషయాన్ని టీం సభ్యులకు వివరించాను. క్వాడ్రాంగ్యులర్ సిరీస్‌లో ఆడేందుకు మనం ఇంతకు ముందే దక్షిణాఫ్రికా పర్యటించాం. దక్షిణాఫ్రికా ఎంతో బలంగా ఉంది. అదే విషయాన్ని మనం ప్రపంచ కప్‌లో గమనించాం. ప్రస్తుతం పోటీ పడి ఆడాల్సి ఉంది. ప్రతి ప్లేయర్‌ను నిశితంగా పరీక్షించాల్సి ఉంది. వరల్డ్ కప్‌లో రన్నర్లుగా నిలిచిన తర్వాత మనకు ఎక్కువ పేరు వచ్చింది. అయితే..ఆ తర్వాత దక్షిణాఫ్రికా ఎలాంటి మ్యాచ్‌లు ఆడలేదనే విషయాన్ని ఇక్కడ మనం గమనించాలి' అని మిథాలీరాజ్ అభిప్రాయ పడింది. వరల్డ్‌కప్ తరువాత ముఖ్యంగా స్వల్పంగా తగిలిన గాయాల నుంచి ఆడపిల్లలు కోలుకునేందుకు తగినంత సమయం దొరికింది. దాని నుంచి కోలుకున్న తరువాత మెరుగైన ప్రదర్శన అవసరం. అందుకోసం మీకు సమయం దొరికిందనుకుంటున్నా. బాగా శ్రమించి మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నాను' అని మిథాలీ ముగించింది.

ఆస్ట్రేలియా ఓపెన్‌లో
మరో సంచలనం..!



మెల్‌బోర్న్:
ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో మరో సంచలనం నమోదైంది. బల్గేరి యాకు చెందిన మూడో సీడ్ ఆటగాడు దిమిత్రోవ్.. అన్‌సీడెడ్ క్రీడాకారుడిగా బరిలోకి దిగిన బ్రిటీష్ యువ ఆటగాడు ఎడ్మండ్ చేతిలో ఘోర పరాజయం చవిచూశాడు. పురుషుల సింగిల్స్‌లో భాగంగా మంగళ వారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో ఎడ్మండ్ 6-3, 3-6, 6-3, 6-4 తేడాతో దిమిత్రోవ్‌ను ఓడించి సెమీ ఫైనల్‌కు చేరాడు. దాంతో గ్రాండ్ స్లామ్ టోర్నీలో తొలిసారి సెమీస్‌కు చేరిన ఘనతను సొంతం చేసుకు న్నాడు. మరొకవైపు గ్రాండ్ స్లామ్ ఓపెన్ ఎరాలో సెమీస్‌కు చేరిన ఆరో బ్రిటీష్ క్రీడాకా రుడిగా ఎడ్మండ్ గుర్తింపు సాధించాడు. ఎడ్మండ్‌తో హోరాహోరీగా సాగిన పోరులో దిమిత్రోవ్ తీవ్రంగా శ్రమించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తొలిసెట్‌ను కోల్పోయి వెనుకబడిన దిమిత్రోవ్.. రెండో సెట్‌లో గెలిచి పోరులో నిలిచాడు. అయితే కీలకమైన మూడోసెట్‌ను కాపాడుకోవడంలో విఫలమైన దిమి త్రోవ్ మళ్లీ వెనుకబడ్డాడు. ఆపై నాలుగో సెట్‌లో సైతం బల్గేరియా స్టార్ ఆటగాడు ఆకట్టుకోలేక పోవడంతో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. సోమవారం జరిగిన మ్యాచ్‌లో సెర్బియా స్టార్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ప్రిక్వార్టర్ ఫైనల్లో దక్షిణకొరియా ఆటగాడు హెయాన్ చుంగ్ చేతిలో జోకర్ ఓటమి పాలై టోర్నీ నుంచి వైదొలిగాడు.

ఛ్చ.. ఏం చేస్తారో..!

జొహానెస్‌బర్గ్:
వరుసగా తొమ్మిది టెస్టు సిరీస్‌లతో జైత్రయాత్ర. స్వదేశంలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌పై వంటి హేమాహేమీలపై తిరుగులేని విజయాలు. శ్రీలంకలో గతంలో ఏ భారత జట్టూ సాధించని విధంగా 3-0తో ప్రత్యర్థిని ఊడ్చిపారేసింది కోహ్లిసేన. ఇంటా.. బయట.. ఒకటే పొగడ్తలు. మాజీలు.. తాజాలు.. అందరూ టీమిండియా ప్రదర్శనకు ఫిదా! ఈ జట్టుకు ఇక తిరుగులేదు అని జయజయధ్వానాలు! దామిట్.. అంతలోనే కథ అడ్డం తిరిగింది. దక్షిణాఫ్రికా పర్యటనలో ఒక్క సిరీస్ ఓటమితో ఆ పటాటోపమంతా బద్దలైంది. ఆటగాళ్ల ఎంపికపై విమర్శలు. ఆటతీరుపై అందరి నోటి నుంచి తెగడ్తలు. డిసెంబర్ చివరి వరకు 'జయహో.. కోహ్లిసేన!' అనిపించుకున్న జట్టు కాస్తా 0-2తో తుస్సుమంది. పేలవమైన ఆటతో.. స్వీయ తప్పి దాలతో.. ఆటగాళ్ల ఎంపికలో గందరగోళంతో సర్వత్రా విమ ర్శలపాలైంది. చివరికి సఫారీల చేతిలో 0-3తో క్లీన్‌స్వీప్ అవుతారా లేదా 0-2తో కాస్తలో కాస్తయినా పరువు నిలుపు తారా అన్న పరిస్థితి తెచ్చుకుంది. డుప్లెసిస్ సేనతో బుధవారం నుంచే వాండరర్స్‌లో టీమిండియాకు చివరి పరీక్ష. మరి ఈ ఆఖరి పోరులో కోహ్లిసేన ఎలాంటి ప్రదర్శన ఇస్తుందో!

రహానె రాక!

ఇప్పటి వరకు 34 మ్యాచ్‌లకు సారథ్యం వహించిన కోహ్లిజట్టులో కనీసం ఒక్క మార్పయినా చేయకుండా ఒక్క మ్యాచ్ ఆడింది లేదు. ఈ సారీ అదే అలవాటు కొనసా గించాడు కోహ్లి. గత రెండు టెస్టుల్లో రహానెను తప్పించి రోహిత్‌ను ఆడించాడు. ఫామ్‌లో ఉన్న భువిని తప్పించాడు. ఇది పెద్ద దుమారమే రేపింది. తీవ్ర విమర్శలకు దారితీసింది. మ్యాచ్‌కు ముందు ఎన్నో విషయాలు పరిగణనలోకి తీసుకుం టాం అని చెబుతున్నా కోహ్లి, రవిశాస్త్రిపై కచ్చితంగా ఒత్తిడి నెలకొంది. ఈ నేపథ్యంలో వాండరర్స్ మ్యాచ్‌లో రహానె రాక ఖాయమే అన్న సూచనలు కనిపించాయి. రెండు రోజులుగా అతడు నెట్స్‌లో నాలుగు సెషన్ల పాటు కఠోరంగా శ్రమిం చాడు. సోమవారం భువి, ఇషాంత్, ఉమేశ్, షమి బౌలింగ్, బ్యాటింగ్ రెండింటినీ సాధన చేశారు. పిల్లల్లా తప్పులు చేసిన యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు చోటు ఇస్తారనే తెలుస్తోంది. ఇప్పటికీ రోహిత్‌ను తప్పించే అవకా శాలు లేవు. పిచ్ పచ్చికతో కళకళలాడుతున్న నేపథ్యంలో స్పిన్నర్లను ఆడించకుండా రోహిత్‌ను తుది జట్టులోకి తీసుకో వచ్చు. అశ్విన్ బ్యాటింగ్ సాధన చేయకపోవడం ఇందుకు ఊతం ఇస్తోంది. పార్థివ్ పటేల్‌ను తప్పించకపోవచ్చు. ఆరుగురు బ్యాట్స్‌మెన్, నలుగురు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్‌తో తుదిజట్టు ఉండనుందని ప్రాథమిక సమాచారం.



- నేటి నుంచి మూడో టెస్టు
- ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కోహ్లిసేన
- ఈ పిచ్ కూడా కఠినమే..!

ఇప్పటి వరకు వైట్‌వాష్ లేదు

భారత జట్టు 1992 నుంచి 6 సార్లు దక్షిణాఫ్రికాలో పర్యటించింది. సచిన్ సారథ్యంలో 1996-97లో మూడు టెస్టుల సిరీస్‌లో 0-2తో ఓటమే ఇప్పటి వరకు అత్యంత చెత్త ప్రదర్శన. ఇక 2006 నుంచి కనీసం ఒక టెస్టయినా గెలవ డమో లేదంటే డ్రా చేసుకోవడమో సంప్రదాయంగా వస్తోంది. మూడో టెస్టు జరిగే వాండరర్స్‌లో భారత్ ఓడిపో యిందే లేదు. 1992 నవంబర్, 1997 జనవరి, 2006 డిసెంబర్, 2013 డిసెంబర్‌లో ఇక్కడ మ్యాచ్‌లు ఆడింది. పేసర్ శ్రీనాథ్ 8/99తో వీరోచిత బౌలింగ్‌తో అదరగొట్టడంతో ద్రవిడ్ సార థ్యంలో 2006లో భారత్ గెలిచింది ఇక్కడే. 11 ఏళ్ల తర్వాత ఇక్కడ అడుగుపెడుతున్న కోహ్లిసేన మాత్రం కనీసం డ్రానైనా చేస్తుందా లేదా అన్న సందేహాలు కలిగిస్తుం డటం గమనార్హం. పిచ్‌పై తగినంత పచ్చిక ఉందని బౌన్స్, పేస్, స్వింగ్‌కు చక్కగా అనుకూలిస్తుందని స్థానిక క్యూరేటర్ చెబుతున్నాడు.

టెన్షన్‌లెస్ ప్రొటీస్

ఇప్పటికే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న ఆతిథ్య దక్షిణాఫ్రికా నిశ్చింతంగా కనిపిస్తోంది. వారికి ఎలాంటి ఆందోళన లేదు. తిరిగి టెస్టుల్లో అగ్రస్థానానికి చేరుకునేం దుకు నామమాత్రమైన చివరి టెస్టునూ అంత తేలిగ్గా తీసుకునేట్టు కనిపించడం లేదు. డుప్లెసిస్ ఇంతకుముందే ఈ సూచన చేశాడు. రెండో టెస్టులో గాయపడ్డ మార్క్రమ్ బుధవా రానికి ఫిట్ అయ్యే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్ ఉన్న నేపథ్యంలో సఫారీలు తమ రిజర్వు ఆటగాళ్ల బలాన్ని పరీక్షించే అవకాశాలున్నాయి. బ్యాట్స్‌మన్ బవుమా గాయంతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. క్రిస్‌మోరిస్, డీబ్రూన్‌కు జట్టులో చోటు దక్కుతుందేమో చూడాలి.

జట్లు (అంచనా) :

భారత్: విరాట్ కోహ్లి (సారథి), శిఖర్ ధావన్, మురళీ విజయ్, కేఎల్ రాహుల్, ఛతేశ్వర్ పుజారా, అజింక్య రహానె, రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహా, హార్దిక్ పాండ్య, అశ్విన్, జడేజా, భువనేశ్వర్, ఇషాంత్, ఉమేశ్, షమి, బుమ్రా, పార్థివ్ పటేల్.

దక్షిణాఫ్రికా: డుప్లెసిస్ (సారథి), డీన్ ఎల్గర్, అయిడెన్ మార్క్రమ్, హషీమ్ ఆమ్లా, డి బ్రూన్, క్వింటన్ డికాక్, కేశవ్ మహరాజ్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, వెర్నాన్ ఫిలాండర్, రబాడ, అండిలె ఫెహ్లుక్‌వాయో, లుంగి ఎంగిడి, డానీ ఒలివర్.

మ్యాచ్ : మధ్యాహ్నం 1:30 నుంచి..

టీం ఇండియా పరాజయంపై అడ్మినిస్ట్రేషన్ కమిటీ సమీక్ష

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన అనంతరం టీం ఇండియా పరాజయాన్ని సమీక్షించాలని బీసీసీఐని నడిపిస్తున్న కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (సీఓఏ) నిర్ణయించింది. టీం ఇండియా కేప్ టౌన్, సెంచూరియన్‌ల్లో ఘోరా పరాజయం పాలై సిరీస్‌ను కోల్పోయింది. బుధవారం జొహానస్‌బర్గ్‌లో చిట్ట చివరిది, మూడవదైన టెస్టు మ్యాచ్ ఆరంభం కానుంది. 'టీం మేనేజర్ నుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం పరాజయ కారణాల్ని సమీక్షిస్తాం. ఆటగాళ్లు, అధికారులు దక్షిణాఫ్రికాలో ఉండటం వల్ల ప్రస్తుతం ఏమీ చేయలేమ'ని మంగళవారం జరిగిన సీఓఏ సమావేశంలో పాల్గొన్న బీసీసీఐ అధికారి పేర్కొన్నారు. సమావేశంలో సీఓఏ అధినేత వినోద్ రాయ్, సభ్యులు డయానా ఇడుల్జీ, బీసీసీఐ ఛీఫ్ రాహుల్ జొహ్రీ పాల్గొన్నారు. అయితే బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరిలకు ఈ సమావేశానికి ఆహ్వానించలేదు.

ఐపీఎల్ టైమింగ్స్‌పై అసంతృప్తి

న్యూఢిల్లీ : ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచుల ఆరంభ వేళల్లో మార్పులపై ఆయా జట్ల ఫ్రాంఛైజీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. పదేళ్లుగా లీగ్‌లో సాయంత్రం మ్యాచ్ 4గంటలకు, రాత్రి పోరు 8గంటలకు ఆరం భమవుతుండగా ఈ ఏడాది 5.30కి, 7గంటలకు మొదలవుతున్నట్లు లీగ్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా సోమవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. స్టార్ స్పోర్ట్స్ సంస్థ కోరిక మేరకే మ్యాచ్ వేళల్ని మార్చినట్లు ఆయన తెలిపారు. ఈ తాజా మార్పుపై ఐపీఎల్‌లో పాల్గొనే జట్ల ఫ్రాంఛైజీ యాజమాన్యాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. తాజాగా పలు ఫ్రాంఛైజీ జట్ల యజమానులు మాట్లాడుతూ.. 'మ్యాచుల ఆరంభ వేళల్లో మార్పులు చోటు చేసుకున్నట్లు మేము మీడియా ద్వారానే విన్నాం. దీనిపై బీసీసీఐ మాతో చర్చించలేదు. ఒకసారి మాట్లాడుంటే బాగుండేది. ఆరంభ వేళల్లో మార్పులు ఉంటాయని కూడా బీసీసీఐ అగ్రిమెంట్‌లో పేర్కొలేదు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. సాయంత్రం మ్యాచ్‌లు 4గంట లకే ఆరంభం కావడం వల్ల ఆశించిన స్థాయిలో ఆదరణ ఉండటంలేదని.. అందుకే ఈ మార్పు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐపీఎల్ 11వ సీజన్ ఏప్రిల్ 7న ప్రారంభమై మే 27తో ముగియనుంది.

'వాండరర్స్'పై టీమిండియా అసంతృప్తి

జొహనెస్‌బర్గ్ : ఆతిథ్య దక్షిణాఫ్రికాతో చివరి టెస్టుకు కోహ్లిసేన సిద్ధమౌతోంది. జొహనెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో బుధవారం ఈ మ్యాచ్ ప్రారంభంకానుంది. ఇందుకోసం ఇప్పటికే మైదా నంలో కోహ్లిసేన కసరత్తులు చేస్తోంది. ఐతే ప్రాక్టీస్ చేసేందుకు పిచ్ అనుకూలంగా లేదని ఫిర్యాదు చేశాడు బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్. మూడో టెస్టు కోసం ఆదివారం నుంచి టీమిండియా ప్రాక్టీస్ మొదలెట్టింది. సాధన కోసం ఏర్పాటు చేసిన మూడు ప్రాక్టీస్ వికెట్లను చూసిన సంజయ్ ప్రధాన కోచ్ రవిశాస్త్రికి ఫిర్యాదు చేశాడు. వెంటనే శాస్త్రి పిచ్ క్యూరేటర్‌తో మాట్లాడి వికెట్లను రీ రోలింగ్ చేయాలని కోరాడు. దీంతో క్యూరేటర్ వెంటనే సిబ్బందిని పిలిచి వికెట్లను రీ రోలింగ్ చేశాడు. అనంతరం యథావిధిగా ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. వాండరర్స్ మైదానం పేసర్లకు బాగా అనుకూలం. ఈ నేపథ్యంలో భారత ఆటగాళ్ల ప్రాక్టీస్‌కు కేటాయించిన వికెట్లపై బంతి ఆశించిన స్థాయిలో బౌన్స్ అవ్వకపోవడాన్ని గమనించే రీ రోలింగ్ చేయించాలని రవిశాస్త్రిని కోరినట్లు బంగర్ తెలిపాడు. మూడు టెస్టు మ్యాచుల సిరీస్‌లో చివరి టెస్టు బుధవారం ప్రారంభంకానుంది.

సీపీఐకి 'వంకా' దంపతుల విరాళం



విశాలాంధ్ర-తణుకు : వచ్చేనెల 19, 20, 21 తేదీల్లో తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న సీపీఐ 25వ జిల్లా మహాసభలు విజయవంతం కావాలని కోరుతూ సీపీఐ మాజీ ఎమ్మెల్యే వంక సత్యనారా యణ, నాగమణి దంపతులు రూ.10వేల విరాళం ప్రకటించారు. మంగళ వారం ఆ విరాళాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్‌లకు అందజేశారు. సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెక్కంటి సుబ్బారావు, బండి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పి.కన్నబాబు, స్థానిక నేతలు గార ప్రసాద్ పాల్గొన్నారు.





మోడీ ప్రభుత్వంతోనే దేశానికి ముప్పు

- కార్పొరేట్ల సేవలో తరిస్తున్న కేంద్రం
- దేశంలో ఆర్థిక మాఫియా రాజ్యమేలుతోంది
- బీజేపీ ఆగడాలను అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకే ఉంది
- సీపీఐ కృష్ణాజిల్లా 24వ మహాసభలో జాతీయ కార్యదర్శి కె.నారాయణ

విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ/నందిగామ :
'ఎన్నికల ముందు బీజేపీ నేతలు కమ్యూనిస్టులు విదేశీ తొత్తులని విషప్రచారం చేశారు. తామే దేశభక్తులమని గొప్పగా చెప్పుకున్నారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా పని చేస్తోంది. దేశానికి పెనుముప్పుగా పరిణమించింది..' అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. నందిగామలోని ఓసీ క్లబ్‌లో అమరజీవి సూర్యదేవర నాగేశ్వరరావు సభా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సీపీఐ కృష్ణాజిల్లా సమితి 24వ మహా సభల్లో రెండోరోజు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. దేశంలో ఆర్థిక మాఫియా రాజ్యమేలుతోందన్నారు. ఈ మాఫియా కోసం అత్యున్నత వ్యక్తులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని, అందువల్లే ఒక మాజీ ముఖ్యమంత్రి ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మక సీబీఐ, ఎలక్షన్ కమిషన్, సుప్రీంకోర్టు వంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రపతిని కూడా తమ చెప్పుచేతుల్లో పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తు న్నారాన్నరు. హైకోర్టులో కేసు నడుస్తుండ గానే ఢిల్లీలో ఆప్ ఎమ్మె ల్యేలపై అనర్హత వేటు వేయడం కేంద్ర ప్రభుత్వ అధికార దాహానికి నిదర్శనమన్నారు. వీహెచ్‌పీ అగ్రనేత ప్రవీణ్ తొగాడియాను సైతం వదల్లేదన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమ్యూనిస్టులతో కలుస్తామని చెబితే 24 గంటల్లో జైలుకు వెళతార న్నారు. పేదల నుంచి పన్నులు వసూలు చేసి పెద్దలకు, కార్పొరేట్ సంస్థలకు అప్పులు ఇస్తున్నా రన్నారు. ఆ అప్పులను వసూలు చేయ కుండా, పేదలు బ్యాంకుల్లో దాచుకున్న డిపాజిట్లను కూడా దోచుకునేం దుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను తిప్పికొట్టి ప్రజ లను, దేశాన్ని రక్షించే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఇందుకోసం కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లాలని, ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడాలని, ఒక అడుగు బయటకు, మరో అడుగు జైలులో పెట్టాలని పిలుపునిచ్చారు. అవసరమైతే లౌకిక, ప్రజాతంత్ర, ప్రజాస్వామికవాదులతో కలిసి దేశ వ్యాప్తంగా మోడీకి వ్యతిరేకంగా ఫ్రంట్ ఏర్పాటు చేసే అంశాన్ని త్వరలో జరిగే తమ పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. మోడీ ఒత్తిడి వల్లే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్‌కు ఆర్థిక సహాయం నిలిపివేశారని బీజేపీ నేతలు గొప్పలు చెబుతున్నారని, నిజంగా మోడీకి అంత విలువ ఉంటే హెచ్1బి వీసా సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు.

ప్రతి గ్రామంలో పోటీ చేయాలి : రామకృష్ణ

మహాసభల్లో మధ్యాహ్నం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలలో కమ్యూనిస్టు పార్టీలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీకి ఒక ప్రత్యే కత ఉందని, దానిని కాపాడుకోవాలని శ్రేణులకు సూచించారు. ఉద్యమాలకే పరిమితం కాకుండా రానున్న ఎన్నికల్లో సీపీఐ శాఖ ఉన్న ప్రతిచోటా పోటీచేయాలని ఆయన చెప్పారు. అణగారిన వర్గాలకు కూడ గట్టుకుని, అనుబంధ సంఘాలను బలోపేతం చేసుకోవాలని సూచిం చారు. భవిష్యత్ అంతా కమ్యూనిస్టులదేనన్నారు. నాయకులు, కార్యక ర్తలు తమ పని విధానం మార్చుకుని సానుకూల వాతావరణం ఏర్పరు చుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. అవసరమైతే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఏకమై 'యాంటీ మోడీ' అనే నినాదంతో ముందుకుసాగాల్సి ఉందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా మోడీపై యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ఈ క్రమంలో పవన్ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో కూడా మంతనాలు జరిపే అవకాశం ఉందన్నారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని సీఎం చెబుతూనే.. మరోవైపు రూ.2లక్షల కోట్ల బడ్జెట్‌ను రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నారని, వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రలో కేవలం రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్ల రూపాయలు దాటలేదని గుర్తుచేశారు. తొలుత పార్టీ పతా కాన్ని సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, వీరులపాడు సర్పంచ్ గద్దం కోటేశ్వరరావు ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపాన్ని మాజీ ఎమ్మెల్యే షేక్ నాసర్‌వలీ ఆవిష్కరించారు. దివంగత నేతలు ఏబీ బర్దన్, సూర్య దేవర నాగేశ్వరావు చిత్రపటాల వద్ద నాయకులు నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ కార్యదర్శి నివేదికను సమర్పించారు. అనంతరం ప్రతినిధులు తమ అభిప్రాయా లను వెల్లడించారు. ఈ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని రామారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జరబన నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీనియర్ నాయకుడు పల్లా సూర్యారావు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.